మంగళవారం
30•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 35
• పేజీలు: 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ముఖేశ్‌గౌడ్ ఇకలేరు

క్యాన్సర్‌కు చికిత్స పొందుతూ మాజీమంత్రి కన్నుమూత

- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన సీఎం కేసీఆర్
- నేడు ప్రభుత్వలాంఛనాలతో అంత్యక్రియలు
- ఏర్పాట్లుచేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు
- ముఖేశ్ పార్థివదేహానికి ప్రముఖుల నివాళి

హైదరాబాద్/అబిడ్స్/బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ:

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత మూల ముఖేశ్‌గౌడ్ (60) కన్నుమూశారు. కొంతకాలంగా ఆయన క్యాన్సర్‌కు చికిత్స పొందుతున్నారు. ఆదివారం రాత్రి పరిస్థితి విషమించడంతో జూబ్లీహిల్స్ అపోలో దవాఖానకు కుటుంబసభ్యులు తరలించారు. సోమవారం మధ్యాహ్నం దవాఖానలోనే తుదిశ్వాస విడిచారు. ముఖేశ్‌గౌడ్ భౌతికకాయానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని జాంబాగ్ మార్కెట్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఉంచుతారు. తర్వాత ఫిల్మ్‌నగర్ జేఆర్సీ ఫంక్షన్‌హాల్ సమీపంలోని గౌడ శ్మశానవాటికలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. ముఖేశ్‌గౌడ్ మృతిపై సీఎం కేసీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించాలని ఆదేశించారు. తగిన ఏర్పాట్లుచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి సూచించారు.
2018 అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీచేసిన ముఖేశ్‌గౌడ్ బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ చేతిలో ఓడిపోయారు. అనంతరం క్యాన్సర్‌బారిన పడినట్టు

మిగతా 2వ పేజీలో

జూరాల ఒడిలోకి కృష్ణమ్మ

కోటి ఆశల మధ్య లక్ష క్యూసెక్కులు

ఆల్మట్టి నుంచి నారాయణపురకు..నారాయణపుర నుంచి దిగువకు
1.23 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల .. జూరాల చేరిన జలాలు
నీటి ఎత్తిపోతకు సిద్ధమవుతున్న లిఫ్టులు
ఇదే వరదకొనసాగితే మూడునాలుగు రోజుల్లో శ్రీశైలానికి! 3

సోమవారం మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఎదుల్లబందం గ్రామ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న తుంతుంగా చెరువు మత్తడి నీరు

చిందేసిన చినుకు

- మరో రెండ్రోజులు విస్తారంగా వర్షాలు
- 38 నుంచి 21 శాతానికి తగ్గిన వర్షపాత లోటు
- కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో మించిన సగటు
- వారంరోజుల తర్వాత మరింత భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- ఊపందుకున్న వ్యవసాయ పనులు

ఉప్పొంగిన వాగులు

- పలు ప్రాంతాలకు రాకపోకలు బంద్
- సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- అత్యధికంగా ఇచ్చోడలో 89.4 మి.మీ. వర్షపాతం నమోదు

ఉపరితల ఆవర్తనం, ద్రోణి కారణంగా రాష్ట్రంలో మరో రెండ్రోజులు కూడా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశమున్నది. నాలుగు రోజులుగా కురుస్తున్న వానల ఫలితంగా వర్షపాత లోటు క్రమేణా తగ్గుతున్నది. మరోవారం తర్వాత కూడా రుతుపవనాలు మరింత బలపడి భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొనడం రైతుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోమవారం భారీ వర్షాలు కురిశాయి. వాగులు పొంగిపొర్లడంతో సమీప గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అక్కడక్కడ పంట పొలాలు నీటమునిగాయి.

వివరాలు 2, 7 పేజీల్లో

భూగర్భ జలప్రపంచం

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ సర్జ్‌పూల్ వద్ద ఎత్తిపోతలకు సిద్ధమైన బాహుబలి మోటార్లు

బరాజ్‌లలో నీటి నిల్వలు

- మేడిగడ్డ: 4.584 టీఎంసీలు
- అన్నారం: 7.77 టీఎంసీలు
- సుందిల్ల: 5.82 టీఎంసీలు

- ఐదోతేదీ తర్వాత అద్భుతం ఆవిష్కారం!
- ఎత్తిపోతలకు బాహుబలి మోటర్లు సిద్ధం
- కాళేశ్వరం ప్రాజెక్టులో అతి కీలకఘట్టం
- ఆసక్తిగా ఎదురుచూస్తున్న కోట్లమంది ప్రజలు
- భారీ మోటర్ల వెట్‌రన్‌కు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాలు
- సమాయత్తమైన అధికార యంత్రాంగం
- నేడు నందిమేడారంలో ఐదో పంపు వెట్‌రన్

కడపత్రి ప్రకాశ్‌రావు, నమస్తే తెలంగాణ, కరీంనగర్ ప్రధాన ప్రతినిధి:

కాళేశ్వరం ప్రాజెక్టులో మరో కీలకఘట్టానికి వేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటివరకు జరిగిన ఎత్తిపోతలన్నీ గంగమ్మ నదీగర్భంలోనే నిర్వహించగా.. ఇక భూగర్భంనుంచి జలాలను ఎత్తిపోసే అద్భుతఘట్టం ఆవిష్కారంకానున్నది. ఆసియాలోనే అత్యంత శక్తిమంతమైన 139 మెగావాట్ల భారీమోటర్లు లక్ష్మీపూర్‌లో భూగర్భ జలప్రపంచంలా భాసిల్లుతున్న సర్జ్‌పూల్‌నుంచి నీటిని ఎత్తిపోసేందుకు సమాయత్తం అవుతున్నాయి. ఇప్పటికే మేడిగడ్డ నుంచి బయల్దేరిన ప్రాణహిత జలాలు గోదావరి నదీగర్భంలో ఎదురెక్కి.. అన్నారం, సుందిల్ల బరాజ్‌లను దాటుకుని.. గోలివాడలోని సుందిల్ల పంప్‌హౌస్‌ను చేరుకున్నాయి. ఇక్కడి నుంచి ఎల్లంపల్లి జలాశయంలోకి జలాల మళ్లింపుతో అసలైన ప్రక్రియ ప్రారంభంకానున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకఘట్టమైన లింక-2లోని లక్ష్మీపూర్ వద్ద బాహుబలి మోటర్లను ఆగస్టు

మిగతా 3వ పేజీలో

హెడ్‌రెగ్యులేటరీ ద్వారా సుందిల్ల పంప్‌హౌస్ ఫోర్‌బేలోకి చేరుకుంటున్న ప్రాణహిత జలాలు

సంద్రంలా సుందిల్ల

- కాళేశ్వరం పంప్‌హౌస్‌లలో కొనసాగుతున్న ఎత్తిపోతలు
- నేడో రేపో సుందిల్ల పంప్‌హౌస్‌లో 1వ మోటర్ వెట్‌రన్
- మేడిగడ్డ బరాజ్‌లో పెరుగుతున్న నీటిమట్టం
- తుపాకులగూడెం వద్ద గోదావరి పరవళ్లు
- కడెం దూకుడు
- భద్రాద్రి వద్ద పెరిగిన వరద

3

కాళేశ్వరంలో చేపల సాగు

- ప్రణాళికలు రూపొందించిన మత్స్యశాఖ
- 1.24 కోట్ల చేప, 25 లక్షల రొయ్య పిల్లలు వదిలేందుకు సిద్ధం
- ప్రాజెక్టు ప్రారంభించడానికి మూడునెలల ముందే బేస్‌లైన్ సర్వే
- రాష్ట్రంలో గణనీయంగా పెరుగనున్న చేపల ఉత్పత్తి

2

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు

సోమవారం హైదరాబాద్‌లో కేంద్రమాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డి అంతిమయాత్ర దృశ్యం

అధికార లాంఛనాలతో జైపాల్‌రెడ్డి అంత్యక్రియలు

భారీగా తరలివచ్చిన రాజకీయ ప్రముఖులు
నివాళులర్పించిన స్పీకర్ పోచారం
సంతాప సందేశం పంపిన మాజీ ప్రధాని మన్మోహన్ 2
పాడె మోసిన కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, మాజీ స్పీకర్ రమేశ్
శోకసంద్రంగా హుస్సేన్‌సాగర్ తీరం

వెంకయ్య కంటతడి

రాజ్యసభలో సంతాప తీర్మానం చదువుతూ తీవ్ర భావోద్వేగం 5
జైపాల్‌రెడ్డితో తనది 40 ఏండ్ల అనుబంధమని వ్యాఖ్య



జాతీయ వైద్య కమిషన్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- వైద్య విద్య రంగంలో 'ఇన్‌స్పెక్టర్ రాజ్'కు చరమగీతం 4
- చరిత్రలో అతిపెద్ద సంస్కరణగా ఇది నిలిచిపోతుంది: కేంద్రమంత్రి హర్షవర్ధన్
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని విపక్షాల ఆందోళన..సభ నుంచి వాకౌట్

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

ఫారం ధర	85.00	రిటైల్ లైవ్	107.00
డ్రెస్‌డ్	155.00	స్కిన్‌లెస్	177.00

గుడ్ల ధరలు (వందకు) (రూ.)

హైదరాబాద్	311.00	రంగారెడ్డి	311.00
మెదక్	311.00	కరీంనగర్	314.00
వరంగల్	314.00	చిల్లర ధర	3.70

ధర్మగంట

• భలే మంచి చౌక బేరం

ఎకరా 20 వేలే!

అమ్మకానికి ప్రభుత్వ భూమి
వీఆర్వోలదే ఇష్టారాజ్యం

నల్లగొండ జిల్లా చందంపేట రెవెన్యూ సిబ్బంది అక్రమదందా
ఒక్కొక్కరికి 20 నుంచి 50 ఎకరాలు పట్టా
250 ఎకరాల ప్రభుత్వభూమి హాంఫట్
స్థానిక ప్రజాప్రతినిధులకూ వాటాలు
కిందిస్థాయి సిబ్బంది బెదిరింపులతో సెలవుల్లో తాసిల్దార్లు
ఏండ్లుగా డిప్యూటీ తాసిల్దార్‌కే ఇంచార్జి బాధ్యతలు

రాళ్లు, రప్పలు, గుట్టలు.. ఎలాంటి భూమి అయినా లక్షలు పలుకుతున్న ఈ రోజుల్లో ఎకరం రూ.20 వేలకే దొరుకుతున్నది. ఆశ్చర్యపోతున్నారా?.. ఇది నిజం. అమ్ముతున్నది ప్రభుత్వ భూమి కాగా.. అమ్ముతున్నవారు స్వయానా రెవెన్యూ సిబ్బంది. కారుచౌకగా అమ్మడమే కాదు నేరుగా పట్టాలు ఇచ్చేస్తున్నారు. ఇంకేముంది అన్ని ప్రాంతాలనుంచి పె(గ)ద్దలు అక్కడ వాలారు. ఒక్కొక్కరు ఇరవై నుంచి యాభై ఎకరాల వరకు కొనేశారు. రెవెన్యూ సిబ్బంది ఏకంగా 250 ఎకరాలు అమ్మేశారు. పనిలోపనిగా చుట్టుపక్కల గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులూ తమ బంధువుల పేరిట పట్టాలు చేయించుకున్నారు. ఇక్కడికి ఏ తాసిల్దార్ వచ్చినా కిందిస్థాయి సిబ్బంది బెదిరింపులతో రెండుమూడ్నెళ్లలో బిచాణా సర్దాల్సిందే.. ఇది నల్లగొండ జిల్లా చందంపేట తాసిల్‌లో సిబ్బంది భూ దందా. వివరాలు 9వ పేజీలో

యెడియూరప్ప విజయం

విశ్వాసపరీక్షలో నెగ్గిన కర్ణాటక సీఎం
సొంతగానే మ్యాజిక్‌ఫిగర్ అందుకున్న బీజేపీ
కనీసం ఆరునెలలపాటు ప్రభుత్వానికి ఢోకా లేనట్టే
బలపరీక్ష అనంతరం స్పీకర్ రమేశ్‌కుమార్ రాజీనామా 5
ఎమ్మెల్యేలనుద్దేశించి భావోద్వేగ ప్రసంగం

అల్లం నారాయణ పదవీకాలం పొడిగింపు



సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అల్లం నారాయణ

సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా అల్లం నారాయణ పదవీకాలాన్ని మరో ఏడాది పొడిగించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను సోమవారం ప్రగతిభవన్‌లో కలిసి అల్లం నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 30తో ముగిసిన పదవీకాలాన్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో మంగళవారం అందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం నాలుగేండ్లుగా అమలుపరుస్తున్న జర్నలిస్టుల శిక్షణ, సంక్షేమ కార్యక్రమాలపై మీడియా అకాడమీ ప్రచురించిన పుస్తకాన్ని సీఎం కేసీఆర్‌కు ఈ సందర్భంగా అల్లం నారాయణ అందజేశారు.

సినారెకు కేటీఆర్ నివాళి

సినారెకు నివాళులర్పిస్తూ కేటీఆర్ చేసిన ట్వీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తన సాహిత్యంతో తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తంచేసిన మహాకవి, గొప్ప రచయిత డాక్టర్ సీ నారాయణరెడ్డి అని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు కొనియాడారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సీ నారాయణరెడ్డి జయంతి సందర్భంగా కేటీఆర్ సోమవారం ట్విట్టర్ ద్వారా ఆయనకు నివాళులు అర్పించారు. రచనల ద్వారా సమాజానికి సినారె చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

సోమవారం హైదరాబాద్ పాతబస్తీలో అక్కన్నమాదన్న ఆలయం వద్ద అమ్మవారిని అంబారిపై వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమానికి జంటనగరాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

వరంగల్ శివారులోని మామునూరులో విమానాశ్రయం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రతినిధులు. చిత్రంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ కూడా ఉన్నారు.

చిగురిస్తున్న మామునూర్ ఎయిర్‌పోర్ట్ ఆశలు

- స్థలాన్ని పరిశీలించిన ఏఏఐ ప్రతినిధులు
- ఫలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలు
- ఎల్లుండి రాష్ట్ర ప్రభుత్వంతో సమీక్ష!

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరంగల్ నగర శివారులోని మామునూర్ ఏయిర్‌పోర్ట్‌పై ఆశలు చిగురిస్తున్నాయి. పౌర విమానయానశాఖకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతోకాలంగా చేస్తున్న నివేదన ఎట్టకేలకు కార్యరూపంలోకి వస్తున్నట్టు అనిపిస్తున్నది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రతినిధులు సోమవారం మామునూరు విమానాశ్రయం స్థలాన్ని పరిశీలించారు. నిజాం జమానాలో ఈ విమానాశ్రయం పని చేసింది. 1980 దాకా వాయుదూత్ విమానాలు నడిచేవి. సమైక్యాంధ్ర పాలనలో ఇది పడావుగా పడింది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ శంకుస్థాపన సమయంలో మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను పునరుద్ధరిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలశాఖ మంత్రిగా పనిచేసిన ప్రస్తుత టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఈ విమానాశ్రయాన్ని పునరుద్ధరించాలని కేంద్రాన్ని అనేకమార్లు కోరారు. ఈ విమానాశ్రయానికి 706 ఎకరాల భూమి ఉండగా.. మరో 475 ఎకరాలు అవసరమని తెలుస్తున్నది. 2012లో భూసేకరణ చేయాలని ఏఏఐ ప్రతినిధులు సూచించినప్పటికీ.. విధివిధానాలపై స్పష్టత ఇవ్వకపోవడంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. చిన్న నగరాలకు సైతం విమాన సర్వీసులు నడపాలని కేంద్రం భావిస్తుండటం, రాష్ట్ర ప్రభుత్వం కూడా మామునూర్ విమానాశ్రయాన్ని తిరిగి ప్రారంభించాలని పట్టుబట్టడంతో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఉన్నతాధికారులు అమిత్‌కుమార్, అజయ్‌గుప్తా నేతృత్వంలోని బృందం ఇక్కడికి వచ్చి స్థల పరిశీలన చేశారు. వీరితోపాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్, వరంగల్ ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణ, వరంగల్ ఆర్డీవో వెంకటారెడ్డి ఉన్నారు. మామునూర్ నుంచి ఈ ప్రతినిధి బృందం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం ప్రతిపాదిత విమానాశ్రయం, మహబూబూబ్‌నగర్ జిల్లాలో మంగళవారం పర్యటించనున్నది. అనంతరం బుధవారం రాష్ట్ర ప్రభుత్వంతో వీటి ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై సమీక్షించనున్నట్టు సమాచారం. మామునూర్ విమానాశ్రయం పునరుద్ధరణకు సీఎం కేసీఆర్ గట్టిపట్టుదలతో ఉండటంతో ఏఏఐ ప్రతినిధులు పరిశీలించారని ఎమ్మెల్యే అరూరి రమేశ్ పేర్కొన్నారు.

చిందేసిన చినుకు

- రాష్ట్రంలో మరో రెండ్రోజులు విస్తారంగా వర్షాలు
- 38 నుంచి 21 శాతానికి చేరిన వర్షపాత లోటు
- కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో మించిన సగటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

- వారంతర్వాత మరింతగా వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం
- ఊపందుకున్న సాగు పనులు

ఉపరితల ఆవర్తనం, ఉపరితల ద్రోణి కారణంగా రాష్ట్రంలో నాలుగు రోజులుగా వానలు కురుస్తున్నాయి. మరో రెండ్రోజులు కూడా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశమున్నది. ఫలితంగా వర్షపాత లోటు క్రమేణ తగ్గుతున్నది. మరోవారం తర్వాత రుతుపవనాలు మరింత బలపడి భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలుపడం రైతుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఉత్తర ఒడిశా, దానిని ఆనుకొని ఉన్న గాంగేటిక్ పశ్చిమబెంగాల్, జార్ఖండ్ ప్రాంతాల్లో సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు ఏర్పడిన ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నది. మరోవైపు దక్షిణ రాజస్థాన్ నుంచి ఒడిశా వరకు మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా ఉపరితల ద్రోణి ఏర్పడింది. దీని ప్రభావంతో మరో రెండ్రోజుల వరకు తెలంగాణలో విస్తారంగా వానలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై కరుణాకర్‌రెడ్డి సోమవారం చెప్పారు. మరోవారం రోజుల తర్వాత రుతుపవనాలు మరింత బలపడి భారీగా వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. నాలుగురోజులుగా రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వానలు కురుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వర్షాల కారణంగా 38 శాతంగా ఉన్న రాష్ట్ర వర్షపాతం లోటు 21 శాతానికి చేరిందన్నారు. కొన్నిచోట్ల 15 శాతం లోటు మాత్రమే ఉన్నదని వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో 60 శాతంగా ఉన్న లోటు ఎకాఎకిన 37 శాతానికి తగ్గిందని, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో సగటును మించి వర్షపాతం నమోదైందని వివరించారు. నల్లగొండ, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో మాత్రం ఇంకా 40 నుంచి 45 శాతం వరకు లోటు వర్షపాతం ఉన్నదని తెలిపారు.

వరినాట్లలో నిమగ్నమైన రైతులు

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీవర్షాలు కురిశాయి. మహబూబాబాద్, జగిత్యాల జిల్లా సారంగాపూర్, కొత్తగూడెం జిల్లా ములుగులో ఆరు సెంటీమీటర్ల చొప్పున, వరంగల్ అర్బన్, కరీంనగర్, హుజూరాబాద్ జిల్లాలతోపాటు వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి, మంచిర్యాల జిల్లా భీమిలి, కామారెడ్డి జిల్లా మాచారెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులలో ఐదు సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. నాలుగురోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పలు జిల్లాల్లో రైతులు వరినాట్లలో నిమగ్నమయ్యారు. మరికొన్ని జిల్లాలో పత్తి, ఇతర మెట్ట పంటల్లో కలుపు తీయడం, పిండిపెట్టడం వంటి పనుల్లో తలమునకలయ్యారు.

సోమవారం కామారెడ్డి జిల్లా టేక్రియాల్‌లో వరినాట్ల పనుల్లో నిమగ్నమైన మహిళలు

గ్రేటర్‌పై ముసురు దుప్పటి

హైదరాబాద్ సిటీబ్యూరో నమస్తే తెలంగాణ: గ్రేటర్ హైదరాబాద్‌ను వాన ముసురు కమ్మేసింది. మూడ్రోజులుగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా పరిధిలో విస్తారంగా వానలు కురుస్తున్నాయి. గాలిలో తేమ అధికంగా ఉండటంతో వాతావరణం చల్లబడింది. రుతుపవనాలు చురుకుగా కదులుతున్నందున మంగళ, బుధవారాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గ్రేటర్ వ్యాప్తంగా సోమవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ఒక సెంటీమీటర్ వర్షపాతం నమోదైనట్టు పేర్కొన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 25.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 22.4 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 71 శాతంగా రికార్డయిందని తెలిపారు.

వర్షాకాలంలో భద్రతకు ప్రాధాన్యం

అధికారులకు దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం జాన్ థామస్ ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వర్షాకాలంలో రైళ్లు నడుపడంలో భద్రతకు ప్రాధాన్యమివ్వాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే అదనపు జీఎం జాన్ థామస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయం నుంచి విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వంతెనలు, సొరంగాలు, చెరువుల వద్ద జాగ్రత్త పడాలని ఆదేశించారు.

వర్షాల వల్ల పలు రైళ్లు రద్దు

ముంబైలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. కొన్నింటి ప్రయాణ వేళల్లో మార్పులు చేసినట్టు, మరి కొన్నింటి దారి మళ్లిస్తున్నట్టు పేర్కొన్నది. ఈ నెల 30, 31, ఆగస్టు 1, 2, 8 తేదీల్లో ఖాజీపేట నుంచి బల్లార్షా రామగిరి ట్రైన్, ఖాజీపేట- అజ్ని ప్యాసింజర్ల రద్దుచేసినట్టు తెలిపింది.

జైపాల్‌రెడ్డికి అంతిమ వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- భారీగా తరలివచ్చిన రాజకీయ ప్రముఖులు
- నివాళులర్పించిన స్పీకర్ పోచారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సూదిని జైపాల్‌రెడ్డి అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ సమీపంలో ఆయన అంతిమ సంస్కారాలను ప్రభుత్వ అధికార లాంఛనాలతో పూర్తిచేశారు. కుటుంబసభ్యులు, పలువురు రాజకీయ నాయకులు, అభిమానులు కడసారి ఆయనకు అశ్రునయనాలతో నివాళులర్పించారు. అయనకు గౌరవసూచకంగా పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం ఆయన పెద్ద కుమారుడు అరవింద్‌రెడ్డి తండ్రి చితికి నిప్పంటించారు. జైపాల్‌రెడ్డిని కడసారి చూసేందుకు పలువురు ప్రముఖులు తరలిరావడంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్.. జైపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కర్ణాటక సీఎల్పీ నేత, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ జైపాల్‌రెడ్డి పాడె మోసి తమ గురుభక్తి చాటుకొన్నారు. ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచిన జైపాల్‌రెడ్డి పార్థివదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి గాంధీభవన్‌కు తరలించారు. ప్రజల సందర్శనార్థం గంటపాటు అక్కడ ఉంచారు. అక్కడనుంచి మధ్యాహ్నం 1.15 ప్రాంతంలో బయలుదేరిన అంతియయాత్ర గంటన్నరపాటు కొనసాగి నెక్లెస్‌రోడ్డుకు చేరుకొన్నది. దారిపొడువునా భారీ ఎత్తున అభిమానులు, కార్యకర్తలు జైపాల్‌రెడ్డికి కడసారి వీడ్కోలు పలికేందుకు బారులు తీరారు. నెక్లెస్‌రోడ్డులోని పీవీ ఘాట్ సమీపంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. జైపాల్‌రెడ్డి అంత్యక్రియలకు గులాం నబీఆజాద్, మల్లికార్జునఖర్గే, కే జానారెడ్డి, భట్టి విక్రమార్క సహా పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు, టీఆర్ఎస్ ఎంపీ కే కేశవరావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డితోపాటు బీజేపీ, వామపక్షాల నేతలు హాజరయ్యారు.

సోమవారం జైపాల్‌రెడ్డి అంత్యక్రియల్లో పాడెమోస్తున్న కర్ణాటక మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య

జైపాల్‌రెడ్డి పార్థివదేహం వద్ద రోబిస్తున్న సతీమణి లక్ష్మమ్మ

ఉన్నత విలువలు ఆయన సొంతం: ఆజాద్

జైపాల్‌రెడ్డి మృతి పట్ల మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రగాఢ సంతాపం తెలిపారు. సంతాప సందేశాన్ని జైపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మికి మన్మోహన్ పంపారు. గాంధీభవన్‌లో జైపాల్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించిన అనంతరం గులాంనబీ ఆజాద్ భావోద్వేగానికి గురయ్యారు. పార్లమెంట్ లోపలా, బయటా ఉన్నత విలువలు, వ్యక్తిత్వం గల నేత జైపాల్‌రెడ్డి అని కొనియాడారు. సోనియా, రాహుల్ తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టు చెప్పారు. జైపాల్‌తో మూడు దశాబ్దాలుగా పనిచేశానని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు.

జైపాల్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ నేతలు గులాంనబీ ఆజాద్, మల్లికార్జునఖర్గే, గీతారెడ్డి తదితరులు

జైపాల్‌రెడ్డి అంత్యక్రియల సందర్భంగా ఆయన గౌరవార్థం గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

కన్నీరు మున్నీరైన కర్ణాటక మాజీ స్పీకర్

దివంగత కాంగ్రెస్ నేత జైపాల్‌రెడ్డితో తనది అన్నదమ్ముల అనుబంధమని కర్ణాటక మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ చెప్పారు. జైపాల్‌రెడ్డిని కడసారి చూసేందుకు ఆయన హైదరాబాద్ వచ్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు. జైపాల్‌రెడ్డి పాడె మోస్తూ రమేశ్‌కుమార్ కన్నీరు పెట్టుకొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెద్దదిక్కును కోల్పోయినట్టు ఉన్నదన్నారు. దేశ రాజకీయాల గురించి ఇద్దరం చర్చించేవాళ్లమని, కర్ణాటకలో గొడవలు సద్దుమణిగాక కలుసుకోవాలని అనుకొన్నానని అయితే, దేవుడు తనకు ఆ అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

కాళేశ్వరంలో చేపల సాగు

- మత్స్యశాఖ ప్రణాళికలు
- 1.24 కోట్ల చేప, 25 లక్షల రొయ్యపిల్లలు వదిలేందుకు సిద్ధం
- ప్రాజెక్టు ప్రారంభించడానికి మూడునెలల ముందే బేస్‌లైన్ సర్వే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లలో చేపల సాగును చేపట్టాలని మత్స్యశాఖ నిర్ణయించింది. 1.24 లక్షల చేపపిల్లలు, 25 లక్షల రొయ్యపిల్లలను వదిలేందుకు ప్రణాళికలు సిద్ధంచేసింది. సీఎం కేసీఆర్ చేతుల మీదుగానే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని కూడా అధికారులు భావిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభానికి మూడునెలల క్రితమే నీటిసామర్థ్యం, రిజర్వాయర్లలో ఎన్ని కిలోమీటర్ల మేర నీరు అందుబాటులో ఉంటుంది. ఎక్కడెక్కడ చేప పిల్లలను వదలాలి? ఎన్ని చేపపిల్లలు అవసరమవుతాయి? ఏయే గ్రామాల్లోని సొసైటీలకు అవకాశం ఉంటుందనే విషయాలపై మత్స్యశాఖ బేస్‌లైన్ సర్వే నిర్వహించింది. భూపాలపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో ఈ ప్లాన్‌ను అమలుచేయనున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల, ఎల్లంపల్లి రిజర్వాయర్ల పరిధిలో ఏ రకమైన చేపల పెంపకానికి అవకాశం ఉన్నదనే దానిపై అధికారులు నివేదిక తయారుచేశారు. మంచిర్యాల జిల్లాలో 46 కిలోమీటర్ల మేర గోదావరిలో 29.44 లక్షలు, పెద్దపల్లి జిల్లాలో 56 కిలోమీటర్ల పరిధిలో 44.80 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 72 కిలోమీటర్ల పరిధిలో 50 లక్షల చేప పిల్లలను వదలాలని నిర్ణయించారు. ఇందులో కొర్రమీనును 10 శాతం వేయనున్నారు. సాధారణ చేపపిల్లల పంపిణీ పథకంలోనే వీటికి టెండర్లు తీసుకున్నట్టు మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ తెలిపారు. మూడుజిల్లాల పరిధిలో వెయ్యిమంది జాలర్లు లైసెన్సులు తీసుకుంటున్నారు.

పెరుగనున్న చేపల ఉత్పత్తి

రాష్ట్రంలో ప్రభుత్వమే మత్స్యశాఖ ద్వారా ఉచితంగా చేపపిల్లల పంపిణీని చేపడుతున్నది. తద్వారా ఏడాదికి సగటున మూడులక్షల టన్నుల ఉత్పత్తి వస్తున్నది. దీనిని నాలుగు లక్షల టన్నులకు పెంచాలని మత్స్యశాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. 2016-17లో 27 కోట్లు, 2017-18లో 51 కోట్లు, 2018-19లో 55 కోట్ల చేప పిల్లలను రాష్ట్రంలో వివిధ రకాల నీటివనరుల్లోకి వదలింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రిజర్వాయర్ల పరిధిలో కేజ్ కల్చర్, పెన్ కల్చర్‌ను ప్రోత్సహించాలని మత్స్యశాఖ భావిస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ఏడాదికి కనీసం 10 నుంచి 11 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి సాధించే ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు మత్స్యశాఖ అధికారులు చెప్తున్నారు. కాళేశ్వరంలో ఏడాదిలో రెండు సార్లు చేపలు పెంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

ముహూర్తం

సూర్యోదయం: 5.59 గంటలకు

సూర్యాస్తమయం: 6.47 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, కృష్ణపక్షం, త్రయోదశి మధ్యాహ్నం 2.51 వరకు, తదుపరి కృష్ణ, నక్షత్రం: ఆరుద్ర సాయంత్రం 4.48 వరకు, తదుపరి పునర్వసు, అమృత ఘడియలు: ఉదయం 7.27 నుంచి 9.03 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.35 నుంచి సాయంత్రం 5.11 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.32 నుంచి 9.23 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.31 నుంచి 3.22 వరకు, వర్జ్యం: లేదు.

లోకం పోకడ

డాక్టర్ అయితే క్లినిక్ పెట్టొచ్చు.. కాకుంటే యోగా సెంటర్ తెరువొచ్చు!

ముఖేశ్‌గౌడ్ ఇకలేరు

మొదటిపేజీ తరువాయి...

గుర్తించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికలనాటికే ఆరోగ్యం క్షీణించినా మొజాంజాహిమార్కెట్‌లోని పోలింగ్‌కేంద్రంలో ఓటు వేసేందుకు అంబులెన్స్‌లో స్ట్రెచర్‌పై వచ్చారు. ఆ తర్వాత ఆరోగ్యం మరింత విషమించింది. ఆదివారం రాత్రి అపోలో దవాఖానకు తరలించగా, సోమవారం కన్నుమూశారు. వెంటనే ముఖేశ్‌గౌడ్ పార్థివదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని నివాసానికి తరలించారు. విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, టీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, శాసనమండలి విప్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీ ఎమ్మెస్ ప్రభాకర్, తలసాని సాయికిరణ్‌యాదవ్, కాంగ్రెస్ జాతీయనేతలు గులాంనబీఆజాద్, మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు,ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ, మాజీ ఎమ్మెల్యేలు జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, వివేక్, అద్దంకి దయాకర్, మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్, టీడీపీ నేత అరవింద్‌కుమార్ గౌడ్ తదితరులు ముఖేశ్‌గౌడ్ పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆ రాష్ట్ర ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు సంతాపం తెలిపారు. ముఖేశ్‌గౌడ్ మృతి తీరనిలోటని పేర్కొన్నారు.

కార్పొరేటర్ నుంచి మంత్రిగా..

హైదరాబాద్ పాతబస్తీలో నర్సింహగౌడ్, లలిత దంపతులకు 1959 జూలై 1న ముఖేశ్‌గౌడ్ జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తిచేశారు. ముఖేశ్‌గౌడ్‌కు భార్య లక్ష్మి, కుమారులు విక్రమ్‌గౌడ్, విశాల్‌గౌడ్, కుమార్తె శిల్ప ఉన్నారు. 30 ఏండ్లుగా కాంగ్రెస్‌లోనే ఆయన కొనసాగారు. విద్యార్థి దశలో కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఎన్ఎస్‌యూఐలో క్రియాశీలకంగా పనిచేశారు. 1983లో ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1986లో జాంబాగ్ నుంచి కార్పొరేటర్‌గా విజయం సాధించారు. పార్టీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. 1989, 2004లో మహారాజ్‌గంజ్, 2009లో గోషామహల్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో బీసీ సంక్షేమశాఖ మంత్రిగా తొలిసారి బాధ్యతలు స్వీకరించారు. 2009లో రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో మార్కెటింగ్, వేర్‌హౌసింగ్‌శాఖల మంత్రిగా పనిచేశారు. 2014, 2018లో గోషామహల్ నుంచి పోటీచేసి బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ చేతిలో ఓడిపోయారు.

సీఎం కేసీఆర్ సంతాపం

మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ మృతిపై ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ముఖేశ్‌గౌడ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న టీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

పారేఖాతి పరవళ్లు

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాన్కాపూర్‌లోని పారేఖాతి జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నది. పాలనురుగలాంటి జలాలు ఎత్తునుంచి పడుతుండటాన్ని పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. **-ఆసిఫాబాద్, నమస్తే తెలంగాణ**

కండ్లకు ఇంపుగా కనకాయ జలపాతం

ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని బలన్‌పూర్ సమీపంలోని కనకాయ జలపాతం గలగల పారుతూ పరవళ్లు తొక్కుతున్నది. ఎగువన కురిసిన భారీ వర్షానికి వరదనీరు వచ్చి చేరి జలపాతం జలకళను సంతరించుకున్నది. ఎత్తైన ప్రదేశాల నుంచి నీరు జాలువారుతూ కనువిందు చేస్తున్నది. **-బజార్‌హత్నూర్**



కట్టిపడేస్తున్న 'మిట్టె'

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలంలో మిట్టె జలపాతం పర్యాటకులను కట్టిపడేస్తున్నది. ప్రస్తుత వర్షాలతో పెద్ద ఎత్తున నీరు వస్తున్నది. జిల్లా కేంద్రం నుంచి 75 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. జైనూర్ వరకు ప్రధాన రహదారి ఉండగా, అక్కడి నుంచి లింగాపూర్‌కు చేరుకోవాలి. లింగాపూర్ గ్రామం నుంచి 3 కిలో మీటర్లు కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. **-ఆసిఫాబాద్, నమస్తే తెలంగాణ**

సంద్రంలా సుందిల్ల

ప్రాణహిత నీటితో కళకళలాడుతున్న మంథని మండలం సిరిపురంలోని సుందిల్ల బరాజ్

- కాళేశ్వరం పంప్‌హౌస్‌లలో కొనసాగుతున్న ఎత్తిపోతలు
- నేడో రేపో సుందిల్ల పంప్‌హౌస్‌లో 1వ మోటర్ వెట్‌రన్
- మేడిగడ్డ బరాజ్‌లో పెరుగుతున్న నీటిమట్టం
- తుపాకులగూడెం వద్ద గోదావరి పరవళ్లు
- భద్రాద్రి వద్ద పెరిగిన వరద

మంథని, నమస్తే తెలంగాణ/ కాళేశ్వరం/ మహదేవ్‌పూర్/ ఏటూరునాగారం/ కడెం: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మంథని మండలం సిరిపురంలో నిర్మించిన సుందిల్ల బరాజ్ సంద్రాన్ని తలపిస్తున్నది. కాసిపేటలోని అన్నారం పంపుహౌస్‌లో నాలుగు మోటర్లు రోజుకు ఒక టీఎంసీ చొప్పున ఎత్తిపోస్తుండడంతో సోమవారం సాయంత్రానికి బరాజ్‌లో నీటినిల్వ 5.82 టీఎంసీలకు చేరుకున్నది. దిగువన మేడిగడ్డ బరాజ్‌లో సోమవారం సాయంత్రం 4 గంటల సమయానికి 4.584 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. అన్నారం బరాజ్‌లో 7.77 టీఎంసీలుగా నమోదైంది. సుందిల్ల బరాజ్ బ్యాక్‌వాటర్ గోలివాడ పంప్‌హౌస్‌కు ఇప్పటికే చేరగా, తాజాగా మరోసారి ఫోర్‌బేలోకి వదిలారు. దీంతో గోలివాడ పంపుహౌస్‌లో మంగళ, బుధవారాల్లో 1వ నంబర్ మోటర్ వెట్‌రన్‌కు ఏర్పాట్లుచేస్తున్నారు. కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, లిఫ్ట్ అడ్వయిజర్ పెంటారెడ్డి అక్కడే మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. సుందిల్లలోకి అనుకున్నంత నీరు చేరుతుండడంతో అన్నారం పంప్‌హౌస్‌లోని రెండో నంబర్ మోటర్‌ను నిలిపివేశారు. పంపులను సిద్ధంచేసే క్రమంలో ఐదో మోటర్ వెట్‌రన్‌కు ఏర్పాట్లుచేస్తున్నారు.

మేడిగడ్డ బరాజ్‌లో పెరుగుతున్న నీటిమట్టం

రాష్ట్రంలో పడుతున్న వర్షాలతోపాటు ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న స్వల్ప వర్షాల ప్రభావంతో మేడిగడ్డ బరాజ్‌లో క్రమంగా నీటి నిల్వ పెరుగుతున్నది. ప్రాణహిత నుంచి ప్రవాహం పెరుగటంతో పంప్‌హౌస్‌లోని 3, 4, 5, 6వ నంబర్ మోటర్ల ద్వారా ప్రాణహిత జలాలను గ్రావిటీ కెనాల్ ద్వారా అన్నారం బరాజ్‌కు తరలించారు. ప్రాణహిత ప్రవాహం పెరిగితే మరిన్ని మోటర్లను ఆన్ చేయనున్నారు.

ధర్మపురి వద్ద కొనసాగుతున్న వరద

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ధర్మపురి వద్ద గోదావరికి వరద పెరుగుతున్నది. దేవాలయ సిబ్బంది, పోలీసులు భక్తులను లోతు ప్రాంతానికి స్నానాలకు వెళ్లకుండా అప్రమత్తం చేస్తున్నారు. గోదావరి ప్రవాహంలో బ్రహ్మగుండం, సత్యవతి గుండాలు పూర్తిగా మునిగిపోయాయి. శివపంచాయతనంపై నుంచి గోదావరి ప్రవహిస్తున్నది.

దేవాదుల వద్ద గోదావరి ఉరకలు

ఐదురోజులుగా ఎడతెరిపిలేని వర్షాలకు గోదావరి ఉప్పొంగుతున్నది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గంగారం సమీపంలో దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద నీటిమట్టం సోమవారం సాయంత్రం 77.50 మీటర్లకు చేరుకున్నది. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులను అంటుకుని గోదావరి నిండుగా ప్రవహిస్తున్నప్పటికీ ఒక మోటర్ మోటర్ ద్వారానే నీటిని భీం ఘనపూర్‌లోని రిజర్వాయర్‌కు పంప్‌చేస్తున్నారు. గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. తుపాకులగూడెం బరాజ్ వద్ద కూడా గోదావరి ఉగ్ర రూపం దాల్చింది. ఛత్తీస్‌గఢ్ సరిహద్దువైపు నిర్మాణదశలో ఉన్న పియర్స్ ముంపునకు గురయ్యాయి. రామన్నగూడెం పుష్కర ఘాట్ సమీపంలోకి గోదావరి చేరుకుంది. మంగపేట మండలంలోని కమలాపురం ఇన్‌టేక్‌వెల్, మంగపేట పుష్కరఘాట్ వరకు గోదావరి ప్రవహిస్తున్నది. వాజేడు మండలంలోని పేరూరు, వాజేడు, పూసూరు బ్రిడ్జి, ఎడ్జర్లపల్లి వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతున్నది.

కడెం దూకుడు

గోదావరి బేసిన్‌లో ఈసారి ప్రాణహిత నుంచి వరద స్థిరంగా కొనసాగుతున్నది. కన్నెపల్లి వద్ద సుమారు 10-12 వేల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నది. రెండురోజులుగా కడెం నుంచి వరద భారీగా వస్తున్నది. సోమవారం ఉదయం నుంచి ఇన్‌ఫ్లో 13వేల క్యూసెక్కులకు పైగా నమోదవుతున్నది. కడెం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు(7.603టీఎంసీలు). ప్రస్తుతం 686.200 అడుగులు (4.524 టీఎంసీలు) వద్ద ఉన్నది. కడెం నుంచి మంగళవారం సాయంత్రం తర్వాత దిగువకు నీటిని వదిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎల్లంపల్లి జలాశయానికి 3,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో కాళేశ్వరం రెండో లింకునకు నీటి లభ్యత మరింత మెరుగువుతుంది. ఇంద్రావతి నుంచి వరద బాగా పెరుగటంతో పేరూరు వద్ద సోమవారం ఉదయానికి ప్రవాహం 69వేల క్యూసెక్కులకు పెరిగింది. దిగువన ధవళేశ్వరం వద్ద అదే సమయానికి ఇన్‌ఫ్లో 37వేల క్యూసెక్కులకు పైగానే ఉంది. అంటే ఇంద్రావతిలో ప్రవాహం ఇప్పుడిప్పుడే పెరుగుతున్నది.

భద్రాద్రి వద్ద 24 అడుగులకు గోదావరి

భద్రాచలం, నమస్తే తెలంగాణ/ పాల్వంచ రూరల్/ చర్ల రూరల్: భద్రాద్రి వద్ద గోదావరిలో వరద ఉధృతి రోజురోజుకు పెరుగుతున్నది. సోమవారం ఉదయం 23.1 అడుగులున్న వరద ప్రవాహం సాయంత్రం ఆరు గంటలకు 24 అడుగులకు చేరింది. మంగళవారం తెల్లవారేసరికి 30 అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నదని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేస్తామన్నారు. వరద పెరిగితే ఏజెన్సీ గ్రామాలకు జలగండం పొంచి ఉన్నది. భద్రాచలం కరకట్ట స్లూయిస్‌లు లీకయ్యే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి వరదనీరు

ఎగువ ప్రాంతాలైన బయ్యారం, గుండాల, ఇల్లెందు మండలాల్లో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తున్నది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 389.4 నీటిమట్టం అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 4 వేల క్యూసెక్కులు ఉన్నది.చర్ల మండల పరిధిలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద తాకిడి తగ్గుతున్నది. సోమవారం ఉదయం 21 గేట్ల ద్వారా 68,800 క్యూసెక్కులను గోదావరిలోకి విడుదలచేయగా, సాయంత్రానికి వరద ఉధృతి తగ్గడంతో 15 గేట్ల ద్వారా 37,700 క్యూసెక్కులను వదులుతున్నారు.

బాసర వద్ద గోదావరిలోకి భారీగా చేరిన వరద నీరు

భద్రాచలంలోని పుష్కరఘాట్ వరకు చేరిన వరద నీరు

నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని రైల్వే బ్రిడ్జి వద్ద కృష్ణా జలాలకు పూజలు చేస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

కర్ణాటకలోని నారాయణపుర ప్రాజెక్టు నుంచి జూరాలకు విడుదలవుతున్న కృష్ణాజలాలు

జూరాల ఒడిలోకి కృష్ణమ్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి:

- కోటి ఆశల మధ్య లక్ష క్యూసెక్కులు
- ఆల్మట్టి నుంచి నారాయణపురకు..
- నారాయణపుర నుంచి 1.23 లక్షల క్యూసెక్కులు
- మూడునాలుగు రోజుల్లో శ్రీశైలానికి!

ఎట్టకేలకు జూరాలకు వరద వచ్చింది. మహారాష్ట్రలో భారీవర్షాలతో ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టులు పూర్తిగా నిండకముందే దిగువకు లక్ష క్యూసెక్కులకుపైగా నీటిని విడుదల చేస్తున్నారు. దీనితో సోమవారం రాత్రి పది గంటల ప్రాంతంలో జూరాలకు పదివేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఆల్మట్టికి సోమవారం ఉదయం 76,305 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా.. సాయంత్రానికి లక్ష క్యూసెక్కులకు పెరిగింది. అదేస్థాయిలో దిగువకు వదులుతున్నారు. నారాయణపుర నుంచి సాయంత్రానికి అవుట్‌ఫ్లో సుమారు లక్ష క్యూసెక్కులకు పెంచగా, రాత్రి 8.30 గంటల సమయానికి ఇన్‌ఫ్లో 1.32 లక్షల క్యూసెక్కులకు పెరుగటంతో 1.23 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. దీంతో సోమవారం మధ్యాహ్నం గూగల్ బరాజ్‌కు చేరుకున్నాయి. సాయంత్రానికి తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో రాయిచూర్-హైదరాబాద్ జాతీయ రహదారి బ్రిడ్జి దిగువన కృష్ణా నది వరద తెలంగాణలోకి ప్రవేశించింది. క్రమంగా జూరాల ప్రాజెక్టుకు చేరుతున్నది. తీవ్ర నిరాశల మధ్య మొదలైన ఈ నీటి సంవత్సరంలో ఇప్పుడు ఆశలు చిగురిస్తున్నాయి. కృష్ణాబేసిన్‌లో నీటిపరవళ్లు ఆనందాన్ని నింపుతున్నాయి. లక్షల ఎకరాల్లో రైతాంగం కోటి ఆశల మధ్య ఎదురుచూస్తున్న జలాలు లక్ష క్యూసెక్కులను మోసుకొచ్చాయి. గత ఏడాది ఇదేనెలలో 18వ తేదీన కృష్ణాజలాలు తెలంగాణలోకి ప్రవేశించగా.. ఇప్పుడు 11-12 రోజులు ఆలస్యంగా వస్తున్నాయి.

ఈ ఒరవడి ఉంటేనే దిగువన జలకళ

ప్రస్తుతం ఆల్మట్టి, నారాయణపుర జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ఆల్మట్టిలో 129.72 టీఎంసీల పూర్తిస్థాయి సామర్థ్యానికిగాను 122.27 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. సోమవారం రాత్రి 8.30 గంటల సమయానికి ఆల్మట్టి స్పిల్‌వే నుంచి, మరోవైపు కరంటు ఉత్పత్తి ద్వారా భారీగా నీటిని వదులుతుండటంతో నారాయణపురకు 1.32 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నారాయణపుర నుంచి 1.23 లక్షల క్యూసెక్కులకు నీటిని నీటిని దిగువకు స్పిల్‌వే, కరంటు ఉత్పత్తి ద్వారా వదులుతున్నారు. ఇదే ఒరవడి కొనసాగితే మూడునాలుగు రోజుల్లో శ్రీశైలం జలాశయాన్ని కృష్ణాజలాలు తాకే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో జూరాలపై ఉన్న అన్ని ఎత్తిపోతల పథకాలను ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం జూరాల జలాశయంలో 1.99 టీఎంసీల నీటి నిల్వ ఉంది. మంగళవారం నుంచి వేగంగా నీటిమట్టం పెరిగే అవకాశమున్నందున జూరాల నుంచి నీటి విడుదల కూడా మంగళవారం మొదలయ్యే అవకాశముంది. జూరాల కుడి, ఎడమ, సమాంతర కాల్వల ద్వారా నీటిని వదిలి చెరువులను నింపడంతోపాటు కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు పథకాల ద్వారా కూడా నీటి విడుదల ప్రారంభించనున్నారు.

ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

నారాయణపుర నుంచి నీటి విడుదలతో తెలంగాణ యంత్రాగం అప్రమత్తమైంది. నారాయణపేట కలెక్టర్ వెంకట్రావు, ఆర్డీవో శ్రీనివాసులు మక్తల్‌లో అధికారులతో సమీక్షించారు. కృష్ణా మండలంలోని ముడుమాల్, మురారి దొడ్డి గ్రామాల పరిధిలో పర్యటించారు. స్థానికులను అప్రమత్తం చేశారు. రైతులు, మత్స్యకారులు నదిలోకి వెళ్లవద్దని సూచించారు. ప్రస్తుతం నది నీటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల పంపుసెట్లు మునిగిపోయే అవకాశం ఉన్నందున అన్నింటినీ తీయించినట్టు కలెక్టర్ వెంకట్రావు తెలిపారు.

వరద వస్తే ఎత్తిపోసుడే : మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం

నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పస్పుల వద్ద సోమవారం సాయంత్రం కృష్ణ వరదను మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పరిశీలించారు. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి దిగువన ఉన్న మన రాష్ట్రంలోకి విడుదలైన కృష్ణానది వరదనీరు, మన సరిహద్దుల్లోకి ప్రవేశించిన వెంటనే భీమా ఎత్తిపోతల పథకం పంపింగ్‌ను ప్రారంభించి నీటిని ఎత్తిపోస్తామని ఆయన తెలిపారు. నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

వరదనీటితో ప్రవహిస్తున్న మూసీ నది

అర్వపల్లి/ కేతేపల్లి: మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూసీనది వరదనీటితో ప్రవహిస్తూ మూసీ రిజర్వాయర్‌లోకి చేరుతున్నది. సోమవారం సూర్యాపేట జిల్లా, జాజిరెడ్డిగూడెం శివారులోని మూసీవాగులో వర్షపు నీరు ప్రవహిస్తున్నది. మండలంలోని పలు గ్రామల్లోని చెరువులు, కుంటలు వరదనీటితో కళకళలాడుతున్నాయి. పొలాల్లోకి వచ్చిన కొద్దిపాటి వరదనీటితో వ్యవసాయపనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం కూడా పలుచోట్లు చిరుజల్లులు కురిశాయి.

200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నల్లగొండ జిల్లా, కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టుకు పరిసర ప్రాంతాల నుంచి సోమవారం 200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుతం 613 అడుగులుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

జూరాలలో విద్యుదుత్పత్తికి సర్వం సిద్ధం

టీఎస్ హైడల్ ప్రాజెక్ట్స్ సీఈ సురేశ్

ఆత్మకూరు, నమస్తే తెలంగాణ/అయిజ: రాష్ట్రంలోని జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తికి సర్వం సిద్ధంచేస్తున్నట్లు తెలంగాణ హైడల్ ప్రాజెక్ట్స్ సీఈ సురేశ్ తెలిపారు. మహారాష్ట్రలో కురుస్తున్న వానలకు వరద నీరు ఎప్పుడు వచ్చినా విద్యుదుత్పత్తికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కృష్ణాబేసిన్‌లోని ఆరు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తికి అంతా సిద్ధం చేసినట్లు తెలిపారు. కృష్ణాజలాలు సోమవారం అర్ధరాత్రి జూరాలకు చేరే అవకాశాలున్నాయన్నారు. నిర్దేశితస్థాయికి నీరుచేరగానే ఎగువ జూరాలలోని 6 యూనిట్లు, దిగువ జూరాలలోని 6 యూనిట్లలో మంగళవారం తెల్లవారుజాము నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభించే అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఒక్కచుక్క కూడా వృథాచేయకుండా విద్యుదుత్పత్తి నిర్వహించడమే లక్ష్యమన్నారు. ఎగువ నుంచి కొనసాగే ప్రవాహాన్ని బట్టి యూనిట్లను పెంచుతామని చెప్పారు. రెండ్రోజుల్లో ఎగువ, దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రంలో అన్ని యూనిట్లు వినియోగంలోకి వస్తాయన్నారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న ఓ మోస్తరు వర్షాలతో తుంగభద్ర ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతున్నది. సోమవారం డ్యాంలోకి 14,683 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా, 1,799 క్యూసెక్కులను దిగువకు విడుదలచేస్తున్నారు. డ్యాంలో ప్రస్తుతం 24.444 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు సెక్షన్ అధికారి విశ్వనాథ్ తెలిపారు.

నారాయణపుర ప్రాజెక్ట్ నుంచి విడుదలైన కృష్ణాజలాలు గూగల్ బరాజ్‌ను దాటుతున్న దృశ్యం

భూగర్భ జలప్రపంచం

మొదటిపేజీ తరువాయి...

ఐదో తేదీ తర్వాత ఏ క్షణంలోనే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలంటూ స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి ఆదేశాలు రావటంతో యంత్రాంగం అప్రమత్తమైంది. బాహుబలి మోటర్లు నీటిని ఎత్తిపోసే దృశ్యాలను వీక్షించేందుకు కోట్లమంది ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం నందిమేడారంలోని ఐదోమోటర్ వెట్‌రన్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

లింకు -2 అత్యంత కీలకం

ఏడు లింకులు, 28 ప్యాకేజీలుగా నిర్మాణమవుతున్న కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైనవి లింకు- 2, అందులోని 6, 7, 8 ప్యాకేజీ పనులు. మేడిగడ్డ నుంచి ప్రాజెక్టు చివరివరకు మొత్తం 518 మీటర్ల ఎత్తుకు నీటిని లిఫ్ట్‌చేస్తుండగా.. 6, 7, 8 ప్యాకేజీల పరిధిలోనే బాహుబలి మోటర్లను వినియోగిస్తున్నారు.అత్యంత ఎత్తుకు ఎత్తిపోయడంతోపాటు.. అతిపెద్ద పది డయామీటర్ల జంట సొరంగమార్గాలు ఇక్కడే ఉన్నాయి.

ఎల్లంపల్లికి నుంచి నందిమేడారానికి

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఎత్తిపోసిన ప్రాణహిత జలాలు ఇప్పటికే సుందిల్ల బరాజ్‌కు చేరాయి. ఇక్కడి గోలివాడ పంపుహౌస్ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయం నుంచి నీటిఎత్తిపోత ప్రారంభం కానున్నది. ఎల్లంపల్లిలో నిండే బ్యాక్‌వాటర్ 2.58 కిలోమీటర్ల దూరం అప్రోచ్‌చానల్ ద్వారా ప్రవహించి, లైన్డ్ కెనాల్‌లో కలుస్తుంది. 1.1 కిలోమీటర్ల దూరం లైన్డ్ కెనాల్‌లో, తదుపరి జంటసొరంగ మార్గాలద్వారా 9.534 కిలోమీటర్లు ప్రయాణించి, నందిమేడారం సర్జ్‌పూల్‌లో కలుస్తుంది. ఇక్కడినుంచి నీటిని ఎత్తిపోసేందుకు 124.4 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఏడు మోటర్లు ఏర్పాటుచేశారు. నాలుగింటికి వెట్‌రన్ పూర్తయింది. మంగళవారం ఐదోపంపు వెట్‌రన్ చేయనున్నా రు. మిగిలిన రెండుమోటర్లను ఆగస్టులో వెట్‌రన్‌కు సిద్ధంచేస్తున్నారు. నందిమేడారం పంపులు 105 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయనున్నా యి. ఏడు మోటర్లు రోజుకు రెండు టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తాయి.

నందిమేడారం నుంచి బాహుబలి మోటర్లకు..

నందిమేడారం సర్జ్‌పూల్ నుంచి నందిమేడారం రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోస్తారు. (ఇక్కడి రిజర్వాయర్ సామర్థ్యం గతంలో 0.18 టీఎంసీ సామర్థ్యం ఉండగా.. దానిని 0.74 టీఎంసీలకు పెంచారు.) నందిమేడారం రిజర్వాయర్ హెడ్ రెగ్యులేటరీ గేట్లు తెరిచిన వెంటనే అక్కడినుంచి 1.950 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ ద్వారా ప్రవహించే నీరు ఆ తదుపరి జంటసొరంగాల ద్వారా 15.373 కిలోమీటర్లు ప్రవహించి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ వద్ద సర్జ్‌పూల్‌కు చేరుకుంటాయి. 139 మెగావాట్ల బాహుబలి మోటర్లు ఇక్కడే ఉన్నాయి. ఇప్పటికే వాటిలో ఐదింటికి విజయవంతంగా డ్రైరన్ పూర్తిచేశారు. మిగిలిన రెండు పంపులను ఆగస్టు చివరివారంలో నేరుగా వెట్‌రన్‌కు సిద్ధంచేస్తున్నారు. ఇక్కడ ఒక్కో మోటర్ 3,142 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుంది. అలా ఏడు మోటర్లు కలిపి.. రోజుకు రెండు టీఎంసీల నీటిని 115 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోస్తాయి. ఈ నీళ్లు డెలివరీ పాయింట్ నుంచి 5.75 కిలోమీటర్ల దూరం గ్రావిటీ కెనాల్ ద్వారా ప్రవహించి వరదకాల్వ 99వ కిలోమీటర్ పాయింట్ వద్ద కలుస్తాయి.

వేగంగా పునర్జీవ పనులు

ఎస్సారెస్పీ పునర్జీవ పనులను అధికారులు పరుగులు పెట్టిస్తున్నారు. కాళేశ్వరం నీటిని లక్ష్మీపూర్ వరకు తరలించి అక్కడి నుంచి లిఫ్ట్‌చేసే ప్రతి చుక్కను ఒకవైపు మధ్యమానేరు ప్రాజెక్టుకు, మరోవైపు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పంపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎగువ, దిగువన వర్షాలు కురుస్తున్నా ఎస్సారెస్పీకి నీరు రావడంలేదు. అందుకే ప్రాణహిత జలాలతో ఎస్సారెస్పీని నింపాలనేది ప్రభుత్వ ఆశయం పునర్జీవన పథకంలో భాగంగా వరదకాల్వ 73వ కిలోమీటర్ (జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్) వద్ద పంపుహౌస్ నిర్మాణ పనులు, 34 కిలోమీటర్ వద్ద (జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట) వద్ద పంపుహౌస్ పనులను వడివడిగా పూర్తిచేస్తున్నారు.

సిద్ధంగా ఉండాలని సీఎం నుంచి ఆదేశాలు

బాహుబలి మోటర్ల వెట్‌రన్ ప్రక్రియను ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొంటున్నారు. రేయింబవళ్లు 6, 7, 8 ప్యాకేజీల్లో పనులపై నేరుగా క్షేత్రస్థాయి అధికారులకే ఫోన్ చేసి ఆరాతీస్తున్నారు. ఈ క్రమంలోనే ఆగస్టు ఐదు తదుపరి ఏ క్షణంలోనైనా నందిమేడారంతోపాటు బాహుబలి మోటర్ల వెట్‌రన్‌కు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి నుంచి ఆదేశాలు వచ్చాయి. లింకు-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూనె శ్రీధర్, డీఈలు గోపాలకృష్ణ, నర్సింగరావుతోపాటు 16 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సదరు కంపెనీ ప్రతినిధులు అక్కడే మకాం వేసి పనులు చేస్తున్నారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ వెంకటేశ్వర్లు ఎప్పటికప్పుడు పనులపై ఆరా తీస్తున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయి అధికారులకు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకుంటున్న నేపథ్యంలో అధికారులు రెట్టింపు ఉత్సాహంతో పనులు చేయిస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా నీరు ఇవ్వాలన్న తపనతో సీఎం తమతో మాట్లాడడం.. తమలో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నదని ఒక కీలక అధికారి అనందం వ్యక్తంచేశారు.

లక్ష్మీపూర్ సర్జ్‌పూల్ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధమైన డెలివరీ సిస్టర్నులు

కీసర రిజర్వ్ ఫారెస్ట్‌కు మహర్దశ

- ఎంపీ సంతోష్ దత్తతతో మారనున్న రూపురేఖలు
- 125 ఎకరాల్లో అర్బన్ లంగ్ స్పేస్ పార్కుకు సన్నాహాలు
- ఫారెస్ట్‌ను పరిశీలించిన సీఎం ఓఎస్డీ ప్రియాంకవర్గీస్

మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి: కీసర రిజర్వ్ ఫారెస్ట్‌కు మహర్దశ పట్టనున్నది. ఈ నెల 24న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని కీసర రిజర్వ్ ఫారెస్ట్‌ను దత్తత తీసుకుంటున్నట్టు ఎంపీ సంతోష్‌కుమార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం సీఎం ఓఎస్డీ, హరితహారం ప్రత్యేకాధికారి ప్రియాంక వర్గీస్ కీసర రిజర్వ్ ఫారెస్ట్ స్థలాలను పరిశీలించారు. 125 ఎకరాల్లో అర్బన్ లంగ్ స్పేస్ పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదధనలను సిద్ధంచేయాలని జిల్లా అటవీ అధికారులకు సూచించారు. థీమ్ పార్కులు, వాక్‌వే, యోగా, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్‌పార్క్ ఏర్పాటు తోపాటు ఔషధ మొక్కలు, ఆక్సిజన్‌ను అధికంగా విడుదల చేసే మొక్కలను పెంచాలని భావిస్తున్నారు. కీసర దేవస్థానం, పర్యాటక శాఖల భవనాలను మినహాయిస్తే 1,100 ఎకరాల వరకు ఫారెస్ట్ స్థలాలు ఉన్నాయని జిల్లా అటవీ అధికారి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అటవీభూములను కాపాడటంతోపాటు గుట్టచుట్టూ విస్తరించిన రిజర్వ్ ఫారెస్ట్‌ను ఎంపీ ల్యాడ్స్ నిధులతో అభివృద్ధి చేయనున్నారు.

కీసర రిజర్వ్ ఫారెస్ట్ స్థలాలను పరిశీస్తున్న సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్

విభజన సమస్యలపై 8న ఢిల్లీలో సమావేశం

తప్పనిసరిగా హాజరుకావాలని తెలుగు రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్రం లేఖలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర విభజనకు సంబంధించిన సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 8న ఢిల్లీలో సమావేశం నిర్వహించనున్న ది. నార్త్ బ్లాక్‌లోని కేంద్ర హోంశాఖ కార్యదర్శి టీ హెడాకో చాంబర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర ప్రభుత్వం లేఖలు రాసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని వివిధ అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్టు కేంద్ర హోంశాఖ ఆ లేఖల్లో పేర్కొన్నది. ఈ సమావేశం గురించి కేంద్ర హోంశాఖ కార్యదర్శి హెడాకో ఇద్దరు సీఎస్‌లతో ఫోన్‌లో కూడా మాట్లాడినట్టు సమాచారం.

మానేరుకు పచ్చతోరణం

2017 జూలై 12న కరీంనగర్ జిల్లా మానేరు తీరంలో మహాగని మొక్కను నాటుతున్న సీఎం కేసీఆర్

నేడు: పెరుగుతున్న మహాగని మొక్క

- సీఎంకేసీఆర్ స్ఫూర్తి కొనసాగింపు
- ఏపుగా పెరిగిన హరితహారం మొక్కలు
- రెండేండ్లలో ఊహించని మార్పు
- చిట్టడవిని తలపిస్తున్న మైదానం

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కరీంనగర్ శివారులోని మానేరు నదీ తీరం రెండేండ్ల కిందటి వరకు బోసిబోయి కనిపించేది. కాంక్రీట్ భవనాలు, మానేరు డ్యాంకట్ట తప్ప మరేమీ కనిపించేవి కావు. ప్రస్తుతం ఎటూచూసినా ఆకుపచ్చని మొక్కలతో చిట్టడవిని తలపిస్తున్నది. రెండేండ్ల కిందట హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరుగడంతో పచ్చదనం పరుచుకుంటున్నది. కనుచూపు మేర పచ్చదనంతో మానేరు తీరం పచ్చలహారంగా మారుతున్నది. 2017 జూలై 12న మూడో విడత హరితహారాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కరీంనగర్ జిల్లాలోనే ప్రారంభించారు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న మానేరు తీరంలో వం దల సంఖ్యలో విద్యార్థులు, స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. సీఎం కేసీఆర్ మహాగని మొక్క నాటిన తర్వాత సైరన్ మోగించడంతో వేల సంఖ్యలో విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, వివిధశాఖల అధికారులు సిబ్బంది ఎవరికి కేటాయించిన బ్లాకుల్లో మూకుమ్మడిగా మొక్కలు నాటారు. మానేరు రిజర్వాయర్ కట్ట ఎడమ వైపున ఉన్న సిరిసిల్ల, జగిత్యాల బైపాస్ రోడ్డుతోపాటు క్రీడా పాఠశాల, డీర్ పార్క్, గౌతమినగర్, రామచంద్రాపూర్, సప్తగిరికాలనీ రాంనగర్ మీదుగా పద్మానగర్ వరకు ఉన్న పరిసరాల్లో పది బ్లాకులుగా విభజించి సుమారు 20 వేల మొక్కలు నాటారు. వీటిని మున్సిపల్, అటవీశాఖలు సంరక్షిస్తున్నాయి. 90 శాతానికిపైగా మొక్కలు ఏపుగా పెరిగి మానేరు తీరానికి పచ్చని అందాన్ని తెచ్చిపెట్టాయి.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మానేరు తీరంలో ఏపుగా పెరుగుతున్న మొక్కలు

మానేరుకు పచ్చని అందాలు

మానేరు జలాశయం ఆనకట్ట చివరన పద్మానగర్ నుంచి గేట్ల వరకు ప్రస్తుతం ఎక్కడ చూసినా ఏపుగా పెరిగిన మొక్కలే కనిపిస్తున్నాయి. మొక్కలను రక్షించేందుకు పశువులు వెళ్లకుండా ఎక్కడికక్కడ జాలీలు ఏర్పాటుచేశారు. ఒకవేళ ఏదైనా మొక్క ఎండిపోతే దాని స్థానంలో మరో మొక్క నాటుతున్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ, అటవీశాఖలు వీటి ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయి. ప్రస్తుతం మొక్కలన్నీ పది అడుగులకు మించి పెరిగాయి. మొక్కల మధ్య కూర్చునేందుకు వీలుగా పలు స్వచ్ఛంద సంస్థలు సిమెంట్ బెంచీలు ఏర్పాటుచేశాయి. సీఎం కేసీఆర్ స్ఫూర్తితో నాటిన మొక్కలు అహ్లాదంతోపాటు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మానేరు తీరంలో మొక్కల చుట్టూ ఏర్పాటుచేసిన ట్రీ గార్డులు

వృక్షాలుగా ఎదుగుతున్న మొక్కలు

- ఉమ్మడి కరీంనగర్‌లో నాలుగుచోట్ల మొక్కలు నాటిన సీఎం కేసీఆర్
- మొక్కలను సంరక్షిస్తున్న స్థానికులు, అటవీశాఖ సిబ్బంది

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాటిన మొక్కలు హరితహారం కార్యక్రమానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొదటి, మూడో విడుత హరితహారంలో సీఎం కేసీఆర్ నాటిన మొక్కలు స్థానికులు, అటవీశాఖ కంటికి రెప్పలా కాపాడుతుండటంతో వృక్షాలుగా మారుతున్నాయి. తొలివిడుత హరితహారంలో భాగంగా 2015 జూలై 4న సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యటించి విస్తృతంగా మొక్కలు నాటారు. దత్తత గ్రామమైన చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్‌లో టేకు మొక్క నాటారు. తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని శ్రీతాపాల నరసింహస్వామి ఆలయం వద్ద కూడా మొక్క నాటారు. ఇప్పుడవి వృక్షాలుగా ఎదుగుతున్నాయి. 2015 జూలై 5న ఆదిలాబాద్ పర్యటనకు వెళ్తూ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలకేంద్రంలో కూడా ఒక మొక్కను సీఎం కేసీఆర్ నాటారు. దీన్ని అటవీశాఖ సంరక్షిస్తున్నది. మూడో విడుత హరితహారంలో భాగంగా 2017 జూలై 12న కరీంనగర్‌లోని మానేరు తీరంలోని బతుకమ్మ పాయింట్ వద్ద 8వ బ్లాక్‌లో సీఎం కేసీఆర్ మహాగని మొక్కనాటారు. అప్పటి అటవీశాఖ మంత్రి జోగు రామన్న, ప్రస్తుత వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ మరో రెండు మొక్కలు నాటారు. అటవీశాఖ అధికారులు వీటిని సంరక్షిస్తున్నారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు సీఎం కేసీఆర్ నాటిన మొక్కను పరిశీలించి స్ఫూర్తిపొందుతున్నారు.

చింతమడకలో వైద్యశిబిరాల నిర్వహణపై సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా చింతమడకలో వైద్యశిబిరాల నిర్వహణ, హెల్త్‌ప్రొఫైల్ రూపొందించడంపై సోమవారం ఆరోగ్యశ్రీ కార్యాలయంలో ఆరోగ్యశాఖ అధికారులు సమీక్షించారు. సమావేశంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి, ఆరోగ్యశ్రీ సీఈవో మాణిక్‌రాజ్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి, వైద్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 22న సీఎం కేసీఆర్ చింతమడక పర్యటన సందర్భంగా గ్రామంలో వైద్యశిబిరాల నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల హెల్త్‌ప్రొఫైల్ సేకరించే కార్యక్రమాన్ని కూడా చింతమడక నుంచే ప్రారంభించి.. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. అంతేకాకుండా చింతమడకలో కార్పొరేట్‌స్థాయిలో వైద్యశిబిరం, కంటి వైద్యశిబిరం ఏర్పాటుచేసి ఆరోగ్యపరీక్షలు చేయిస్తామన్నారు. ఈ మేరకు వైద్యశిబిరాల నిర్వహణపై వైద్యాధికారులు సమీక్షించారు. గ్రామ జనాభాకనుగుణంగా వైద్యశిబిరాలు ఏ విధంగా నిర్వహించాలి అనేదానిపై చర్చించారు.

'ఒడిశా రసగుల్ల'కు భౌగోళిక గుర్తింపు

భువనేశ్వర్: 'ఒడిశా రసగుల్ల'కు భౌగోళిక గుర్తింపు లభించింది. చెన్నైలోని రిజిస్ట్రార్ ఆఫ్ జియగ్రాఫికల్ ఇండికేషన్స్ సోమవారం ఈ మేరకు ధృవీకరణ పత్రం జారీ చేసింది. 2028 ఫిబ్రవరి 22 వరకు ఈ గుర్తింపు వర్తిస్తుందని పేర్కొంది. రసగుల్లకు భౌగోళిక గుర్తింపు లభించడంపై సీఎం నవీన్ పట్నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

క్షమాపణలు చెప్పిన ఆజంఖాన్

- బీజేపీ ఎంపీ రమాదేవి తన సోదరిలాంటివారని వ్యాఖ్య
- పద్ధతి మార్చుకోవాలని రమాదేవి హితవు

రాజ్యసభలో క్షమాపణలు చెప్తున్న ఆజంఖాన్

న్యూఢిల్లీ: లోక్‌సభ డిప్యూటీ స్పీకర్, బీజేపీ ఎంపీ రమాదేవిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకుగాను సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎంపీ ఆజంఖాన్ లోక్‌సభలో క్షమాపణలు చెప్పారు. సోమవారం సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా.. ఆజంఖాన్ మాట్లాడేందుకు అనుమతినిచ్చారు. ఆజంఖాన్ మాట్లాడుతూ.. 'నేను తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా పనిచేశా. నాలుగుసార్లు మంత్రినయ్యా. రాజ్యసభ సభ్యుడిగా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగానూ పని చేశా. చట్టపరమైన విధానాలు నాకు తెలుసు. ఏదేమైనా, నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమాపణలు చెబుతున్నా' అని పేర్కొన్నారు. అయితే కొన్ని మాటలు సరిగా వినిపించకపోవడంతో.. సభ మొత్తానికి అర్థమయ్యేలా మరోసారి చెప్పాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి డిమాండ్ చేశారు. ఈ సమయంలో ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆజంఖాన్ ఇప్పటికే క్షమాపణలు చెప్పారని, అందుకు తానే సాక్షి అని పేర్కొన్నారు. ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురైన ఉన్నావ్ లైంగికదాడి బాధితురాలి గురించి ప్రస్తావిస్తూ.. ఆ ఘటనపైనా సభలో చర్చ జరుగాలని డిమాండ్ చేశారు. దీనిపై అధికార పక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. ఉన్నావ్ ఘటనలో ఓ బీజేపీ ఎమ్మెల్యే నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. కాగా, బీజేపీ నేతలు 'జై సీతారామ్' అని నినదించడానికి బదులు 'జై శ్రీరామ్' అని మాత్రమే ఎందుకు నినదిస్తున్నారని అఖిలేశ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీంతో మరోసారి బీజేపీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మరోసారి క్షమాపణలు చెప్పాలని ఆజంఖాన్‌ను స్పీకర్ ఆదేశించారు. దీంతో ఖాన్ మరోసారి క్షమాపణలు చెప్పారు. రమాదేవి తనకు సోదరిలాంటి వారని పేర్కొన్నారు.

యావత్ దేశం బాధపడింది: రమాదేవి

అనంతరం రమాదేవి మాట్లాడుతూ.. ఆజంఖాన్ వ్యాఖ్యలు దేశం మొత్తాన్ని బాధించాయని చెప్పారు. అలాంటి వ్యాఖ్యలు వినేందుకు తాను సభకు రాలేదన్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆజంఖాన్‌కు అలవాటు అని, సభ వెలుపల ఇప్పటికే అనేకసార్లు ఇలాంటి వ్యాఖ్యలు చేశారని చెప్పారు. ఆయన అలవాట్లను మార్చుకోవాలని హితవు పలికారు. ఈసమయంలో అఖిలేశ్ మాట్లాడేందుకు ప్రయత్నించగా, ఎందుకు ఆయన ఖాన్‌కు మద్దతునిస్తున్నారని రమాదేవి ప్రశ్నించారు. గురువారం లోక్‌సభలో ట్రిపుల్ తలాక్‌పై చర్చ సందర్భంగా అధ్యక్ష స్థానంలో కూర్చున్న రమాదేవిపై ఆజంఖాన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలిసిందే.

ఎన్ఎంసీ బిల్లుకు ఆమోదం

- వైద్య విద్య రంగంలో 'ఇన్‌స్పెక్టర్ రాజ్'కు చరమగీతం
- చరిత్రలో అతిపెద్ద సంస్కరణగా నిలిచిపోతుంది: కేంద్రమంత్రి హర్షవర్ధన్
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని విపక్షాల ఆందోళన.. సభ నుంచి వాకౌట్

న్యూఢిల్లీ, జూలై 29: అవినీతి ఆరోపణలున్న భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) స్థానంలో జాతీయ వైద్య కమిషన్‌ను (ఎన్ఎంసీని) ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఎన్ఎంసీ బిల్లు-2019ను సోమవారం లోక్‌సభ ఆమోదించింది. దేశంలో అతిపెద్ద సంస్కరణల్లో ఇది ఒకటని, వైద్య విద్య రంగంలో 'ఇన్‌స్పెక్టర్ రాజ్' శకానికి ఇది ముగింపు పలుకుతుందని ప్రభుత్వం పేర్కొంది. బిల్లును వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ సభ నుంచి వాకౌట్ చేయగా, మూజువాణి ఓటుతో బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లు ద్వారా ఎంసీఐ చట్టం-1956ని రద్దు చేయనున్నారు. వైద్య విద్యలో జాతీయవ్యాప్తంగా ఒకే విధమైన ప్రమాణాలను నిర్దేశించనున్నారు. ఎంబీబీఎస్ ఫైనలియర్ ఎగ్జామ్‌నే పీజీకి ప్రవేశపరీక్షగా పరిగణించనున్నారు. దీన్నే నేషనల్ ఎగ్జిట్ టెస్ట్‌గా (నెక్స్ట్‌గా) పిలుస్తున్నారు. అలాగే విదేశాల్లో మెడిసిన్ చేసిన విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించనున్నారు. అయితే ఎగ్జిట్ ఎగ్జామ్‌తో పాటు ప్రతిపాదిత కమిషన్‌లో ఎన్నికైన సభ్యులకు బదులు నామినేటెడ్ సభ్యులను నియమించడాన్ని ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. ఈ బిల్లు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నదని ఆరోపిస్తున్నారు. అయితే వారి ఆందోళనలను మంత్రి హర్షవర్ధన్ కొట్టివేశారు. ఇది స్వార్థ ప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన బిల్లు అని, 'ఇన్‌స్పెక్టర్ రాజ్'కు ముగింపు పలుకుతుందని, వైద్య కాలేజీల్లో సీట్లు పెరిగేందుకు దోహదపడుతుందని వివరించారు. బిల్లును వ్యతిరేకిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించామని చెప్పారు. అంతకు ముందు బిల్లును సభ పరిగణనలోకి తీసుకునే తీర్మానంపై ఓటింగ్ నిర్వహించగా, 260-48 ఓట్లతో తీర్మానం ఆమోదం పొందింది. పలువురు ప్రతిపక్ష సభ్యులు సూచించిన సవరణలు వీగిపోయాయి. తాము ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం పట్టించుకోనందున, ఈ బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత అధిర్‌రంజన్ చౌదరి తెలిపారు.

లోక్‌సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి హర్షవర్ధన్

వార్షిక తనిఖీలు ఉండవు..

సభలో మంత్రి హర్షవర్ధన్ మాట్లాడుతూ.. ఈ బిల్లు పేదలకు అనుకూలమని చెప్పారు. ప్రభుత్వ సీట్లతోపాటు 50 శాతం ప్రైవేట్ సీట్లు కూడా ఆర్థికంగా వెనుకబడిన మెరిట్ విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఎన్ఎంసీ బిల్లుకు ఉభయ సభలూ ఆమోదం తెలిపిన తర్వాత మూడేండ్లకు ఎగ్జిట్ ఎగ్జామ్‌ను అమలుచేస్తామని వెల్లడించారు. రాష్ట్రాల హక్కులను బిల్లు కాలరాస్తున్నదన్న విపక్షాల ఆరోపణలకు స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేనిదే ఏ ఒక్క కాలేజీ కూడా ఏర్పాటు కాబోదు అని స్పష్టం చేశారు. వైద్య కళాశాలల రోజువారీ వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రమేయం ఉండదన్నారు. 'వార్షిక తనిఖీలు ఇక ఉండవు. 'ఇన్‌స్పెక్షన్ రాజ్' పోయి.. దేశంలో యూజీ, పీజీ సీట్లు పెరుగుతాయి' అని తెలిపారు. చరిత్రను లిఖించినప్పుడు.. ఈ బిల్లు అతిపెద్ద సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు.

బిల్లులోని ముఖ్యాంశాలు

1. ఎంసీఐ స్థానంలో ఎన్ఎంసీ ఏర్పాటు
2. ఎన్ఎంసీలో 25 మంది సభ్యులు ఉంటారు. వీరిని కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేస్తుంది.
3. వైద్య సంస్థలు, వైద్య నిపుణుల నియంత్రణకు ఎన్ఎంసీ విధానాలు రూపొందిస్తుంది. ప్రైవేట్ కాలేజీల్లో 50 శాతం సీట్లపై ఫీజుల నియంత్రణకు మార్గదర్శకాలు రూపొందిస్తుంది.
4. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు, ఎన్ఎంసీకి మధ్య వారధిగా మెడికల్ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తారు.
5. వైద్య విద్యకోర్సుల్లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నీట్‌ను నిర్వహిస్తారు.
6. ఎంబీబీఎస్ ఫైనలియర్ పరీక్షనే పీజీకి ప్రవేశపరీక్షగా పరిగణిస్తారు. దీన్ని నేషనల్ ఎగ్జిట్ ఎగ్జామ్‌గా పిలుస్తున్నారు.
7. విదేశాల్లో మెడిసిన్ చేసిన విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.

కమిషన్‌లో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేదు: అధిర్

ఎన్ఎంసీ బిల్లు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నదని కాంగ్రెస్ లోక్‌సభాపక్షనేత అధిర్ రంజన్‌చౌదరి విమర్శించారు. బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపాదిత ఎన్ఎంసీలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రాతినిధ్యం లేదని ఆరోపించారు. డీఎంకే ఎంపీ ఏ రాజా మాట్లాడుతూ.. ఈ బిల్లు పేదలకు, సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నదన్నారు. వైద్య వృత్తిలో అవినీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని ఇది ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. ఎగ్జిట్ ఎగ్జామ్.. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కకోలి ఘోష్ దస్తిదార్ మాట్లాడుతూ.. ఈ బిల్లు విద్యార్థుల భవిష్యత్తును ఇది త్రిశంకు స్వర్గంలోకి నెడుతుందని వ్యాఖ్యానించారు.ఎన్‌సీ, ఐయూఎంఎల్, టీడీపీ, ఆర్ఎస్పీ, సీపీఐ సభ్యులు కూడా బిల్లును వ్యతిరేకించారు.

అనియంత్రిత డిపాజిట్లపై నిషేధం

బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర

న్యూఢిల్లీ, జూలై 29: పోంజీ స్కీముల నుంచి పేద మదుపరులకు రక్షణ కల్పించే 'అనియంత్రిత డిపాజిట్ల నిషేధిత బిల్లు-2019'కు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ నెల 24నే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలుపగా, తాజాగా సోమవారం రాజ్యసభ కూడా ఆమోదం తెలిపింది. పార్టీలకతీతంగా సభ్యులు ఈ బిల్లుకు మద్దతు తెలిపారు. బిల్లుపై సభలో జరిగిన చర్చకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ సమాధానమిస్తూ.. పేద ప్రజల ప్రయోజనాలను రక్షించేందుకు ఈ బిల్లును తీసుకొచ్చినట్లు చెప్పారు. అక్రమంగా డిపాజిట్లు సేకరించిన వారికి ఈ బిల్లు ప్రకారం కనీసం ఏడాది నుంచి ఐదేండ్ల వరకు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. డిపాజిట్ల సేకరణకు సంబంధించి నియంత్రిత, అనియంత్రిత కంపెనీల వివరాలు తెలియజేసేలా సెంట్రల్ డేటాబేస్‌ను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు.

బాధితులను బస్సులో తరలిస్తున్న పోలీసులు

అమెరికా ఫుడ్ ఫెస్టివల్‌లో కాల్పులు

- ముగ్గురు మృతి, 15 మందికి గాయాలు

లాస్‌ఏంజెల్స్: అమెరికాలోని కాలిఫోర్నియాలో కాల్పుల కలకలం రేగింది. గిల్‌రాయ్‌లో జరుగుతున్న గార్లిక్ ఫుడ్ ఫెస్టివల్‌లో ఆదివారం ఓ దుండగుడు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా, 15 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఆరేండ్ల బాలుడు కూడా ఉన్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిమిషం వ్యవధిలోనే దుండగుడిని హతమార్చినట్టు పోలీసు ఉన్నతాధికారి స్కాట్ స్మిత్ తెలిపారు. 'ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఈ కాల్పుల ఘటనలో మరో దుండగుడి ప్రమేయం కూడా ఉన్నట్టు భావిస్తున్నాం. అతని కోసం గాలింపు చర్యలు మొదలెట్టాం' అని ఆయన తెలిపారు. దుండగుడు కాల్పులు జరుపడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని స్మిత్ పేర్కొన్నారు. 19 ఏండ్ల వయసున్న సాంటినో విలియం లెగాన్ అనే వ్యక్తి ఈ కాల్పులకు తెగబడ్డట్టు మీడియా పేర్కొంది. బాధిత కుటుంబాలకు అధ్యక్షుడు ట్రంప్ సంతాపం ప్రకటించారు. ఏటా మూడు రోజులపాటు నిర్వహించే ఈ వేడుకలకు లక్ష మందికి పైగా హాజరవుతారని అంచనా.

బ్రెజిల్ జైల్లో ఘర్షణ

52 మంది ఖైదీల మృతి

రియోడి జనీరో, జూలై 29: ఉత్తర బ్రెజిల్‌లోని జైల్లో సోమవారం ఖైదీల మధ్య జరిగిన ఘర్షణలో 52 మంది మృతి చెందారు. అల్టమీరా ప్రాంతీయ పునరుద్ధరణ కేంద్రంలో ఉదయం 7 గంటలకు రెండు గ్రూపుల మధ్య తలెత్తిన అల్లర్ల కారణంగా పరిస్థితి అదుపుతప్పినట్లు జైలు అధికారులు తెలిపారు. మృతుల్లో చాలా మంది ఊపిరి ఆడక చనిపోయినట్లు వెల్లడించారు. ఇద్దరు గార్డులను నిర్బంధించిన ఖైదీలు మధ్యాహ్నం నాటికి విడిచిపెట్టినట్లు జైలు అధికారులు చెప్పారు. అదనపు పోలీస్ బలగాలను రప్పించి పరిస్థితిని అదుపు చేసినట్లు వివరించారు. ఈ అల్లర్లలో మృతి చెందిన 16 మంది ఖైదీలను కొన్ని నెలల కిందట మరో జైల్లో జరిగిన భారీ హింసాకాండ నేపథ్యంలో ఇక్కడకు తరలించినవారిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. కాగా జైలు నుంచి దట్టమైన పొగలు రావడంతోపాటు జైలు భవనంపై పలువురు కూర్చున్న దృశ్యాలను స్థానిక మీడియా ప్రసారం చేసింది. అమెరికా, చైనా తర్వాత బ్రెజిల్‌లో ఖైదీల సంఖ్య ఎక్కువగా ఉన్నది. బ్రెజిల్ జైళ్లలో గ్రూపుల మధ్య ఘర్షణలు, హింసాత్మక అల్లర్లు గత కొంతకాలంగా తరచూ జరుగుతున్నాయి.

జైలు దగ్గర భద్రత దళాల మోహరింపు

ఉన్నావ్ ప్రకంపనలు.. బీజేపీ ఎమ్మెల్యేపై హత్య కేసు

- ప్రమాదంలో గాయపడిన బాధితురాలు, న్యాయవాది పరిస్థితి విషమం
- పార్లమెంట్‌ను కుదిపేసిన యూపీ వ్యవహారం
- సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలంటున్న విపక్షం

లక్నో: ఉన్నావ్ (ఉత్తర్‌ప్రదేశ్) లైంగికదాడి కేసులో ఆరోపణలెదుర్కొంటున్న బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెన్‌గర్‌తోపాటు మరో 9 మందిపై ఆ రాష్ట్ర పోలీసులు సోమవారం హత్యతోపాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేశారు. ఆదివారం బాధితురాలు తన బంధువులు, న్యాయవాదితో కలిసి ప్రయాణిస్తున్న కారును ఓ లారీ ఢీకొన్న సంగతి తెలిసిందే. దీంతో బాధితురాలి బంధువులైన ఇద్దరు మహిళలు మరణించారు. తీవ్రంగా గాయపడ్డ బాధితురాలు, ఆమె న్యాయవాది మహేంద్ర సింగ్.. లక్నో దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఢిల్లీ మహిళాకమిషన్ చైర్‌పర్సన్ స్వాతి సోమవారం వారిని పరామర్శించారు. బాధితురాలి కుటుంబంతోపాటు విపక్షాలు ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేశాయి. ఇది సోమవారం పార్లమెంట్‌ను కుదిపేసింది. లారీ అతివేగం, వర్షం వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నట్లు డీజీపీ ఓపీ సింగ్ తెలిపారు. సీబీఐ దర్యాప్తుపై బాధిత కుటుంబం ఫిర్యాదును సర్కార్‌కు నివేదించినట్లు చెప్పారు. ఇది తమ కుటుంబం అంతానికి జరిగిన కుట్ర అని, తమను చంపుతామని ఎమ్మెల్యే అనుచరులు ఇటీవల బెదిరించినట్లు బాధితురాలి తల్లి తెలిపారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు ప్రమాద కారణమైన లారీ నంబర్ ప్లేట్‌కు నల్లరంగు పూయడం గమనించారు. ఫతేపూర్‌కు చెందిన లారీ నంబర్ యూపీ 71 ఏటీ 8300గా గుర్తించారు. దీన్ని ఫోరెన్సిక్ విభాగానికి పంపిస్తామని లక్న

డిస్కవరీ చానల్ కార్యక్రమంలో ప్రధాని మోదీ, బేర్‌గ్రిల్స్

చేతిలో బరిసె.. అడవిలో మోదీ

డిస్కవరీ చానల్ 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' ఎపిసోడ్ చిత్రీకరణలో పాల్గొన్న ప్రధాని

ముంబై, జూలై 29: డిస్కవరీ చానల్‌లో వచ్చే ప్రముఖ అడ్వెంచర్ ప్రోగ్రామ్ 'మ్యాన్ వర్సెస్ వైల్డ్'లో ప్రధాని మోదీ కనిపించనున్నారు. ఆ షో హోస్ట్(వ్యాఖ్యాత) బేర్ గ్రిల్స్ ప్రధానిని ఇంటర్వ్యూ చేశారు. జంతువుల సంరక్షణ, పర్యావరణ మార్పులపై మోదీతో గ్రిల్స్ ఈ ప్రత్యేక ఎపిసోడ్‌లో చర్చించారు. ఈ కార్యక్రమాన్ని 180కి పైగా దేశాల్లో ఆగస్టు 12వ తేదీన రాత్రి 9 గంటలకు డిస్కవరీ చానల్ ప్రసారం చేయనున్నది. ప్రధాని మోదీతో కలిసి బేర్ గ్రిల్స్ అడవుల్లో పర్యటించిన ఎపిసోడ్‌కు సంబంధించిన ప్రోమోను డిస్కవరీ చానల్ సోమవారం విడుదల చేసింది. ఉత్తరాఖండ్ అడవుల్లో ఉన్న జిమ్ కార్బెట్ నేషనల్ పార్కులో ఈ చిత్రీకరణ జరిపినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రోమో వీడియోలో నదిలో మోదీ ప్రయాణం, అడవిలో మృగాల నుంచి కాపాడుకునేందుకు గిరిజనులు వాడే బరిసెలను చేతబట్టి ఉన్న మోదీ తదితర సన్నివేశాలు కనిపిస్తున్నాయి.

మూడోసారి చంద్రయాన్-2 కక్ష్య పెంపు

న్యూఢిల్లీ,జూలై 29: చంద్రయాన్-2 వాహకనౌక కక్ష్యను మూడో సారి విజయవంతంగా పెంచినట్లు ఇస్రో తెలిపింది. సోమవారం మధ్యాహ్నం 3.12 గంటలకు కక్ష్య పెంపు ప్రక్రియ పూర్తయిందని ఇస్రో ట్వీట్ చేసింది. 989 సెకన్లలో కక్ష్య పెంపు ప్రక్రియను పూర్తి చేశామని పేర్కొంది. ప్రస్తుతం చంద్రయాన్ అన్ని పారామీటర్ల ప్రకారం నిర్దేశించిన విధంగా ముందుకు వెళ్తున్నదని వివరించింది. నాలుగో దఫా కక్ష్య పెంపు ప్రక్రియను ఆగస్టు రెండో తేదీ మధ్యాహ్నం 2-3 గంటల మధ్య చేపట్టనున్నట్లు ఇస్రో పేర్కొంది.

సుప్రీంకోర్టును ఆశ్రయించిన

ఇద్దరు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ, జూలై 29: అనర్హత వేటు పడిన ఇద్దరు కర్ణాటక కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమను అనర్హులుగా ప్రకటిస్తూ జూలై 25న స్పీకర్ కే ఆర్ రమేశ్ కుమార్ జారీ చేసిన ఆదేశాలను రద్దుచేయాలని రమేశ్ ఎల్ జర్కిహోళి, మహేశ్ కుమతల్లి పిటిషన్ దాఖలు చేశారు. అలాగే, తమ రాజీనామాలను ఆమోదించకుండా స్పీకర్ జారీ చేసిన ఆర్డర్‌ను కూడా రద్దు చేయాలని సదరు ఎమ్మెల్యేలు పిటిషన్‌లో కోరారు. మరోవైపు, ఆర్ శంకర్ అనే స్వతంత్ర ఎమ్మెల్యే సైతం తనపై వేసిన అనర్హత వేటును రద్దుచేయాలని కోరుతూ మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్టు సమాచారం. గత గురువారం కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు రమేశ్ ఎల్ జర్కిహోళి, మహేశ్ కుమతల్లి, స్వతంత్ర ఎమ్మెల్యే ఆర్ శంకర్‌ను స్పీకర్ అనర్హులుగా ప్రకటించిన విషయం తెలిసిందే.

యెడియూరప్ప విజయం

- విశ్వాసపరీక్షలో నెగ్గిన కర్ణాటక ముఖ్యమంత్రి
- సొంతంగానే మ్యాజిక్‌ఫిగర్ అందుకున్న బీజేపీ
- కనీసం ఆరు నెలలపాటు ప్రభుత్వానికి ఢోకా లేనట్టే
- బలపరీక్ష అనంతరం స్పీకర్ రమేశ్‌కుమార్ రాజీనామా
- ఎమ్మెల్యేలను ఉద్దేశించి భావోద్వేగ ప్రసంగం

సోమవారం సమావేశమైన కర్ణాటక అసెంబ్లీ.. విశ్వాసపరీక్ష నెగ్గిన అనంతరం సీఎం యెడియూరప్పను అభినందిస్తున్న సిద్ధరామయ్య

బెంగళూరు, జూలై 29: కర్ణాటక సీఎం యెడియూరప్ప బలపరీక్షలో నెగ్గారు. సోమవారం నిర్వహించిన విశ్వాస పరీక్షలో ప్రభుత్వం మెజార్టీ సాధించింది. 'వాయిస్ ఓట్' విధానంలో ఓటింగ్, కౌంటింగ్ జరిపారు. కర్ణాటక అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 225 కాగా, వీరిలో 17 మంది అసమ్మతి ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. దీంతో సంఖ్య 208కి తగ్గింది. మ్యాజిక్ ఫిగర్ 105కు మారింది. ప్రభుత్వం ఏర్పాటుకు కావాల్సిన కనీస ఎమ్మెల్యేల సంఖ్య 105 కాగా.. బీజేపీ సొంతంగానే మ్యాజిక్ ఫిగర్ అందుకున్నది. ఒక స్వతంత్ర ఎమ్మెల్యే హెచ్ నగేశ్ సైతం మద్దతు పలికారు. తర్వాత స్పీకర్ రమేశ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను డిప్యూటీ స్పీకర్ కృష్ణారెడ్డికి అందజేశారు. స్పీకర్ పదవి హూందాతనాన్ని, గౌరవాన్ని నిలబెట్టేందుకు శాయశక్తులా కృషిచేశానని రమేశ్‌కుమార్ చెప్పారు. ఈ క్రమంలో ఎవరినైనా ఇబ్బంది పెట్టి ఉంటే క్షమించాలని కోరారు. విశ్వాసపరీక్ష నెగ్గడంతో నూతన ప్రభుత్వానికి కనీసం ఆరు నెలలు ఢోకా లేనట్టయింది. అనర్హత వేటుతో ఖాళీ అయిన 17 స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించి, ఫలితాలు వెల్లడయ్యేందుకు కనీసం ఆరు నెలలు పడుతుందని విశ్లేషకులు చెప్తున్నారు. 17 స్థానాల్లో బీజేపీ కనీసం ఎనిమిది గెలుచుకున్నా సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయగలదు.

సజావుగా బలపరీక్ష

నెలరోజులుగా హైడ్రామా కొనసాగుతున్న కర్ణాటక అసెంబ్లీలో సోమవారం బలపరీక్ష సజావుగా సాగింది. సీఎం యెడియూరప్ప విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఓటింగ్‌కు స్పీకర్ దూరంగా ఉన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన కనీస మద్దతు దక్కడంతో బీజేపీ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో నెగ్గింది. అనంతరం అసెంబ్లీ ఆర్థిక బిల్లును ఆమోదించింది.

రాజ్యాంగ విరుద్ధం, అనైతికం: సిద్ధరామయ్య

యెడియూరప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం రాజ్యాంగ విరుద్ధమని, అనైతికమని విపక్ష నేత సిద్ధరామయ్య మండిపడ్డారు. చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యెడియూరప్ప కేవలం 105 మంది ఎమ్మెల్యేలతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారని మండిపడ్డారు. బీజేపీకి కనీస సంఖ్యాబలం, ప్రజల మద్దతు లేదన్నారు. 'అసెంబ్లీ గడువు ముగిసేవరకు యెడియూరప్ప సీఎంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా. కానీ అది సాధ్యం కాకపోవచ్చు. 105 మందితో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయలేరు. ఎప్పుడూ ఒకరిపై ఆధారపడాల్సిందే. ఇంకెన్నిరోజులు ఆ పదవిలో కొనసాగుతారో చూస్తా' అని అన్నారు. యెడియూరప్ప ఒక్కసారి కూడా పూర్తి ప్రజాబలంతో అధికారంలోకి రాలేదని ఎద్దేవాచేశారు. 'మీరు 2008 లో అధికారంలోకి వచ్చినప్పుడు బీజేపీకి 110 సీట్లు రాగా, ఆరుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల సాయంతో ప్రభుత్వం ఏర్పాటుచేశారు. ఇప్పుడు 105 మందితో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నారు' అని గుర్తుచేశారు. గత 14 నెలల పాలనలో యంత్రాంగం కుప్పకూలిందన్న సీఎం వ్యాఖ్యలను సిద్ధరామయ్య, మాజీ సీఎం కుమారస్వామి ఖండించారు. 'మీరు యంత్రాంగం కుప్పకూలిందనడం తగదు. అదెలా జరిగిందో వివరిస్తే బాగుంటుంది' అని కుమారస్వామి అన్నారు. 'మీరు కుట్రపూరితంగా అధికారం దక్కించుకున్నారు. కనీసం ఇప్పుడైనా రాజ్యాంగాన్ని కాపాడండి' అని యెడియూరప్పకు సూచించారు. బీజేపీ చట్టవిరుద్ధంగా అధికారంలోకి వచ్చినందున విశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్టు సిద్ధరామయ్య, కుమారస్వామి ప్రకటించారు. విశ్వాస పరీక్షలో నెగ్గడంతో క్యాబినెట్ కూర్పుపై సీఎం దృష్టి సారించారు.

సభలో మొత్తం సభ్యులు	208
మ్యాజిక్ ఫిగర్	105
బీజేపీ +	106
ప్రతిపక్షాలు	101

ప్రతీకారం కాదు.. అభివృద్ధి ముఖ్యం: సీఎం

విశ్వాస పరీక్ష సందర్భంగా సీఎం యెడియూరప్ప మాట్లాడుతూ గతాన్ని మరిచిపోయి, కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. వచ్చే మూడేండ్ల 10 నెలల్లో అభివృద్ధిపైనే దృష్టిసారిస్తానని చెప్పారు. 'గత 14 నెలల్లో (కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వం) ఎలాంటి ప్రతీకార రాజకీయాలకు పాల్పడలేదు. ఇందుకు ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య, మాజీ సీఎం కుమారస్వామికి కృతజ్ఞతలు తెలుపుతున్నా. నేనూ ఇదే విధానాన్ని పాటిస్తా' అని హామీ ఇచ్చారు. 'మర్చిపోవడం.. క్షమించడం' అనేది తన విధానమన్నారు. రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు తాను బాధ్యతలు చేపట్టానన్నారు. పరిస్థితిని చక్కదిద్దడంతోపాటు రాష్ట్ర ప్రగతిపైనే దృష్టిసారిస్తానన్నారు. 'గత 14 నెలల పాలనలో యంత్రాంగం కుప్పకూలిపోయింది. దాన్ని మళ్లీ గాడిలో పెట్టడమే నా ప్రథమ కర్తవ్యం. దీనికి విపక్షం సహకారం ఎంతో అవసరం' అని అన్నారు.

రాజ్యాంగబద్ధంగా వ్యవహరించా

- స్పీకర్ రమేశ్‌కుమార్

తన రాజీనామా లేఖను డిప్యూటీ స్పీకర్‌కు అందించిన అనంతరం సభ్యులకు నమస్కరిస్తున్న స్పీకర్ రమేశ్‌కుమార్

విశ్వాస పరీక్ష తర్వాత స్పీకర్ రమేశ్‌కుమార్ రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బీజేపీ తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టక ముందే స్వచ్ఛందంగా వైదొలిగారు. తన రాజీనామా లేఖను డిప్యూటీ స్పీకర్ కృష్ణారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ భావోద్వేగ ప్రసంగం చేశారు. 'నేను ఈ పదవిలో కొనసాగదలుచుకోలేదు. రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నా' అని చెప్పారు. స్పీకర్‌గా తన ఎంపిక, రాజకీయాల్లో డబ్బు, అధికారం పాత్ర, అవినీతి, 105 మంది ఎమ్మెల్యేల బలంతో యెడియూరప్ప అధికారంలోకి రావడం తదితర విషయాలపై మాట్లాడారు. గత 14 నెలల్లో తన మనఃసాక్షి మేరకు రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వర్తించానన్నారు. స్పీకర్ హోదాలో కూర్చోవడం.. తన జీవితంలో సాధించిన అతిపెద్ద విజయమన్నారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కోరారు. రాజకీయ నేతలు తమ స్వార్థం, కుటుంబ ప్రయోజనాల కోసం పార్టీని నాశనం చేయొద్దన్నారు. 'అర్హత లేకున్నా అధికారంలోకి రావడం రాజ్యాంగానికి మంచిది కాదు' అని పరోక్షంగా యెడియూరప్పను ఉద్దేశించి అన్నారు. 'ఏదో ఒకరకంగా మీకు పాలించే అవకాశం వచ్చింది. కర్ణాటక ప్రజల మనసులో చెరుగని ముద్ర వేసేలా పాలించండి' అని సూచించారు. ఇకపై మీ చుట్టూ చేరేవారి పట్ల జాగ్రత్త వహించాలని సీఎంను హెచ్చరించారు. 'రాజకీయ నేతలు మొదట్లో మంచివారిగానే ఉండొచ్చు. కానీ అధికారంలోకి వచ్చాక అనేకమంది మీ చుట్టూ చేరి, మిమ్మల్ని అవినీతివైపు ప్రోత్సహిస్తారు. అలాంటివారు మీకు ఏనాడూ స్నేహితులు కారు.. అధికారానికి మాత్రమే సన్నిహితులు' అని పేర్కొన్నారు.

10వ షెడ్యూల్ లక్ష్యం నెరవేరడం లేదు

17 మంది రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడంలో ఏ దురుద్దేశం లేదని రమేశ్‌కుమార్ స్పష్టంచేశారు. ఫిరాయింపుల నిరోధక చట్టం లక్ష్యాలు నెరవేరడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. కాబట్టి పదో షెడ్యూల్‌ను పునఃసమీక్షించాలని కోరారు. 'నా చర్యతో రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లోని అంశాలపై సమీక్షించాలనే అభిప్రాయం తెరమీదికొచ్చింది. ఈ మేరకు కేంద్రాన్ని కోరే హక్కు ఈ సభకు ఉన్నది' అని అన్నారు. దేశంలో అవినీతి మూల కారణాల్లో ఎన్నికల ప్రక్రియ కూడా ఒకటన్నారు. ఎన్నికల వేళ అభ్యర్థులు ప్రకటించిన ఆస్తులు, వాటిపై ఉన్న వివాదాలపై విచారణ జరుపాలని ఎన్నికల సంఘానికి సూచించారు. 'అఫిడవిట్‌లో రూ.కోట్ల ఆస్తులు ఉన్నాయని అభ్యర్థులు ప్రకటించగానే.. ఈసీ వెంటనే ఆ పత్రాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు (ఈడీ) పంపాలి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో విచారణ జరిపిస్తేనే ప్రజలకు నిజాలు తెలుస్తాయి' అని రమేశ్‌కుమార్ అన్నారు.

239 డ్యామ్‌లు.. వందేండ్లు పైబడినవే

తమిళనాడులోని కల్లనయ్ డ్యామ్

- 1,041 డ్యామ్‌లు 50-100 ఏండ్ల నాటివి
- మంత్రి గజేంద్రసింగ్ వెల్లడి
- లోక్‌సభ ముందుకు డ్యామ్ భద్రత బిల్లు

న్యూఢిల్లీ, జూలై 29: దేశంలో సుమారు 239 పెద్ద డ్యామ్‌లు వందేండ్ల పైబడినవేనని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్ వెల్లడించారు. ఆనకట్టల భద్రతకు సంబంధించిన బిల్లును సోమవారం ఆయన లోక్‌సభలో ప్రవేశపెట్టారు. డ్యామ్‌ల పర్యవేక్షణ, తనిఖీ, నిర్వహణతోపాటు ఆయా రాష్ట్రాల మధ్య వివాదాలను పరిష్కరించేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీని ఏర్పాటు చేయాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తున్నది. అలాగే డ్యామ్ సంబంధిత విపత్తులు జరుగకుండా నిరోధించేందుకు జాతీయ స్థాయిలో ఓ కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. డ్యామ్‌ల భద్రతకు ఈ కమిటీ ప్రమాణాలను, విధానాలను రూపొందిస్తుంది. లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి షెఖావత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 5,344 పెద్ద ఆనకట్టలు ఉన్నాయని, వాటిలో 293 డ్యామ్‌లు వందేండ్ల పైబడినవేనని వెల్లడించారు. 1,041 డ్యామ్‌లు 50-100 ఏండ్ల నాటివని తెలిపారు. దేశంలో 92 శాతం ఆనకట్టలు అంతర్రాష్ట్ర నదులపై నిర్మించినవేనని చెప్పారు. సంబంధిత డ్యామ్‌ల పర్యవేక్షణ, తనిఖీలు, నిర్వహణ కోసం నిర్దేశిత ప్రమాణాలు, మార్గదర్శకాలు, విధానాల అమలుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీఅథారిటీ అనేది ఒక నియంత్రణ సంస్థగా పనిచేస్తుందని వివరించారు. అలాగే ఆయా రాష్ట్రాల డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ల మధ్య వివాదాల పరిష్కారానికి కృషి చేస్తుందని చెప్పారు. కాగా, బిల్లు ప్రకారం తమ పరిధిలోని డ్యామ్‌లపై నిరంతర నిఘా ఉంచడం, తనిఖీలు నిర్వహించడం సంబంధిత రాష్ట్ర డ్యామ్ భద్రతా సంస్థల బాధ్యత. అలాగే డ్యామ్ పరిస్థితి, విపత్తులను తట్టుకునే సామర్థ్యం ఆధారంగా ప్రతి డ్యామ్‌ను వర్గీకరించాల్సి ఉంటుంది. రాష్ట్రాల అధికారాలను కేంద్రం కాలరాస్తున్నదని పేర్కొంటూ ఈ బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి.

దేశంలోని పురాతన డ్యామ్‌లు

కల్లనయ్ డ్యామ్
రాష్ట్రం: తమిళనాడు
నది: కావేరి
నిర్మాణం: 2వ శతాబ్దం
నిర్మించినది: చోళ రాజు కరికాలన్

కొడివెరి డ్యామ్
రాష్ట్రం: తమిళనాడు
నది: భవాని
నిర్మాణం: 17వ శతాబ్దం
నిర్మించినది: రాజా జయగొండ సోఝూ కొంగల్‌వాన్

ధవళేశ్వరం బ్యారేజ్
రాష్ట్రం: ఆంధ్రప్రదేశ్
నది: గోదావరి
నిర్మాణం: 1850
నిర్మించినది: సర్ ఆర్థర్ థామస్ కాటన్

పుఝుల్ రిజర్వాయర్
రాష్ట్రం: తమిళనాడు
నది: కృష్ణా
నిర్మాణం: 1876
నిర్మించినది: బ్రిటిష్ ప్రభుత్వం

పెచిపరై రిజర్వాయర్
రాష్ట్రం: తమిళనాడు
నది: కొడయార్
నిర్మాణం: 1906
నిర్మించినది: ట్రావెన్‌కోర్ మహారాజు మూలమ్ తిరునాల్ హయాంలో

వాణి విలాస సాగర
రాష్ట్రం: కర్ణాటక
నది: వేదవతి
నిర్మాణం: 1907
నిర్మించినది: మైసూరు మహారాజులు

రాజ్యసభలో వెంకయ్య కంటతడి

జైపాల్‌రెడ్డి మృతిపై సంతాప తీర్మానం చదువుతూ తీవ్ర భావోద్వేగం

- జైపాల్‌రెడ్డితో తనది 40 ఏండ్ల అనుబంధమని వ్యాఖ్య
- ఆప్తమిత్రుడి మరణం తీవ్రంగా బాధించిందని ఆవేదన

జైపాల్‌రెడ్డికి నివాళిగా మౌనం పాటిస్తున్న రాజ్యసభ సభ్యులు

జైపాల్‌రెడ్డిని తలచుకొని కన్నీరు పెడుతున్న వెంకయ్యనాయుడు

న్యూఢిల్లీ, జూలై 29: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జైపాల్‌రెడ్డి కన్నుమూతపై రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు కన్నీటిపర్యంతమయ్యారు. సోమవారం రాజ్యసభలో సంతాప తీర్మానం చదువుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన స్నేహితుడి మరణం ఎంతగానో బాధించిందని గద్గద స్వరంతో అన్నారు.. జైపాల్‌రెడ్డి మృతితో దేశం ఉత్తమ పార్లమెంటేరియన్‌ను, గొప్ప వక్తను, సమర్థ పరిపాలకుడిని కోల్పోయిందన్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని వెంకయ్యనాయుడు గుర్తు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తాము సభ్యులుగా ఉన్నప్పుడు పక్కపక్కనే కూర్చునేవారమని చెప్పారు. తన కంటే జైపాల్‌రెడ్డి ఆరేండ్లు సీనియర్ అని, ఆయన తనకు స్నేహితుడు, సీనియర్, మార్గదర్శకుడని పేర్కొన్నారు. ఆయన మృతికి రాజ్యసభ ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నదన్నారు. అనంతరం జైపాల్‌రెడ్డికి నివాళిగా సభ్యులందరూ తమ స్థానాల్లో లేచి నిలబడి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. అప్పట్లో ఏపీ అసెంబ్లీ ఉదయం 8 గంటలకే సమావేశమయ్యేదని, తానూ, జైపాల్‌రెడ్డి ఉదయం 7 గంటలకు అల్పాహార సమయంలో కలిసి వివిధ అంశాలపై చర్చించేవారమని గుర్తు చేసుకున్నారు. ఆయన మనల్ని విడిచివెళ్లడం ఎంతో బాధాకరమన్నారు. ఈ సమయంలో వెంకయ్య తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఉబికివస్తున్న కన్నీళ్లను తుడుచుకుంటూ.. జైపాల్‌రెడ్డితో తనది 40 ఏండ్ల అనుబంధమని, అందుకే భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోతున్నానని, క్షమించాలని కోరారు. కాగా, ప్రెసిడెంట్స్ కప్ బాక్సింగ్ టోర్నీలో పసిడి పతకం సాధించిన బాక్సర్, రాజ్యసభ ఎంపీ మేరీ కోమ్‌కు రాజ్యసభ అభినందనలు తెలిపింది. మేరీకోమ్‌తోపాటు మెడల్స్ సాధించిన ఇతర బాక్సర్లు సిమ్రన్‌జిత్ కౌర్, జమున బోరో, మోనికా, నీరజ్‌స్వామి, అనంత ప్రహ్లాద్ చోపడే, అనుష్ దహియాలను వెంకయ్యనాయుడు అభినందించారు.

గోవా అసెంబ్లీ సంతాపం

జైపాల్ రెడ్డి మృతి పట్ల గోవా అసెంబ్లీ సోమవారం సంతాపం ప్రకటించింది. ఈ మేరకు స్పీకర్ రాజేశ్ పట్నేకర్ సభలో సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దేశానికి జైపాల్‌రెడ్డి ఎనలేని సేవలు అందించారని ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్ కొనియాడారు.

రాజ్యసభలో బీజేపీ ఎంపీకి కరెంట్ షాక్!

- షార్ట్ సర్క్యూట్‌తో మైక్ నుంచి పొగలు
- 15 నిమిషాల పాటు సభ వాయిదా

న్యూఢిల్లీ: రాజ్యసభలో సోమవారం షార్ట్ సర్క్యూట్ వల్ల ఓ బీజేపీ ఎంపీకి కరెంట్ షాక్ తగిలింది. మైక్ నుంచి పొగలు రావడంతో సభ 15 నిమిషాల పాటు వాయిదా పడింది. మాజీ ఎంపీ ఎస్ జైపాల్‌రెడ్డి మృతికి సోమవారం సభ్యులు సంతాపం తెలిపారు. అలాగే, ఇండోనేషియాలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాలు గెలిచిన భారత క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో సభలో నాలుగో వరుసలో కూర్చున్న బీజేపీ ఎంపీ కే జే ఆల్ఫోన్స్ మైక్ నుంచి పొగలు వచ్చాయి. ఆయన వైర్లు పట్టుకుని సరిచేయబోయే ప్రయత్నం చేయగా కరెంట్ షాక్ తగిలింది. దీంతో ఆయన తన సీట్లోంచి వెళ్లి మరో సీట్లో కూర్చున్నారు. విషయాన్ని ఛైర్మన్ వెంకయ్యనాయుడుకు ఫిర్యాదు చేయగా, ఆయన సభను 15 నిమిషాలు వాయిదా వేశారు. వెంకయ్య ఆదేశం మేరకు రాజ్యసభ సిబ్బంది మరమ్మతులు చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్ల పొగలు వచ్చాయని తెలిపారు. మరో బీజేపీ ఎంపీ పురుషోత్తమ్ రూపాలా మైకు నుంచి కూడా పొగలు వచ్చాయి. దీంతో ఆయన వెళ్లి వేరే సీట్లో కూర్చున్నారు.

35ఏ రద్దుకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరు

- అఖిలపక్ష భేటీకి మెహబూబా ముఫ్తీ వినతి
- సానుకూలంగా స్పందించిన ఫరూఖ్ అబ్దుల్లా

న్యూఢిల్లీ: రాజ్యాంగంలో జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే 35ఏ అధికరణాన్ని రద్దు చేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వాన్ని ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు సాయపడాలని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధినేత ఫరూఖ్ అబ్దుల్లాను ఆయన ప్రత్యర్థి పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధినేత మెహబూబా ముఫ్తీ కోరారు. 'కేంద్ర ప్రభుత్వ ప్రణాళికలకు వ్యతిరేకంగా ఉమ్మడిగా ప్రతిస్పందించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అఖిలపక్ష పార్టీ సమావేశం ఏర్పాటు చేయాలని డాక్టర్ ఫరూఖ్ అబ్దుల్లాను కోరుతున్నాను' అని ట్వీట్ చేశారు. దీనిపై ప్రతిస్పందించిన ఫరూఖ్ అబ్దుల్లా మాట్లాడుతూ 'దీనిపై నేను సానుకూలంగా ఉన్నా. ఈ వారంలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తా' అని అన్నారు. '35ఏ' అధికరణాన్ని వచ్చేనెల 15న రద్దు చేయాలని, ఈ నేపథ్యంలోనే లక్ష మంది అదనపు బలగాలను మోదీ ప్రభుత్వం కశ్మీర్‌కు తరలించిందని వార్తలొచ్చాయి.

కడుపులోకి కలుషితాలు

- దేశంలో కలుషిత పదార్థాల కారణంగా విజృంభిస్తున్న రోగాలు
- వైద్యానికి 2016-17లో వ్యయం సుమారు రూ.33 వేల కోట్లు
- తక్షణం మేల్కొకుంటే 2022 నాటికి రూ.9.50 లక్షల కోట్ల భారం

లక్నో: మనం రోజూ తినే ఆహారం.. తాగే నీరు కలుషితాలతో నిండిపోయాయి. రోజూ మూడు పూటలా విషాన్ని కడుపులో వేసుకుంటున్నాం. ఫలితంగా విజృంభిస్తున్న వ్యాధుల చికిత్స కోసం రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. 'మిలీనియం సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్'(ఎస్డీజీస్) ఫౌండేషన్, థాట్ ఆర్బిటేజ్ అనే అధ్యయనసంస్థ సంయుక్తంగా నిర్వహించిన సర్వే తేల్చిన కఠిన వాస్తవాలివి. 'భారత్‌లో ఆహారం, నీటి కాలుష్యంతో పడే ఆర్థిక భారం' పేరుతో సోమవారం నివేదిక విడుదలచేసింది. దీని ప్రకారం కలుషిత ఆహారంతో వచ్చిన జబ్బులు నయం చేసుకోవడానికి 2016-17 లో దేశ ప్రజలు దాదాపు రూ.33 వేల కోట్లు ఖర్చుపెట్టారట. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో మూడేండ్లలో రూ.9.50 లక్షల కోట్లు దవాఖానలకే పెట్టాల్సి రావచ్చని హెచ్చరించింది.

ఎందుకిలా?

ఎస్డీజీస్ ఫౌండేషన్ చైర్మన్ డీఎస్ రావత్ తెలిపిన వివరాల ప్రకారం.. దేశంలో ఆహార నాణ్యతపై సరైన ప్రమాణాలు లేవు. దేశంలో ఉత్పత్తవుతున్న ఆహారపదార్థాల్లో 80% అనధికారిక సంస్థల నుంచే వస్తున్నాయి. దీంతో కలుషిత ఆహారం మార్కెట్‌లోకి వెళ్తున్నది. 2015-16 లెక్కల ప్రకారం దేశంలో గుర్తింపు పొందిన ఆహార ఉత్పత్తుల సంస్థలు 39,318 మాత్రమే. అనధికారికంగా మరో 23 లక్షలు నడుస్తున్నట్టు అంచనా.

తక్షణం మేల్కోవాల్సిందే

దేశంలో మిగతా అంశాలకన్నా కలుషిత ఆహారం, నీరు వల్ల కలిగే అంటువ్యాధులే ప్రమాదకారిగా మారాయి. కాబట్టి ప్రజలకు శుభ్రమైన ఆహారం అందించేలా అత్యవసర చర్యలు చేపట్టాలి. ఆహారం కలుషితం కాకుండా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు చిత్తశుద్ధితో కృషిచేయాలి. ఆహార రంగంపై కఠిన చట్టాలు తీసుకురావాలి.

నియంత్రణకు ఆరుసూత్రాలు

కలుషితాల నియంత్రణకు ఈ నివేదిక ఆరు అంశాలను సూచించింది. 1.ఆహార పదార్థాల్లో కలుషితాలపై శాస్త్రీయ అధ్యయనం. 2. వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం. 3. ఆహారోత్పత్తుల సంస్థలకు ప్రభుత్వం గుర్తింపు తప్పనిసరి. ఫుడ్ సేఫ్టీ విభాగానికి అనుసంధానం. 4.దేశీయంగా ఆహారోత్పత్తిలో ప్రమాణాలు పాటించేలా చర్యలు. 5. ఆహారం, నీటి కాలుష్యంతో వస్తున్న రోగాలపై డేటాబేస్ సిద్ధం చేయడం, 6. మౌలిక వసతుల కల్పన. దీంతో పాటు సురక్షిత వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ.. ల్యాబ్‌ల్లో ఉత్పత్తులను పరీక్షించడం, అనధికారిక కంపెనీల్లో పరిశుభ్రత పాటించడం, అధికారులు తరుచూ కంపెనీల్లో తనిఖీలు చేపట్టాలని సూచించింది.

పెరుగుతున్న రోగాలు.. చికిత్స వ్యయం

కలుషిత ఆహారం, నీరు వల్ల దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు వ్యాధు

బీజేపీ ఇంకా ఎందుకు తాత్సారం చేస్తున్నది? ఉన్నావ్ లైంగికదాడి కేసులో ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ కూడా దాఖలైంది. అయినా ఆయనను ఎందుకు పార్టీ నుంచి బహిష్కరించడం లేదు?

ప్రియాంకా గాంధీ వాద్రా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

నేను పదకొండేండ్లుగా ఆడుతున్నాను. రోహిత్ పదేండ్ల నుంచి ఆటలో ఉన్నారు. బయటివారు మా ఇద్దరి మధ్య విభేదాలు సృష్టించడం వింతగా ఉన్నది. జట్టులో మంచి వాతావరణం లేకపోతే ఇంతబాగా ఆడేవాళ్లం కాదు.

విరాట్ కోహ్లీ, భారత క్రికెట్ జట్టు కెప్టెన్

చరిత్రలో నేడు

1872

వైర్‌లెస్ టెలిగ్రఫీ విధానాన్ని కనుగొన్న మహెలాన్ లుమిస్.

1909

మిలిటరీ కోసం విమానాన్ని తయారుచేసి అందించిన రైట్ బ్రదర్స్.

1928

రంగుల చలన చిత్రాన్ని ఆవిష్కరించిన జార్జ్ ఈస్ట్‌మన్.

చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగికదాడుల విషయంలో మరింత సత్వర విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సూచించింది. లైంగికదాడుల విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయటంతోనే సరిపుచ్చకుండా, సత్వర విచారణతో దోషులకు శిక్షలు పడేట్లు చేయాలని రాష్ట్రాలను కోరింది. పోస్కో చట్టం కింద నమోదైన కేసులు ఇప్పటికే లక్షా యాభై వేల కేసులు 670 ప్రత్యేక కోర్టులలో పెండింగ్‌లో ఉన్నయని తెలిపింది. వంద కేసులు నమోదైన ప్రతిచోటా ప్రత్యేక కోర్టును ఏర్పాటుచేసి విచారణ చేపట్టాలని సుప్రీం సూచించటం ముదావహం.

బి టైమ్స్ ఆఫ్ ఇండియా

దేశ ప్రజాస్వామ్యంలో నెంబర్ గేమ్ నడుస్తున్నది. కర్ణాటకలో కొనసాగిన సంఖ్యా బల రాజకీయ పోరు మర్లిపోకముందే మరో రాష్ట్రంలో అదే పోరు తెరమీదికి వచ్చింది. మధ్యప్రదేశ్‌లో తనకు తిరుగులేని మెజారిటీ ఉన్నదని సీఎం కమల్‌నాథ్ బీజేపీ నేతలకు సవాల్ విసిరిన కొన్ని గంటలకే విభ్రాంతి కలిగించే పరిస్థితి ఏర్పడింది. వాస్తవ సంఖ్యా బలం కన్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్యప్రదేశ్‌లో అదనంగా రెండు ఓట్లు ఎక్కువగా వచ్చాయి. కాంగ్రెస్‌కు ఓటు వేసిన తమ సభ్యులను బహిష్కరిస్తే బీజేపీ బలం మరింత తగ్గుతుంది.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

ఇదేం పాలన?

ఉత్తరప్రదేశ్‌లో 'లైంగిక దాడి బాధితురాలి' కుటుంబాన్ని వెంటాడి వేధిస్తున్న తీరు దిగ్భ్రాంతికరంగా ఉన్నది. తమపై ఎమ్మెల్యే లైంగికదాడికి పాల్పడ్డాడని ఉన్నావ్‌కు చెందిన ఒక బాలిక ఆరోపించిన నాటినుంచి ఆమె కుటుంబంపై దాడులు సాగుతూనే ఉన్నాయి. ఆదివారం ఆమె ప్రయాణిస్తున్న వాహనాన్ని ఒక ట్రక్కు గుద్దుకోవడంతో ఆ బాలిక బంధువులు, ఈ కేసులో కీలక సాక్షులు అయినట్టి ఇరువురు మహిళలు మరణించారు. బాలిక, ఆమె న్యాయవాది తీవ్రంగా గాయపడ్డారు. ఆమె పక్కటెముకలు, కంటెబొక్క, కాలు, చేయి విరిగిపోవడంతో పాటు ఒళ్ళంతా తీవ్రగాయాలై వెంటిలేటర్‌పై విషమ పరిస్థితిలో ఉన్నది. నెంబర్ ప్లేట్‌పై నల్లరంగు పూసిన ట్రక్కు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడాన్ని బట్టి ఆ బాలికను, ఆమె కుటుంబాన్ని నిర్మూలించడానికి కుట్ర పన్నారని తెలిసిపోతూనే ఉన్నది. తమ కుటుంబాన్ని నిర్మూలిస్తామని నిందితుడి బంధువులు హెచ్చరించినట్టు బాలిక కుటుంబం ఆరోపించింది. అయినా పోలీసులు మొదట సాధారణ ప్రమాదం అన్నట్టుగానే మాట్లాడారు. కానీ ప్రజాభిప్రాయం వ్యతిరేకంగా ఉండటంతో సీబీఐ దర్యాప్తు చేస్తుందని అంటున్నారు. ట్రక్కు యజమాని రుణం చెల్లించలేకపోవడం వల్ల నెంబర్ ప్లేట్‌ను మలిపేసుకున్నాడని అప్పటికప్పుడు ఒక కథనాన్ని ప్రచారంలో పెట్టారు. ఈ లైంగికదాడి కేసు దేశవ్యాప్తంగా ప్రచారం పొందడంతో బాలిక కుటుంబానికి భద్రతను ఏర్పాటుచేశారు. కానీ ప్రమాదం జరిగినప్పుడు భద్రతా సిబ్బంది ఆమె వెంట లేకపోవడం ఆశ్చర్యకరం. ఉత్తరప్రదేశ్‌లో గూండాలను నిర్మూలిస్తున్నామని చెప్పుకుంటూ మూడు వేలకు పైగా ఎన్‌కౌంటర్లు జరిపించిన ఘనత ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌ది. మరి ఆయన పార్టీలోని ఎమ్మెల్యే జరిపిస్తున్న ఈ దాడుల సంగతేమిటి?

రాజకీయాలకు- నేరస్థులకు విడదీయరాని సంబంధం ఉన్న ఉత్తరప్రదేశ్‌లో అండర్ ట్రయల్స్‌ను పట్టుకొని హతమార్చడం వల్ల ఫలితం ఉంటుందా? ఈ నెల 15వ తేదీన ఒక విశ్వహిందు పరిషత్ నాయకుడిని గుర్తుతెలువని వ్యక్తులు కాల్చివేశారు. ఆ మరుసటి రోజే ఒక సమాజ్‌వాది పార్టీ నాయకుడిని ఇదే విధంగా హతమార్చారు. చట్టబద్ధ పాలన లోపిస్తే బలవంతుల రాజ్యం ఏర్పడి, బలహీనులకు భద్రత లోపిస్తుంది. మరి ఆదిత్యనాథ్ ప్రభుత్వం చట్టంతో నిమిత్తం లేనట్టు వ్యవహరించడం వల్ల సామాజిక అసమానతలు ఎక్కువగా ఉన్న యూపీలో సామాన్య ప్రజల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఉన్నావ్‌లోని లైంగికదాడికి గురైన బాలిక కుటుంబం ఎదుర్కొంటున్న దౌర్జన్యాలను గమనిస్తే, ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఉంటున్నామా అనే సందేహం కలుగుతుంది. గత ఏడాది– ఈ బాలికకు ఉద్యోగం ఇప్పిస్తామని బీజేపీకి చెందిన ఎమ్మెల్యే కుల్‌దీప్‌సింగ్ సెంగర్ నివాసానికి తీసుకుపోయారని, అక్కడ ఆమెపై లైంగిక దాడి జరిగిందనేది ఆరోపణ. ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్‌పైనే లైంగికదాడి జరిపిన ఆరోపణ ఉన్నది. యూపీలో చట్టబద్ధ పాలన ఉంటే, ఆమె ఆరోపణలపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగాలె. కానీ మొదట పోలీసులు ఆమె ఫిర్యాదును స్వీకరించడానికే నిరాకరించారు. ఆ తర్వాత దర్యాప్తు సరిగ్గా జరుగకపోగా, బాధితులపైనే దాడులు మొదలయ్యాయి. ఒక దశలో బాధితురాలైన బాలిక, ఆమె తల్లి ముఖ్యమంత్రి నివాసం ముందు ఆత్మాహుతి యత్నం చేశారు. బాలిక తండ్రిని తప్పుడు కేసులో ఇరికించి పోలీసుస్టేషన్‌లోనే ఎమ్మెల్యే బంధువులు తీవ్రంగా కొట్టారు. దీంతో ఆ బాలిక తండ్రి పోలీసుల అదుపులో ఉండగానే ప్రాణాలు కోల్పోయాడు. యూపీలోని బీజేపీ ప్రభుత్వం తమ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకపోవడాన్ని అలహాబాద్ హైకోర్టు తప్పుపట్టింది. దేశవ్యాప్తంగా విమర్శలు రావడంతో ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. ఎమ్మెల్యేను అరెస్టు చేసి చేశారు. అయితే ఎమ్మెల్యే జైలులో ఉంటూనే, బయట ఆ బాధితురాలిపైన, ఆమె కుటుంబంపైనా దాడులు చేయిస్తున్నాడు. దీనిని బట్టి రాష్ట్రం లో గూండాలను అంతమొందిస్తామంటున్న ఆదిత్యనాథ్ ప్రభుత్వ నిజాయితీ ఏపాటిదో తెలుస్తున్నది. దేశమంతా గమనిస్తుండగానే నిందితులు ఇష్టారాజ్యంగా సాక్షులను హతమార్చడాన్ని బట్టి యూపీలో బీజేపీ పాలన ఎంత గొప్పగా ఉన్నదో తెలుస్తున్నది.

ఎక్కడైనా సామాజిక ఆర్థిక పరిస్థితిని బట్టి నేరాల సంఖ్య, స్వభావం ఉంటాయి. ఉత్తరప్రదేశ్‌లో దౌర్జన్యాలను అరికట్టాలంటే, ప్రజాస్వామిక పాలన ద్వారానే సాధించాలె. సమర్థవంతమైన, నిష్పాక్షికమైన పాలన అందించడంతో పాటు దీర్ఘకాలికంగా అక్కడి సామాజిక– ఆర్థిక పరిస్థితులలో మార్పులు తీసుకురావాలె. కానీ చట్టంతో సంబంధం లేకుండా ప్రభుత్వం కూడా దాడులకు పాల్పడటం సమర్థనీయం కాదు. తాము మూడు వేల ఘటనల్లో కాల్పులు జరిపామని, అందులో 69 మంది నేరస్థులు మరణించారని, 838 మంది గాయపడ్డారని ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ స్వయంగా ఈ ఏడాది జనవరిలో గొప్పగా చెప్పుకున్నారు. రాజకీయాలకు– నేరస్థులకు విడదీయరాని సంబంధం ఉన్న ఉత్తరప్రదేశ్‌లో అండర్ ట్రయల్స్‌ను పట్టుకొని హతమార్చడం వల్ల ఫలితం ఉంటుందా? ఈ నెల 15వ తేదీన ఒక విశ్వహిందు పరిషత్ నాయకుడిని గుర్తుతెలువని వ్యక్తులు కాల్చివేశారు. ఆ మరుసటి రోజే ఒక సమాజ్‌వాది పార్టీ నాయకుడిని ఇదే విధంగా హతమార్చారు. చట్టబద్ధ పాలన లోపిస్తే బలవంతుల రాజ్యం ఏర్పడి, బలహీనులకు భద్రత లోపిస్తుంది. మరి ఆదిత్యనాథ్ ప్రభుత్వం చట్టంతో నిమిత్తం లేనట్టు వ్యవహరించడం వల్ల సామాజిక అసమానతలు ఎక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో సామాన్య ప్రజల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఉన్నావ్ బాధితురాలి కుటుంబంపై సాగుతున్న దాడులు బీజేపీ పాలనా స్వభావానికి అద్దం పడుతున్నయి.

జనగళం

ప్రజారోగ్యాన్ని కాపాడాలె

దేశంలో అత్యధిక శాతం మంది ప్రజలు తమ ఆదాయంలో ఎక్కువ శాతం ఔషధాల కొనుగోలుకు, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ఖర్చులకే వినియోగిస్తున్నారు. తక్కువ ఆదాయమార్గాలు గల మధ్యతరగతికి చెందిన 40 శాతానికి పైగా కుటుంబాలు కేవలం ఆరోగ్య అవసరాలకు బయటినుంచి అప్పులు తెస్తున్నారని 'ది ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పాపులేషన్' సర్వే వెల్లడించింది. ఇది చాలా విచారించదగిన విషయం. ఇదిలా ఉంటే ఔషధ కంపెనీలు తాము ఆడిందే ఆట, పాడిందే పాట అన్న రీతిలో వ్యవహరిస్తున్నాయి. వినియోగదారుల నుంచి ఎక్కువ వసూలు చేస్తున్నాయి. కాబట్టి ప్రభుత్వాలు తక్కువ ధరకే ఔషధాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలి. ఈ దుస్థితికి ప్రధాన కారణం వ్యవస్థలోని లోపాలే కారణం. ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కు. ప్రజారోగ్యాన్ని కాపాడాలె.

- సయ్యద్ షఫీ, హనుమకొండ

రాజకీయ జోక్యం ఉండరాదు

చిన్నారులపై లైంగికదాడుల ఘటనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. ఈ ఘటనలపై దేశం యావత్తు మండిపడుతున్నది. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్రమంత్రి వర్గం కీలక నిర్ణయాలు తీసుకున్నది. చిన్నారులపై లైంగికదాడులకు పాల్పడే వారిపై మరింత కఠిన శిక్షలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నది. చిన్నారులకు మరింత భద్రత, రక్షణ కల్పించే చర్యల్లో భాగంగా ఈ చట్ట సవరణలకు మంత్రివర్గం ఆమోదించడమే కాకుండా ఉభయసభల్లోనూ ఆమోదముద్ర వేసింది. ఈ లైంగికదాడులకు అడ్డుకట్ట వేయాలి. అంతేకాదు చిన్నారుల కు సంబంధించి కేసుల్లో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా నిరోధించి స్వతంత్రంగా దర్యాప్తు చేపట్టే సంస్థల్ని ఏర్పాటుచేయాలి. ఎందుకంటే వ్యవస్థలోని లోపాల ఆధారంగా నిందితులు తమ పలుకుబడితో తప్పించుకుంటారు. కాబట్టి లైంగికదాడుల కేసుల్లో దర్యాప్తు పారదర్శకంగా జరిగేలా చూడాలి. ఈ సమయంలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి. అప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి.

- కాళంరాజు వేణుగోపాల్, మార్కాపురం

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

అంతర్జాతీయం

డాక్టర్ చెన్నమనేని రమేశ్

ముంచుకొస్తున్న ఫాసిజం

అమెరికా, రష్యాల మధ్య నెలకొన్న వ్యాపారయుద్ధం యూరప్ దేశాల్లో జాతీయవాదాన్ని ఎగదోసే దిశగా పరిస్థితులను ఏర్పర్చాయి. యూరప్‌లో ప్రభుత్వాల పట్ల ఏర్పడిన వ్యతిరేకత తిరోగమన వాద జాతీయవాదాలకు ఆయువుపట్టుగా అవుతున్నది. మొత్తంగా చూస్తే.. యూరప్ అంతటా ఆధిపత్య ధనవంతులకు-ప్రజలకు మధ్య, అలాగే తీవ్ర జాతీయవాదులు-ఉదారవాదుల మధ్య ఆధిపత్య పోరుగా మారిపోయింది. యూరప్ అంతటా వలసలకు వ్యతిరేకంగా ముందుకువచ్చిన జాతీయవాదం అంతిమంగా తిరోగమన వాద తీవ్ర జాత్యహంకారంగా రూపుకడుతున్నది.

అంతులేని దిగులుతో గడ్డకట్టే చలిరోజుల్లో 1938 డిసెంబర్‌లో ఎనిమిదేండ్ల రాల్ఫ్, పదిహేడేండ్ల అతని అక్కతో కలిసి జర్మనీలోని హంబర్గ్ నుంచి ఇంగ్లండ్‌కు రైలులో ప్రయాణమయ్యారు. తమ ఇంటిలో మిగిలిపోయిన చిన్నపాటి అత్యవసరమైన సామానుతో వారు తమ కుటుంబసభ్యులను కలుస్తామన్న ఆశతో ప్రయాణమయ్యారు. మనకు అక్కడ మన తల్లిదండ్రులు కలుస్తారా అన్న రాల్ఫ్ ప్రశ్నకు మూడునెలల్లో కలుస్తారని అతని అక్క ఆశాభావంతో చెప్పింది. కానీ వారి తల్లిదండ్రులు కలువలేదు. కానీ.. 1942లో అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంస్థ ఒకరోజు మీ తల్లిదండ్రులు ఆ 'మారణకాండ'లో హతులయ్యారని తెలిపింది. 1938–39 మధ్యకాలంలో జర్మనీ నుంచి ఇంగ్లండ్‌కు చేరుకున్న పదివేల మంది బాలబాలికల్లో వీరు కూడా ఒకరు. ఇది నాడు జరిగిన ఘటనల్లో ఒకటి కాదు. మానవజాతి చరిత్రలో అతి విషాదకరమైన మానవ వలసగా జరిగిన పెద్ద విషాదం. ఇది ఒకరి తప్పువల్ల జరిగిన విషాద ఘటన అంతకన్నా కాదు. నాడు నాజీలు అనుసరించిన మితిమీరిన జాత్యహంకార విధానాలు, జాతి వివక్ష కారణంగా నెలకొన్న దుస్థితి. నాజీలు అనుసరించిన విధానాల కారణంగా మానవ సమూహాలనే నిర్మూలించేందుకు జరిగిన ఓ విషాద ఘట్టం.

1939 సెప్టెంబర్‌లో ప్రారంభమైన రెండో ప్రపంచయుద్ధం జరిగి ఎనిమిది దశాబ్దాలు గడిచిపోయాయి. నాజీజం కారణంగా నాజీ జర్మనీ అనుసరించిన విధానాలతో ప్రజలు, మానవ సమూహాలతో పాటు అనేక దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. తమ సిద్ధాంతాలను, విధానాలను అనుసరించని, వ్యతిరేకించిన ప్రజలను, దేశాలను తుదముట్టించటం కోసం నాజీలు చేసిన దురాగతాలకు అంతులేదు. మానవ హననాన్ని నిలువరించేందుకు బ్రిటన్, సోవియెట్ రష్యా, అమెరికా కలిసి నడిచాయి. ఆ క్రమంలో రెండో ప్రపంచయుద్ధంలో 5 కోట్ల మంది ప్రాణాలు విడువాల్సి వచ్చింది. అందులో కోటి యాభై లక్షల మంది యూదు జాతి ప్రజలే. ఒక్క పోలండ్‌లోనే ముప్పై లక్షల మంది చనిపోయారు. నాజీలను ఎదిరించే క్రమంలో ఒక రష్యాలోనే రెండు కోట్ల 60 లక్షల మంది ప్రాణాలను ధారపోయాల్సి వచ్చింది. సోవియట్ రష్యాను నాశనం చేయటం కోసం వస్తున్న హిట్లర్ దురాక్రమణ సైన్యాలను నిలువరించటం కోసం కోటిమంది సోవియెట్ రెడ్ ఆర్మీ సైనికులు ప్రాణాలు విడిచారు. హిట్లర్ ఆరంభించిన దురహంకార, దురాక్రమణ పూరిత రెండో ప్రపంచ యుద్ధంలో మిత్రరాజ్యాలైన ఇంగ్లండ్, రష్యా, అమెరికాలకు తమ అనన్య త్యాగాలతో సోవియెట్ సేనలు విజయాన్నందించాయి. నాజీలు నిర్వహిస్తున్న కాన్సంట్రేషన్ క్యాంపులు, జైళ్లు నేలకూలాయి. అంతులేని ప్రాణ నష్టంతో అయినా చివరికి 1945 మే 8న హిట్లర్ మట్టికరిచాడు. జర్మనీ ఓటమి పాలై రెండో ప్రపంచయుద్ధం ముగిసింది. మొత్తంగా చూస్తే మానవ జాతి చరిత్రలో అతి విషాదాంతమైన కాలంగా రెండో ప్రపంచ యుద్ధ సమయాన్ని చెప్పుకోవచ్చు. 8 దశాబ్దాలు గడిచినా ఇంకా ఆ భయానక పరిస్థితులను తలుచుకొని వణికిపోయే పరిస్థితి నేటికీ ఉన్నదంటే నాటి భయానక పరిస్థితులను ఊహించుకోవాల్సిందే.

రెండో ప్రపంచయుద్ధం తర్వాత కొత్త శకానికి నాంది పడింది. యూరప్ వలస రాజ్యాలు అంతమై ప్రపంచ పటం మీదికి రెండు అగ్రరాజ్యాలు తెరమీదికి వచ్చాయి. అవి సోవియెట్ యూనియన్ (యూఎస్ఎస్ఆర్), అమెరికా. నాజీల అంతం తర్వాత.. యూరప్ అంతటా తీవ్ర జాతీయవాదాలు, వర్ణ, జాతి ఆధిపత్యం, అహంకారాల పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అంతటా జాత్యహంకార వ్యతిరేక ఉదారవాద ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. జాత్యహంకార సాహిత్యాన్ని, భావనలను కట్టడి చేశాయి. ఈ విధానాల ఫలితంగా వివిధ జాతి సమూహాల మధ్య సౌహార్దత సహజీవనాలకు పునాదులు ఏర్పడ్డాయి. జర్మనీతో పాటు యూరప్ అంతటా నాజీ భావజాలం పట్ల నిరసన వ్యతిరేకతలు పాదుకొల్పబడ్డాయి. మరోవైపు అన్ని దేశాల్లో బహుళ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాల ప్రజా సమూహాల మధ్య సహజీవనం నెలకొన్నది. మరోవైపు మిత్ర రాజ్యాలుగా నాజీ జర్మనీని మట్టికరిపించిన దేశాల మధ్య సఖ్యత స్థానంలో పోటీ ఏర్పడింది. ముఖ్యంగా అమెరికా, రష్యాల మధ్య ఆధిపత్యపోరు మొదలై ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీసింది. ఈ నేపథ్యంలోంచే ఐక్య రాజ్య సమితి ఏర్పాటైంది. ప్రస్తుతం 27 దేశాలు యురోపియన్ ఎకనామిక్ కమ్యూనిటీ పేరుతో కూటమిగా ఏర్పడ్డాయి.

స్వేచ్ఛామార్కెట్ విధానాల ఆలంబనగా కొత్తగా దూసుకొచ్చిన తీవ్ర జాతీయవాదం ఉదారవాద విధానాలను ధ్వంసం చేసే ఆధిపత్య విధానాలకు పునాదులు వేస్తున్నది. ఉదారవాద ప్రజాస్వామ్య దేశాలైన హంగరీ, పోలాండ్ లాంటి దేశాల్లో వలస వ్యతిరేక విధానాల పేరిట జాత్యహంకార విధానాలను ఆధిపత్యంలోకి తెచ్చే ప్రక్రియ నడుస్తున్నది. అదే విధంగా ఈయూ నుంచి వైదొలిగే పేర బ్రిటన్‌లో రైట్‌వింగ్ అతివాదులు ఆధిపత్యంలోకి వచ్చారు. ఈ క్రమంలోంచి మధ్యేవాద పార్టీలు, ఉదారవాద ప్రజాస్వామ్య పార్టీలు ప్రజల్లో వేగంగా ప్రాబల్యాన్ని కోల్పోతున్నాయి. అమెరికా, రష్యాల మధ్య నెలకొన్న వ్యాపారయుద్ధం యూరప్ దేశాల్లో జాతీయవాదాన్ని ఎగదోసే దిశగా పరిస్థితులను ఏర్పర్చాయి. యూరప్‌లో ప్రభుత్వాల పట్ల ఏర్పడిన వ్యతిరేకత తిరోగమన వాద జాతీయవాదాలకు ఆయువుపట్టుగా అవుతున్నది. మొత్తంగా చూస్తే.. యూరప్ అంతటా ఆధిపత్య ధనవంతులకు–ప్రజలకు మధ్య, అలాగే తీవ్ర జాతీయవాదులు–ఉదారవాదుల మధ్య ఆధిపత్య పోరుగా మారిపోయింది. యూరప్ అంతటా వలసలకు వ్యతిరేకంగా ముందుకు వచ్చిన జాతీయవాదం అంతిమంగా తిరోగమన వాద తీవ్ర జాత్యహంకారంగా రూపుకడుతున్నది.

ఫలితంగా యూరప్ దేశాలన్నింటా దశాబ్దాలుగా కొనసాగుతున్న వామపక్షవాదుల ప్రాబల్యం పూర్తిగా సన్నగిల్లి అదే స్థానంలో తీవ్ర జాతీయవాదం వేళ్లూనుకుంటున్నది. ఈ క్రమంలో యూరప్ మరింతగా విభజనకు గురవుతున్నది. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా యూరోపీకరణ జరుగుతున్నది. మొత్తంగా సామాజిక,రాజకీయ స్థితిని తిరోగమన జాతీయవాదం వైపు నడిపిస్తున్నది. యూరప్ అంతటా సామాజికంగా పాదుకొని ఉన్న ఫాసిస్టు వ్యతిరేకత స్థానంలో తిరోగమన జాతీయవాదం బలం పుంజుకుంటున్నది. మొత్తంగా చూస్తే ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య ప్రభుత్వాల స్థానంలో నియంతృత్వ జాతీయవాదం పునరుజ్జీవనం పొందుతున్నది. ఇదే ఇవ్వాళ్టి ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రమాదం.

ఈ క్రమంలో దేశాలన్నింటా ప్రజాస్వామ్య మౌలిక విలువలపై పెద్ద ఎత్తున దాడి జరుగుతున్నది. ఈ మధ్యనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన మహిళా అభ్యర్థులను వర్ణంపేర దూషిస్తూ.., వారిని దేశం విడిచి సొంత దేశాలకు వెళ్లిపోవాలని అన్నారు. ట్రంప్ మాటలు అమెరికా అంతటా తీవ్ర దుమారాన్ని రేపాయి. తీవ్ర వ్యతిరేకతకు, నిరసనలకు గురయ్యాయి. డెమొక్రటిక్ పార్టీ అయితే ట్రంప్ విచ్ఛిన్నకర, వినాశకర, జాతి వివక్ష విధానాలు అనుసరిస్తున్నారని విరుచుకుపడింది.

ఈ మధ్య జర్మనీలో కస్సెల్ ప్రాంతానికి చెందిన వాల్టర్ లుబ్కేను తన ఇంట్లో ఉండగానే కొందరు అతి సమీపం నుంచి కాల్చిచంపారు. ఆమె జర్మనీ ఛాన్సలర్ ఎంజేలా మెర్కెల్ అధికార పార్టీకి చెందిన అధికార ప్రతినిధి. వలసవాదులకు సానుకూల విధానాలను అనుసరిస్తున్న కారణంగా లుబ్కేపై ఈ దాడి జరిగిందన్న ఆరోపణలున్నాయి.

> దశాబ్దాలు గడిచాయి. నాజీజం, ఫాసిజం మట్టికరిచాయి. కానీ మళ్లీ ఇప్పుడు జాతీయవాదం పేరుతో మెజారిటీవాదం ఫాసిజంగా ప్రాణం పోసుకుని వస్తున్నది. ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువలను గౌరవించే, ప్రేమించే ప్రతి ఒక్కరూ మెజారిటీవాద నియంతృత్వాన్ని, ఫాసిజాన్ని ఎదిరించాల్సిన అవసరం ఉన్నది

యూరప్‌లో, భారత్‌లో ఇటీవలే జరిగిన ఎన్నికలోల తీవ్ర జాతీయవాద నాయకులు అధికారంలోకి వచ్చారు. మోదీ కూడా ఈ నేపథ్యం లోంచి వచ్చిన వారిగానే చెప్పుకోవచ్చు. లౌకికత్వం, భిన్నత్వంలో ఏకత్వమనే భావనల స్థానంలో హింసాత్మక హిందూ జాతీయవాదాన్ని అధికారంలోకి తెచ్చారు. ముస్లిం వ్యతిరేకత, హిందూ జాతీయత అనేవి సామాజికంగా ఎక్కువ ఆమోదనీయం అవుతున్నాయి. తృణముల్ కాంగ్రెస్ నేత మహువా మోయిత్రా అయితే బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. విభిన్న జాతులు, సంస్కృతులతో సఖ్యంగా ఉన్న దేశంలో బీజేపీ విషబీజాలు నాటుతున్నదని, విద్వేషాలను, వివక్షలను పెంచి పోషిస్తున్నదని ఆరోపిస్తున్నారు. అసమ్మతిని అణిచివేసి, మీడియాను చేతిలో పెటుకొని దేశ భద్రత ముసుగులో ప్రభుత్వాన్ని మత మయం చేస్తున్నారని తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ మధ్యనే ప్రముఖ రచయితలు, మేధావులు, నటులు అపర్ణసేన్ మొదలు మరో 48 మంది ప్రముఖులు మోదీ ప్రభుత్వ చర్యలను తీవ్రంగా నిరసిస్తూ బహిరంగ లేఖ రాశారు. ప్రజాస్వామ్యాన్ని మెజారిటీ మతవాదంతో అణిచివేస్తున్నారని జాతివ్యతిరేకులని ముద్రవేస్తున్నారని విమర్శించారు. దశాబ్దాలు గడిచాయి. నాజీజం, ఫాసిజం మట్టికరిచాయి. కానీ మళ్లీ ఇప్పుడు జాతీయవాదం పేరుతో మెజారిటీవాదం ఫాసిజంగా ప్రాణం పోసుకుని వస్తున్నది. ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువలను గౌరవించే, ప్రేమించే ప్రతి ఒక్కరూ మెజారిటీవాద నియంతృత్వాన్ని, ఫాసిజాన్ని ఎదిరించాల్సిన అవసరం ఉన్నది.

(వ్యాసకర్త: వేములవాడ శాసన సభ్యులు)

ప్రపంచంలోనే సర్వశ్రేష్ఠం

జాతీయం

ముక్తార్ అబ్బాస్ నఖ్వీ

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వాన కేంద్రంలో రెండోసారి ఏర్పడిన ప్రభుత్వం తొలి 50 రోజుల పాలనను 'నిర్ణయాత్మకం–నిర్దేశాత్మకం'గా అభివర్ణించవచ్చు. ఆ మేరకు భారతదేశాన్ని 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందించేందుకు పునాది వేయడంపై ఈ 50 రోజుల్లో ప్రభుత్వం దృష్టిసారించింది. తదనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన, వ్యాపారం, అందరికీ సాధికారత, రైతుల ఆదాయం రెట్టింపు చేయడం తదితర లక్ష్యాలకు ఉత్తేజం ఇచ్చింది. 'అందరి తోడ్పాటుతో అందరి ప్రగతి'లో భాగంగా 'అందరికీ సాధికారత'కు కట్టుబడుతూ 2019–20 నుంచి 2021–22 కాలంలో ప్రధానమంత్రి (గ్రామీణ) 'ఆవాస్ యోజన' కింద పేదల కోసం దేశవ్యాప్తంగా 1.95 కోట్ల ఇండ్ల నిర్మాణాన్ని ప్రతిపాదించింది. భారత్ 75వ స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించుకోనున్న 2022 నాటికి దేశంలోని ప్రతి గ్రామీణ కుటుంబానికీ విద్యుత్ సదుపాయం, పరిశుభ్ర వంటగ్యాస్ కనెక్షన్ల లభ్యతను సాకారం చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. అలాగే 'జలజీవన కార్యక్రమం' ద్వారా 2024 నాటికి ప్రతి గ్రామీణ కుటుంబానికీ రక్షిత మంచినీరు సరఫరాను లక్ష్యంగా పెట్టుకున్నది. 'ప్రధానమంత్రి కర్మయోగి మంథన్ యోజన' కింద రూ.1.5 కోట్ల లోపు వార్షిక వ్యాపార పరిమాణం గల 3 కోట్ల మంది చిల్లర వ్యాపారులకు పింఛన్ ప్రయోజనం కల్పించాలని నిర్దేశించుకున్నది. ప్రతి స్వయం సహాయ బృందంలో ఒక మహిళకు ముద్ర రుణ పథకం కింద రూ.లక్షదాకా పొందడానికి అనుమతించింది. రాయితీయేతర వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.100కు మించి తగ్గించింది.

దేశంలో వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు రూ.400 కోట్ల దాకా వార్షిక వ్యాపార పరిమాణం గల కంపెనీలపై కార్పొరేట్ పన్నును 25 శాతంగా ఉంచుతూ 2019 బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇంతకు ముందు ఈ పరిమితి రూ.250 కోట్లుగా ఉండేది. కాగా, ప్రస్తుత పెంపువల్ల దాదాపు 99.3 శాతం కంపెనీలు 25 శాతం పన్ను పరిధిలోకి వస్తాయి. షెడ్యూల్డ్ కులాలు/తెగలవారిలో వ్యవస్థాపనను ప్రోత్సహించడం కోసం 'స్టాండప్ ఇండియా' పథకం అమలును 2025 దాకా కొనసాగించనున్నది. ఇక నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వ ప్రాథమ్యాలలో 'రైతు సంక్షేమం' ముఖ్యమైనది. దీనికి అనుగుణంగా 'సున్నా బడ్జెట్ వ్యవసాయం', సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల పునరానుసరణ సహా అన్నదాత ఆదాయం రెట్టింపు చేయడంపై దృష్టిసారించి

వరద నీటిని ఒడిసిపట్టి..

వృథా నీటిని బావిలోకి మళ్లించిన రైతు.. ఆదర్శంగా నిలుస్తున్న జనగామ వాసి

జనగామ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వృథాగా పోతున్న వాన నీటిని బావిలోకి మళ్లించి కరువును జయించాడు జనగామ జిల్లా పెద్దపహాడ్‌కు చెందిన రైతు కాల్వ నర్సయ్య. తనకున్న మూడెకరాల్లో ఒక ఎకరం గడ్డ మీదుండగా, మిగిలిన రెండెకరాల్లో సాగు కోసం 5 బోర్లు వేయించాడు. ఇందులో ఒక్కటి మాత్రమే విజయవంతంకాగా, గతేడాది వర్షాలు లేక అదీ వట్టిపోయింది. పడిన కొద్దిపాటి వర్షం నీటిని ఒడిసిపట్టాలని నిర్ణయించుకున్న నర్సయ్య పొలంలో చిన్నకాల్వలను తవ్వి నీటిని బావిలోకి వెళ్లేలా సిమెంట్ పైపును అమర్చాడు. వర్షం కురిసినప్పుడు నీరంతా కాల్వల ద్వారా బావిలోకి చేరుతుంది. ఈ విధానం ద్వారా గతేడాది నర్సయ్య రెండెకరాల్లో నీటికి ఇబ్బంది లేకుండా వరి సాగు చేశాడు. నర్సయ్య విజయాన్ని గమనించిన మరో ఇద్దరు ఇదే తరహాలో నీటిని కాపాడుకొని ముందుకు'సాగు'తున్నారు.

బావిలోకి మలుపుతున్న..

పోయినేడు ఐదు బోర్లు వేసినా. ఒక్కబోరులోనే నీళ్లు వచ్చినయ్. వర్షాకాలంలోనూ ఈ బోరులో నీళ్లు అంతంతే ఉండేది. రెండెకరాలు పండించడం కష్టమయ్యేది. వర్షాలు పడితే నీళ్లు ఊరి వైపుపోయేవి. వాటిని బావిలోకి మళ్లించాలనుకున్న. కాల్వలు, సిమెంట్ పైపుతో బావిలోకి మలుపుకొన్న. దీంతో ఇప్పుడు నా పొలానికి సరిపడేలా నీళ్లు వస్తున్నయ్.

- కాల్వ నర్సయ్య, రైతు, పెద్దపహాడ్

గోదావరికి పునర్జీవం

'గంగమ్మ హారతి'లో ఎమ్మెల్యే దివాకర్‌రావు

సీసీసీ నస్పూర్: కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరికి పునర్జీవం వచ్చిందని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. గోదావరి జలాలు మంచిర్యాల జిల్లా నస్పూర్ పరిధిలోని సీతారాంపల్లి ఇంటేక్ వెల్‌కు చేరుకున్న సందర్భంగా సోమవారం 'గంగమ్మ హారతి' కార్యక్రమాన్ని నిర్వహించి జలాలకు పూజలు చేశారు. మంగళవారం మంచిర్యాలలో గంగమ్మ హారతి నిర్వహిస్తున్నామనీ, కార్యక్రమానికి త్రిదండి చినజీయరు స్వామి హాజరవుతారని ఎమ్మెల్యే తెలిపారు.

గోదావరి నదిలో పూజలు చేస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీఆర్ఎస్ నాయకులు

చెక్‌పవర్‌పై రాద్ధాంతం తగదు

- పంచాయతీరాజ్ చట్టంలో మార్పులేదు
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్: సర్పంచ్, ఉపసర్పంచులకు చెక్‌పవర్ విషయమై పంచాయతీరాజ్ చట్టంలో ఎలాంటి మార్పులు ఉండబోవని ఆ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టంచేశారు. ఉపసర్పంచులకు చెక్ పవర్ విషయంలో సర్పంచులు రాద్ధాంతం చేయడం తగదన్నారు. సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి క్యాంప్ ఆఫీస్‌లో మంత్రి మీడియాతో మాట్లాడారు. నూతన పంచాయతీరాజ్ చట్టం బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతిచ్చాయన్నారు. పంచాయతీ ఎన్నికల కంటే ముందే చట్ట సవరణ చేశామన్నారు. ఉప సర్పంచులకు చెక్ పవర్ కల్పిస్తూ చట్టం చేశామనీ, ఇప్పుడు సర్పంచులు ధర్నాలు, నిరసనలు చేయడం తగదన్నారు. అధికారుల కంటే ప్రజాప్రతినిధులకే ఎక్కువ బాధ్యత ఉంటుందనే సర్పంచు, ఉపసర్పంచుకు జాయింట్ చెక్ పవర్‌ను ప్రభుత్వం కల్పించిందన్నారు. సీఎం కేసీఆర్ రెండోసారి బాధ్యతలు చేపట్టాక గత ప్రభుత్వాల కంటే సర్పంచులకు ఎక్కువ నిధులు, అధికారాలు కల్పించారన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్, ఉప సర్పంచ్ బాటలు వేయాలని ఆకాంక్షించారు.

వైద్య సేవల్లో తెలంగాణ ఆదర్శం

వైద్యఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్ రాంనగర్‌లో ఆయుష్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఈటల, ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్ హెల్త్: పేదలకు ఉచిత వైద్య సేవలందించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి, రెండో స్థానాల్లో ఉన్న కేరళ, తమిళనాడు సరసన చేరిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో రూ. 60 లక్షలతో నిర్మించిన ఆయుష్ వింగ్ దవాఖాన నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. గతంలో ప్రభుత్వ వైద్యం మీద నమ్మకం లేక దవాఖానాలు వెలవెలపోయాయనీ, ఐదేండ్లలో ఆ పరిస్థితిని మార్చామన్నారు. ఆరోగ్య సూచిలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. అల్లోపతి వైద్యం కన్నా ఆయుర్వేదం, హోమియోపతి, యునానీ, ప్రకృతి వైద్యం పేదలకు అందుబాటులో ఉంటుందన్నారు. అనంతరం దవాఖానా ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ నగరాలుగా వరంగల్, సిద్దిపేట

కేంద్ర సంయుక్త కార్యదర్శి సంజయ్‌కుమార్

వరంగల్‌లో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వీధి వ్యాపారుల హక్కులను గుర్తించి, వారి జీవనోపాధి మెరుగుదలకు 2014లో రూపొందించిన వీధి వ్యాపారుల చట్టాన్ని అమలు చేసేందుకు తెలంగాణలో వరంగల్ తోపాటు సిద్దిపేటను ఎంపిక చేసినట్టు కేంద్ర గృహ నిర్మాణ శాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్‌కుమార్ తెలిపారు. ఈ చట్టం అమలు గురించి తెలుసుకునేందుకు సోమవారం వరంగల్‌కు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, మేయర్ గుండా ప్రకాశ్‌రావు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్‌తో చర్చించారు. వీధి వ్యాపారుల భద్రత, సంరక్షణకు వరంగల్ నగరంలో తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వీధివ్యాపారుల నగర కమిటీ ద్వారా వీధి వ్యాపారులందరినీ గుర్తించి సర్టిఫికెట్లు, లైసెన్సులు జారీ చేయాలని సూచించారు. వీరికోసం అనువైన స్థలాలను ఎంపిక చేసేందుకు నిపుణుల ఏజెన్సీని నియమించాలని తెలిపారు. వీధి వ్యాపారులు బ్యాంకుల నుంచి పొందిన రుణాలకు కేంద్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తుందన్నారు. వీధి వ్యాపారుల వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నగరంలో 3451 మంది వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డు లిచ్చామనీ, రూ.1.18 కోట్లతో ఆరు మార్కెట్లను నెలకొల్పినట్లు కలెక్టర్ తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండల పరిధిలోని మల్లన్నవాగును ప్రమాదకర పరిస్థితిలో దాటుతున్న గిరిజనులు

ఉప్పొంగిన వాగులు

- పలు ప్రాంతాలకు రాకపోకలు బంద్
- అక్కడక్కడ కూలిన ఇండ్లు, నీట మునిగిన పంటలు
- సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- అత్యధికంగా ఇచ్చోడలో 89.4 మి.మీ. వర్షపాతం నమోదు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోమవారం భారీ వర్షాలు కురిశాయి. ఆయా జిల్లాల్లోని వాగులు పొంగిపొర్లడంతో సమీప గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అక్కడక్కడ పంట పొలాలు నీటమునిగాయి. పలుచోట్ల పాత ఇండ్లు కూలిపోగా, మరికొన్నిచోట్ల పాక్షికంగా దెబ్బతిన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్ణశాలలోగల నారచీరెల ప్రాంతంలోని సీతమ్మవాగుపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి నీట మునిగింది. మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలోని సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో 89.4 మి.మీ., ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో 85.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రెండ్రోజులుగా భారీ వర్షం పడుతుంది. సోమవారం కురిసిన భారీ వర్షానికి చెరువులు, వాగులు పొంగిపొర్లుతుండగా కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్టులోకి 299.90 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా, తాంసి మండలం మత్తడి ప్రాజెక్టులో 68 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. కుంటాల, పొచ్చర, కనకాయి జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న పెన్‌గంగా నది ప్రవాహం పెరిగింది. నార్నూర్ మండలం మల్లంగి పంచాయతీ పరిధిలోని బారిక్‌రావు గూడ వద్ద రోడ్డుపై నుంచి వాగు ప్రవహిస్తుండటంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఇంద్రవెల్లి మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండగా చిక్‌మాన్ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఆదిలాబాద్, గుడిహత్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో పంట పొలాల్లోకి వర్షం నీరు నిలిచింది. సిరికొండ మండలంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. అత్యధికంగా ఇచ్చోడ మండలంలో 89.4 మి.మీ. వర్షం కురిసింది.

రాకపోకలకు అంతరాయం

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దహెగాం మండలంలోని ఎర్రవాగు పొంగడంతో పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చింతల మానెపల్లిలో రెండు వాగులు పొంగడంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కౌటాల మండలం ముత్యంపేట్‌లో పలు ఇండ్లల్లోకి వరద చేరింది. పెంచికల్‌పేట్‌లోని పెద్దవాగు పొంగడంతో దహెగాం మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. చింతలమానెపల్లి మండలంలో దింద వాగు, రుద్రపూర్ వాగు పొంగడంతో దింద, రుద్రాపూర్ గ్రామాలకు, బాలాజీ అనుకోడ వాగు పొంగడంతో రవీంద్రనగర్‌కు, దహెగాం మండలంలో ఎర్రవాగు పొంగడంతో తాత్కాలిక వంతెన తెగి తొమ్మిది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాల జిల్లాలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వేమనపల్లి మండలంలో బద్దవెల్లి వాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన తెగిపోవడంతో ముల్కలపేట, రాచర్ల, ఎంచపల్లి, జనగామ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా సోమవారం వర్షం పడింది. జగిత్యాల జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి.

ములుగులో ఐదు రోజులుగా..

ములుగు జిల్లాలో ఐదు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో జిల్లాలోని పలు చెరువుల్లోకి నీరు పెద్ద ఎత్తున చేరడంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు మండలాల్లో పూరిండ్లు నేలమట్టమయ్యాయి. వాజేడు మండలం బొమ్మనపల్లి వాగులో శనివారం కొట్టుకుపోయిన ఇర్ప రామ్మూర్తి మృతి చెందాడు. వాజేడు మండలంలోని గుండ్లవాగు, కొంగాలా, అల్లి వాగులు భారీ నీటితో ప్రవహిస్తున్నాయి. వెంకటాపురం(నూగూరు) మండలంలో పాలెం రిజర్వాయర్‌కు భారీ ఎత్తున నీరు చేరుకోగా పాలెం రిజర్వాయర్‌కు గండి పడే ప్రమాదం నుంచి స్థానిక రెవెన్యూ సిబ్బంది అప్రమత్తమై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. తాడ్వాయి మండలంలో ఆదివారం నుంచి సోమవారం వరకు 85.4 మిల్లీ మీటర్లు నమోదు కాగా మండలంలోని జంపన్నవాగు పొంగి ప్రవహిస్తున్నది.

నీట మునిగిన సీతమ్మ వాగు బ్రిడ్జి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. కాగా సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు దుమ్ముగూడె, భద్రాచలం వద్ద గోదావరిలోకి భారీగా వరద చేరుతున్నది. పర్ణశాలలోని నారచీరెల ప్రాంతంలో సీతమ్మవాగుపై రూ.30 లక్షలతో నిర్మిస్తున్న బ్రిడ్జి నీట మునిగింది. పర్ణశాల ప్రాంతంలోని ప్రగళ్లపల్లి పంచాయతీ, సున్నం బట్టి గ్రామాల్లోని వాగులు పొంగి పొలాల్లోకి నీరు చేరింది. అశ్వాపురంలో ఇసుక వాగు, సుద్దవాగులు పొంగి ప్రవహిస్తుండటంతో ఎలకలగూడెం, కొత్తూరు, గొందిగూడెం, మనుబోతులగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తగూడెం పట్టణంలోని మొర్రేడు వాగులోకి భారీగా నీరు చేరింది. దుమ్ముగూడెం మండలంలోని కే లక్ష్మీపురం, గౌరారం, పైడాకులమడుగు, తోగ్గూడెం, సుజ్ఞానపురం, ఈతలబోరు, సంగెం గ్రామాల మధ్యలో చిన్నగుబ్బలమంగి వాగు పొంగడంతో రాకపోకలు స్తంభించాయి. కిన్నెరసాని, మల్లన్నవాగు, ఏడుమలకలవాగు, దున్నపోతుల వాగు, నడివాగు, తొట్టి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మల్లన్నవాగు దాటి మండల కేంద్రానికి వెళ్లడానికి సోమవారం ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

చెరువులు, కుంటలకు జలకళ

కామారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఓ మోస్తరు, వర్షం కురిసింది. నిర్మల్ జిల్లాలో నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నా యి. గోదావరి, స్వర్ణ, కడెంలపై ఉన్న ప్రాజెక్టులు, రిజర్వాయర్లలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతున్నది. గడ్డెన్నవాగు, సదర్మాట్‌లకు కూడా వరద వస్తున్నది. నిజామాబాద్ జిల్లాలోని బోధన్, ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ డివిజన్లలో సోమవారం వర్షం కురిసింది. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లో వర్షం కురవడంతో ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద వస్తున్నది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలోకి వరద వస్తున్నది. కరీంనగర్ జిల్లాలో నాలుగు రోజులుగా ముసురు పడుతున్నది. సైదాపూర్ మండలంలోని సోమారం కల్వర్టు మీదుగా నీరు ప్రవహిస్తున్నది. వీణవంకలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు జలమయమయ్యాయి. చిగురుమామిడి మండలం రేకొండలో 3ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

అలుగుపారుతున్న ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని చిక్‌మాన్ ప్రాజెక్టు

తెగిపోయిన వాగులు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నాలుగురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. జిల్లాలో సగటు వర్షపాతం 38.76 మి.మీటర్లు కాగా, అత్యధికంగా కాటారంలో 60.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మహాముత్తారం మండలంలో దౌతుపల్లి వాగు తెగిపోయింది. కనుకునూరు, పెగడపల్లి, సింగంపల్లి వాగులు, గణపురం మండలంలో మోరంచవాగు, పలిమెల మండలంలో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జనగామ జిల్లాలో చిరుజల్లులు కురుస్తున్నాయి. బచ్చన్నపేట మండలంలో పెంకుటిల్లు కూలింది. వరంగల్ అర్బన్ జిల్లాలో ముసురుకున్నది. హసన్‌పర్తి మండలం నాగారం, కమలాపూర్ మండల కేంద్రంలోని చెరువులకు వరద భారీగా వస్తున్నది. సోమవారం జిల్లా వ్యాప్తంగా 52.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. వరంగల్ రూరల్ జిల్లాలో సోమవారం కూడా పలుచోట్ల వర్షం కురిసింది. పాకాల సరస్సు, చలివాగు ప్రాజెక్టుల్లోకి భారీగా వరద చేరుతున్నది.

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్

వర్షం కారణంగా మంచిర్యాల జిల్లా పరిధిలోని సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. బెల్లంపల్లి రీజియన్‌లో శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి ఏరియాల్లో 21 వేల టన్నుల ఉత్పత్తికి విఘాతం కలిగింది. భూపాలపల్లి ఏరియా కాకతీయ ఖని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు-2లో 15,042 టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది.

సిరిసిల్లలోని సినారె స్మారక గ్రంథాలయంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

సాహిత్యమే సినారె ఊపిరి

సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

సిరిసిల్ల టౌన్: తుదిశ్వాస వదిలే వరకు సినారె సాహిత్యమే ఊపిరిగా జీవించారని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ పేర్కొన్నారు. సిరిసిల్లలోని సినారె స్మారక గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య ఆధ్వర్యంలో సోమవారం సినారె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అశోక్ తేజ సినారెతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. సిరిసిల్లలో సినారె స్మారక గ్రంథాలయ భవనం, కళామందిరం నిర్మాణానికి కృషిచేసిన టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నేషనల్ బుక్ ట్రస్ట్ చైర్మన్ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడుగా, సాహితీవేత్తగా జిల్లాపేరును దేశానికి చాటిన మహర్షి నారాయణరెడ్డి అని కొనియాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారినంటూ మోసం

రూ.80 వేలు, ఉంగరాలతో ఉడాయించిన దుండగుడు

దామరచర్ల: విజిలెన్సు అధికారినంటూ దర్జాగా వచ్చి రూ.80 వేలతోపాటు మూడు ఉంగరాలు అపహరించుకుపోయిన ఘటన సోమవారం నల్లగొండ జిల్లా దామరచర్లలో జరిగింది. వాడపల్లి ఎస్ఐ నర్సింహారావు వివరాల ప్రకారం కొండ్రపోల్ కాల్వ కట్ట వద్ద రైతుమిత్ర సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ షాపు వద్దకు ఓ వ్యక్తి కారులో వచ్చాడు. షాపు యజమాని కటికం కృష్ణారెడ్డితో తాను విజిలెన్స్ అధికారినంటూ పరిచయం చేసుకుని హడావుడి చేశాడు. స్టాకు రిజిస్టర్, క్యాష్ వివరాలు అడిగి, కౌంటర్‌లో ఉన్న రూ.80 వేలతో పాటు చేతికున్న మూడు ఉంగరాలను తన వద్ద ఉంచుకున్నాడు. స్టాక్‌ను పరిశీలించి వెనుకే ఉన్న ఇంట్లోకి వెళ్లాడు. బెడ్ కింద క్యాష్ ఉందేమో చూపించమని చెప్పి వెంటనే బయటకు వచ్చి తలుపులు వేసి ఉడాయించాడు. తేరుకున్న బాధితుడు వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించిన పోలీసులు దుండగుడిని గుర్తించినట్టు సమాచారం. ఇటీవల హైదరాబాద్‌లో బీటెక్ యువతి సోనీ కిడ్నాప్ కేసులోనూ ఇతడే నిందితుడని అనుమానిస్తున్నారు.

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సోమారం కల్వర్టుపైనుంచి పారుతున్న వరద

ఆసిఫాబాద్ జిల్లా ముత్తంపేటలో నీటమునిగిన పత్తి పంట

నిండుగా ప్రవహిస్తున్న మంచిర్యాల జిల్లా చెన్నూర్ సమీపంలోని బతుకమ్మ వాగు

జనగామలో మాట్లాడుతున్న సామ్యూల్

సభ్యత్వ నమోదులో దూసుకెళ్లిన పాలకుర్తి

- సభ్యత్వ నమోదు జిల్లా ఇంచార్జి మందుల సామ్యూల్

జనగామ, నమస్తే తెలంగాణ: టీఆర్ఎస్ సభ్యత్వ నమోదులో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకుర్తి దూసుకెళ్లిందని సభ్యత్వ నమోదు జిల్లా ఇంచార్జి మందుల సామ్యూల్ తెలిపారు. 80,325 సభ్యత్వాలు చేయించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. సోమవారం జనగామ ఎమ్మెల్యే క్యాంపులో సభ్యత్వ నమోదు ఆన్‌లైన్ కంప్యూటీకరణను పరిశీలించారు. 34,050 క్రియాశీల సభ్యత్వాలు, 46,275 సాధారణ సభ్యత్వాలకు రూ.33 లక్షలు చెల్లించారన్నారు.

నలుగురు నకిలీ మావోయిస్టుల అరెస్టు

- రూ.1.65 లక్షల నగదు, బొమ్మ తుపాకీ, 16 సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ రవీందర్

వరంగల్ కమిషనరేట్లో వివరాలు వెల్లడిస్తున్న సీపీ రవీందర్

రెడ్డికాలనీ(వరంగల్): మావోయిస్టుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద రూ.1.65 లక్షల నగదు, బొమ్మ తుపాకీ, 16 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, కత్తి పెన్ను స్వాధీనం చేసుకున్నట్టు వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ విశ్వనాథ రవీందర్ తెలిపారు. సోమవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన పూసల శ్రీమన్నారాయణ, వరంగల్ రూరల్ జిల్లా పరకాల మండలం కామారెడ్డికి చెందిన పోతరాజు అశోక్, మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన నర్మెట్ట నాగరాజు, జనగామ జిల్లా కొడకండ్ల మండలం చెరువుముందుతండాకు చెందిన దరావత్ శ్రీనివాస్ ముఠాగా ఏర్పడ్డారు. ఎమ్మెస్సీ వరకు చదివిన శ్రీమన్నారాయణ 2004 నుంచి 2009 వరకు తొర్రూరు, రాయపర్తి ప్రభుత్వ కళాశాల్లో కాంట్రాక్టు లెక్చరర్‌గా పని చేశాడు. సులువుగా సంపాదించేందుకు మిగతా ముగ్గురితో కలిసి రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లను మావోయిస్టుల పేర్లతో బెదిరించి డబ్బు వసూళ్లకు పాల్పడేవారు. వరంగల్ హంటర్‌రోడ్ చిట్‌ఫండ్ వ్యాపారస్తుడిని బెదిరించి రూ.లక్ష, తొర్రూరు ప్రాంతానికి చెందిన రియలర్ట్ వద్ద రూ.50వేలు, పలువురి వద్ద వేలల్లో వసూలు చేశారు. ఇదేక్రమంలో మరికొందరు వ్యాపారుల నుంచి డబ్బుల వసూలు చేసేందుకు కాకతీయ యూనివర్సిటీ అతిథి గృహం వద్ద సమావేశం కాగా పక్కా సమాచారంతో పట్టుకున్నట్టు వెల్లడించారు.

రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శంభీపూర్ రాజు నాగలిపట్టి దుక్కిదున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేట (శంభీపూర్) పరిధిలోని తనవ్యవసాయ భూమిలో ఇటీవల మక్కజొన్న విత్తారు. గత రెండుమూడు రోజులుగా జల్లులు పడుతుండటంతో కలుపుతీయడంలో భాగంగా ఆయన నాగలిపట్టారు.

- దుండిగల్, నమస్తేతెలంగాణ

'రామగుండంలో ఉచిత దహన సంస్కారాలు'

గోదావరిఖని టౌన్: రామగుండం కార్పొరేషన్ పరిధిలో విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి పేదవారికి ఉచిత అంతిమ యాత్ర నిర్వహించనున్నట్టు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రకటించారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికి శ్మశాన వాటికకు శవాన్ని తరలించడానికి వైకుంఠరథం, దహనానికి కట్టెలు, ఖననానికి గుంతలు తీయించడం వంటి ఏర్పాట్లు ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు.

రిజర్వేషన్లు పూర్తయ్యాకే ఎన్నికలు

మున్సిపల్ ఎన్నికలపై పిల్‌లో ఎస్ఈసీ కౌంటర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మున్సిపల్ ఎన్నికలకు ముందు డీలిమిటేషన్, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయితే గరిష్ఠంగా 20 రోజుల్లో పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ)పేర్కొన్నది. మున్సిపల్ ఎన్నికలను హడావుడిగా చేపడుతున్నారని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో ఎస్ఈసీ కౌంటర్ దాఖలుచేసింది. ఈ నెల 16న మున్సిపల్ ఓటర్ల జాబితాలను ప్రచురించామని, వాటిలో నిరంతరం సవరణలు జరుగుతూనే ఉంటాయని తెలిపింది. ఎన్నికల తేదీ నాటికి ఓటర్ల జాబితాను సిద్ధంగా ఉంచుతామని పేర్కొన్నది. ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారుచేసిన తర్వాత గరిష్ఠంగా 20 రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నది. వార్డుల విభజన, వార్డుల రిజర్వేషన్ల ఖరారులో రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎలాంటి ప్రాతలేదని తెలిపింది.

దుకాణాలు @ 365 రోజులు

- రోజుకు 8గంటలు మించి పనిచేసే ఉద్యోగికి ప్రత్యేక రిజిస్టర్
- రాత్రి 8.30 దాటితే మహిళా ఉద్యోగులకు రవాణా సదుపాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చిరువ్యాపారులు, దుకాణ యజమానులకు శుభవార్త. రాష్ట్రంలో ఇక అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలను నిత్యం తెరిచే ఉంచి 365 రోజులూ వ్యాపారాన్ని నిర్వహించుకోవచ్చు. ఇందుకు సంబంధించిన కొత్త నిబంధనలు ఈ ఏడాది జూలై 25 నుంచి మూడేండ్లపాటు అమల్లో ఉంటాయని ప్రభుత్వం ప్రకటించడంతో తెలంగాణలోని చిరువ్యాపారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం ప్రతి ఉద్యోగి రోజుకు 8 గంటలు పనిచేసి రొటేషన్ పద్ధతిలో వారానికోసారి సెలవు తీసుకోవాలి. ఏ దుకాణంలోనైనా ఉద్యోగి 8 గంటల కంటే ఎక్కువ సమయం పనిచేస్తున్నట్టయితే అందుకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహించాలి. రాత్రి 8.30 దాటిన తర్వాత కూడా పనిచేసే మహిళా ఉద్యోగులకు తప్పని సరిగా ఇంటివరకు రవాణా సదుపాయాన్ని కల్పించాలి. ఈ నిబంధనలను రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్వాగతించింది. వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అభిప్రాయపడింది. వారాంతపు సెలవు లేనందువల్ల ఇక మీదట 365 రోజులూ షాపింగ్ చేసుకోవచ్చని, ప్రభుత్వ తాజా నిర్ణయంతో నిరుద్యోగులకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని అసోసియేషన్ సీఈవో కుమార్ రాజగోపాలన్ పేర్కొన్నారు.

టీ సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: తెలంగాణ వ్యాప్తంగా నిరుద్యోగ యువతీ యువతులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో టీ సేవ ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటుచేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివిధ బిల్లుల చెల్లింపులు, టికెట్స్ బుకింగ్, పోస్ట్‌పెయిడ్, ప్రీపెయిడ్ రీచార్జ్ సర్వీసులు, మనీ ట్రాన్స్‌ఫర్, నగదు బదిలీ, ఆధార్ పేమెంట్ సిస్టం వంటి మైక్రో ఏటీఎం సేవలు అందించడంతోపాటు పలు అమ్మకాలు, కొనుగోళ్ల సేవలను టీ సేవ ద్వారా అందిస్తున్నట్టు పేర్కొన్నారు. టీ సేవ కేంద్రాలను ఏర్పాటుచేసుకొనేందుకు ఆసక్తి చూపుతున్న నిరుద్యోగులు ఆగస్టు 14వ తేదీలోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. మరిన్ని వివరాలకు 8179955744, 9505800050 నంబర్ల లోగానీ, www.tsevacentre.com వెబ్‌సైట్లోగానీ సంప్రదించాలన్నారు.

ఎన్ఐవోఎస్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పదవ, 12వ తరగతుల్లో ఫెయిలైన విద్యార్థులు చదువు కొనసాగించే అవకాశం కల్పిస్తున్నది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్నైవోఎస్). ఇందులో ప్రవేశాలు పొందడానికి బుధవారం వరకు గడువు పొడిగించామని ఎన్నైవోఎస్ ప్రాంతీయ డైరెక్టర్ అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించే స్ట్రీమ్-2 కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు నుంచి టెన్త్/సీనియర్ సెకండరీ (12వ తరగతి) పరీక్ష రాయడానికి అర్హత పొందినవారు లేదా గతంలో పరీక్షలకు హాజరైనా ఉత్తీర్ణత సాధించనివారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పూర్తి వివరాల కోసం www.nios.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఆగస్టు మొదటి వారంలో పీజీఈసెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలోని ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీల్లో సీట్ల భర్తీకోసం ఆగస్టు మొదటి వారంలో పీజీఈసెట్-2019 కౌన్సెలింగ్‌ను నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అలాగే ఎడ్‌సెట్, లాసెట్, పీఈసెట్ కౌన్సెలింగ్‌ను కూడా ఆగస్టు మొదటి వారంలోనే నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించామని, సంబంధిత షెడ్యూళ్లను విడుదలచేసేందుకు అడ్మిషన్ల కమిటీలు ఒకట్రెండు రోజుల్లో సమావేశం కానున్నాయని కన్వీనర్ రమేశ్ తెలిపారు. పీజీఈసెట్ కోసం దాదాపు 20 వేల మంది విద్యార్థులు పోటీపడుతున్నారని, ఎంటెక్, ఫార్మసీ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియను త్వరగా ముగించి తరగతులు ప్రారంభించాలని అడ్మిషన్ కమిటీ భావిస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీల్లో ఎన్నిసీట్లకు యూనివర్సిటీలు అభిలేషన్లు ఇచ్చాయన్న వివరాలు ఇంకా అందలేదని, ఆ వివరాలు అందిన తర్వాత కాలేజీలు, సీట్ల సంఖ్యపై స్పష్టత వస్తుందని అన్నారు. ఈ ఏడాది ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌కు దాదాపు 50వేలమంది, లాసెట్‌కు 20 వేలమంది, పీఈసెట్ కౌన్సెలింగ్‌కు 4 వేలమంది పోటీపడుతున్నారని, పీఈసెట్, ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను మంగళవారం, పీజీఈసెట్, లాసెట్ షెడ్యూల్‌ను బుధవారం విడుదలచేస్తామన్నారు.

శ్రీ కనకదుర్గ దేవస్థానం (సిద్ధమ్మగుడి)
కేసముద్రం - జనగామ జిల్లా, వికాసిత మండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
SKDD/94/2019 Dt :30.07.2019
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
తేది :01.10.2019 నుండి 30.09.2020 వరకు ప్రొవిజన్స్ (కిరాణం) సప్లయి గూర్చి టెండర్ వివరాలకై www.eprocurement.gov.in నందు చూడగలరు. బిడ్ ప్రారంభ తేది :30.07.2019 బిడ్ ముగింపు తేది :13.08.2019 టెక్నికల్ బిడ్ ఓపెనింగ్ తేది : 14.08.2019 ప్రైస్ బిడ్ ఓపెనింగ్ :14.08.2019.
సం|- కార్యనిర్వాహణాధికారి

GOVERNMENT OF INDIA, MINISTRY OF FINANCE
DEPARTMENT OF FINANCIAL SERVICES
COURT OF THE RECOVERY OFFICER, DEBTS RECOVERY TRIBUNAL-1
3rd FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-500001 (T.S.)

R.C. No. 515/2017
IN
O.A. No. 369/2016

Indian Overseas Bank, Karimnagar Branch, H.No. 7-4-422/1, Main Road Mukarampura, Karimnagar Dist - 505002 (T.S.)
.... Certificate Holder
Versus
Sri Yamdani Kiran Kumar & Another
.... Certificate Debtors
To,
Sri Yamdani Kiran Kumar, S/o. Bhoomaiah, Wadkapuram Village, Julapally Mandal, Karimnagar District.
.... Certificate Debtor.

NOTICE OF DEMAND TO DEFENDANT / CERTIFICATE DEBTOR

Take notice that R.P. No. 515/2017 in O.A.No.369/2016, has been forwarded by the Honourable Presiding Officer, Debts Recovery Tribunal, Hyderabad for recovery of an amount of **Rs. 17,74,582/- (Rupees Seventeen Lakhs Seventy Four Thousand and Five Hundred Eighty Two Only.)** Plus interest and cost from you. You, the Certificate Debtors are hereby required to pay the amount of this notice by way of Demand Draft to be drawn in favour of "The Recovery Officer, Debts Recovery Tribunal 1, Hyderabad" within 15 days from the date of publication of this notice. In case of default, steps will be taken under Rule 4 and 5 of the second schedule of Income Tax Act, 1961 and section 25 to 29 of Recovery of Debts Due to Banks & Financial Institutions Act, 1993.

Date: 23-07-2019 (B.Uma Maheswari)
Place: Hyderabad Recovery Officer-1

తెలంగాణకు జరిగిన
అన్యాయాల్ని సరిదిద్దాలి

- ఎగువ బేసిన్ అవసరాలు తీరాకే దిగువకు నీరు తరలించాలి
- నా పరిజ్ఞానాన్ని శంకించాల్సిన అవసరంలేదు
- బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ తరపు సాక్షి ఘనశ్యాంఝా స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణాజలాల పంపిణీలో తెలంగాణకు జరిగిన అన్యాయాలు, ప్రాజెక్టువారీ కేటాయింపులను సరిదిద్దాల్సిన బాధ్యత బ్రిజేశ్ ట్రిబ్యునల్‌పై ఉన్నదని తెలంగాణ తరపు సాక్షి, సాగునీటిరంగ నిపుణుడు, కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ ఘనశ్యాంఝా స్పష్టంచేశారు. కృష్ణా జలాల పంపిణీ విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న వివాదంపై విచారణ జరుపుతున్న బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ సోమవారం ఘనశ్యాంఝా క్రాస్ ఎగ్జామినేషన్‌ను ప్రారంభించింది. ట్రిబ్యునల్ ముందు తొలిసారి వాంగ్మూలం ఇచ్చిన ఘనశ్యాం.. ఆంధ్రప్రదేశ్ తరపు న్యాయవాదులు అడిగిన ప్రశ్నలకు దీటుగా సమాధానమిచ్చారు. ముఖ్యంగా తాను సెక్షన్-89 పరిధిలోనే ట్రిబ్యునల్‌కు అఫిడవిట్ సమర్పించానని స్పష్టంచేశారు. తన పరిజ్ఞానాన్ని శంకించాల్సిన అవసరంలేదని, వ్యవసాయ, సాగునీటి రంగాల్లో నిష్ణాతుడినేనని పేర్కొన్నారు. బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు జరుపడం సెక్షన్-89లో అంతర్భాగమేనని, వాస్తవానికి ఎగువ బేసిన్‌లోని నీటి అవసరాలు తీరిన తర్వాతనే దిగువ బేసిన్‌కు నీటి కేటాయింపులు, తరలింపులు జరుగాలని అన్నారు. ఈ రోజు ఉన్న అవసరాలు రేపు ఉండకపోవచ్చని, అందుకే కృష్ణా ట్రిబ్యునల్‌లో సమీక్ష (రివ్యూ) క్లాజ్‌ను పొందుపరిచారని చెప్పారు. వాస్తవ పరిస్థితుల్లో చాలా తేడా ఉన్నందున తెలంగాణ అభ్యర్థనలను పరిగణలోనికి తీసుకొని నీటి కేటాయింపులు జరుపాలని ఘనశ్యాం పేర్కొన్నారు. తెలంగాణ తరపున సీనియర్ న్యాయవాదులు వైద్యనాథన్, రవీందర్‌రావు, కృష్ణామూర్తిస్వామి, ఇంటర్ స్టేట్ చీఫ్ ఇంజినీర్ నరసింహారావు, సాంకేతిక సలహా కమిటీ సభ్యుడు రవూఫ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు విజయ్‌కుమార్, కోటేశ్వరరావు, డీఈలు వెంకటనారాయణ, రవిశంకర్, ఏఈలు సునీల్, రయీజ్, అనురాగ్‌శర్మ తదితరులు ట్రిబ్యునల్ విచారణ సందర్భంగా ఉన్నారు.

జిల్లాకో మెడికల్ కాలేజీ కావాలి

లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు డిమాండ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వైద్య సదుపాయాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. దేశంలో ఇప్పటికీ వైద్య సౌకర్యంలేని గ్రామాలు అనేకం ఉన్నాయని విచారం వ్యక్తంచేశారు. తెలంగాణలో ప్రతి జిల్లాకు వైద్య కళాశాలను మంజూరుచేయాలని కోరారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లుపై సోమవారం లోక్‌సభలో చేపట్టిన చర్చ సందర్భంగా నామా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఈ బిల్లు సంపన్నులకు మేలు కలిగేలా, పేదలకు వ్యతిరేకంగా ఉండకుండా సవరణలు తీసుకురావాలన్నారు. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం నాన్-ప్రాఫిట బుల్ చారిటీ దవాఖానలు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ప్రవాస భారతీయ డాక్టర్లు, విదేశీ వైద్యుల సేవలు కూడా ఇక్కడి వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. 50 శాతం సీట్లకు ఫీజుల నిర్ణయాధికారం ప్రైవేట్ కాలేజీలకు ఉండటంతో.. అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని చెప్పారు. ఈ బిల్లు ద్వారా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేకుండా చేయవద్దని, నియంత్రణ అంతా కేంద్రం తన చేతుల్లో ఉంచుకోకుండా రాష్ట్రాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

భారతీయ కవులలో సినారె అగ్రగణ్యులు

- సినారె జాతీయ సాహిత్య పురస్కార సభలో హోంమంత్రి మహమూద్ అలీ
- ప్రముఖ రచయిత డాక్టర్ చంద్రశేఖర కంబారకు అవార్డు ప్రదానం
- సినారెను కొనియాడిన వక్తలు

సోమవారం జేఆర్సీ కన్వెన్షన్‌లో జరిగిన సినారె జయంత్యుత్సవ సభలో కన్నడ కవి డాక్టర్ చంద్రశేఖర్ కంబారకు విశ్వంభర సాహితీ పురస్కారాన్ని అందజేస్తున్న రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, ఓల్గా, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, శివారెడ్డి, జే చెన్నయ్య కూడా ఉన్నారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: భారతీయ కవులలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి అగ్రగణ్యులని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సినారె 88వ జయంత్యుత్సవం సోమవారం సాయం త్రం రాయదుర్గం దర్గాలోని జేఆర్సీ కన్వెన్షన్‌లో వైభవంగా జరిగింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటయిన 'విశ్వంభర' డాక్టర్ సీ నారాయణరెడ్డి తొలి జాతీయ సాహితీ పురస్కారాన్ని కర్ణాటక రాష్ట్రానికి చెందిన జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత, పద్మశ్రీ, కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర కంబారకు ప్రదానం చేశారు. అవార్డుతోపాటు రూ.3 లక్షల చెక్కు, జ్ఞాపికతో సత్కారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో ఎన్నో రచనలు చేసిన మహానుభావుడు సినారె అని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. నారాయణరెడ్డి 'ఆహార్యంలో శ్రీనాథుడు.. అంతరంగంలో పోతనామాత్యుడు' అని అన్నారు. ముఖ్య అతిథిగా రావాల్సిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాలేకపోవడంతో ఆయన సందేశాన్ని లక్ష్మీప్రసాద్ వినిపించారు. ప్రముఖ కవి శివారెడ్డి మాట్లాడుతూ.. సినారెది ఒక లెజెండరీ ఫిగర్ అని కొనియాడారు. తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. సినారె సాహిత్య వారసత్వాన్ని కొనసాగించాలని అన్నారు. సీఎం ఓఎస్డీ, ప్రజాగాయకుడు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'మనిషికి శ్వాసక్రియ ఎటువంటిదో.. సినారెకు రచన కూడా అలాంటిదే'నని అన్నారు. ఆయనది మనోహరమైన పద బంధమని కొన్ని పాటలను, పద్యాలను, పాడి వినిపించారు. ఈ సందర్భంగా సభను సాహితీవేత్తల కరతాళ ధ్వనులతో హోరెత్తించారు. సినారె రాసిన వేల పాటలను ఏర్చి కూర్చి ఐదు సంపుటాలుగా ఆవిష్కరించారు.

సినారెతో నాది దశాబ్దాల పరిచయం:
అవార్డు గ్రహీత కన్నడ కవి చంద్రశేఖర కంబార

సినారెతో తనకు కొన్ని దశాబ్దాల పరిచయం ఉన్నదని అవార్డు గ్రహీత కన్నడ కవి చంద్రశేఖర కంబార తెలిపారు. మా స్నేహం మరువలేనిదన్నారు. ఆయన పేరుమీదున్న పురస్కారాన్ని తానందుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు తెలిపారు. తన జీవితంలో మరిచిపోలేని, మధురమైన రోజిదని చెప్పారు. కార్యక్రమంలో శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ అధ్యక్షుడు గోవిందరాజు రామకృష్ణారావు, కార్యదర్శి జె చెన్నయ్య, సినారె కుటుంబ సభ్యులు, పలువురు సాహితీవేత్తలు, కవులు పాల్గొన్నారు.

చిట్టీల మోసాలను నియంత్రించాలి

అక్రమ డిపాజిట్ల నిషేధ పథకాల చట్టంపై చర్చలో ఎంపీ బండ ప్రకాశ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చిట్టీల పేరుతో మోసంచేసే వారిని నియంత్రించాలని, కేంద్రం తీసుకొస్తున్న చట్టాన్ని మరింత సమర్థంగా అమలుచేసి డిపాజిట్లు, చిట్టీల్లో సేవింగ్ చేసుకొనేవారికి న్యాయం జరిగేలా చూడాలని టీఆర్ఎస్ ఎంపీ బండ ప్రకాశ్ అన్నారు. రాజ్యసభలో సోమవారం అక్రమ డిపాజిట్ల నిషేధ పథకాల చట్టంపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వ్ బ్యాంకు 2016 నివేదిక ప్రకారం చిట్ ఫండ్ సంస్థలు దేశవ్యాప్తంగా ఆరు కోట్ల మంది నుంచి రూ.68 వేల కోట్లు డిపాజిట్ చేయించాయని, నెలనెలా చిట్టీలు, డిపాజిట్లకు ఎక్కువ వడ్డీ ఆశ చూపి మోసానికి పాల్పడుతున్నాయని చెప్పారు. చిట్టీల్లో దాచుకొంటున్న మొత్తాలను సంస్థలు, వ్యక్తులు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి, సొంత పనులకు మళ్లిస్తూ పేదలను నిలువునా ముంచుతున్నారని విచారం వ్యక్తంచేశారు. నెలకు రూ.10 వేలు చెల్లిస్తే రూ.20 వేలు తిరిగి ఇస్తామంటూ ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి మోసపూరిత మాటలకు అకర్షితులైన అనేక మంది బంగారం అమ్మి మరీ పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. చిట్ ఫండ్ సంస్థల్లో పేదలు ఎంత పెట్టుబడులు పెడుతున్నారో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సర్వే చేయించాలని సూచించారు.

ఢిల్లీలో తెలంగాణ వైద్యుల ఆందోళన

ఎన్ఎంసీ బిల్లు రద్దుచేయాలని డిమాండ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లును రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం దేశ రాజధాని ఢిల్లీలోని నిర్మాణ్‌భవన్ వద్ద చేపట్టిన దేశవ్యాప్త ఆందోళనలో తెలంగాణకు చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు. వైద్య విద్యార్థులను అయోమయానికి గురిచేసే లా రూపొందించిన నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు ఢిల్లీలో చేపట్టిన ఆందోళనలో అన్ని రాష్ట్రాలవారితో పాటు తెలంగాణకు చెందిన జూనియర్, రెసిడెంట్ వైద్యులు పాల్గొన్నారు.

గురుకులాల్లో అర్జునులు

- క్రీడల్లో మెరికలు ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ విద్యార్థులు
- గతేడాది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించిన 587 చిన్నారులు
- ప్రతిభావంతులకు రూ.53 లక్షల ప్రోత్సాహం అందజేసిన రాష్ట్ర ప్రభుత్వం

తెలంగాణ క్రీడాపోటీల్లో పతకాలు సాధించిన ఎస్సీ, ఎస్టీ గురుకులాల విద్యార్థులు

పతకం క్యాటగిరీ	అంతర్జాతీయ స్థాయి		జాతీయ స్థాయి		రాష్ట్రస్థాయి	
	బాలికలు	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు	బాలురు
బంగారు పతకం	5	1	72	25	206	114
రజత పతకం	3	0	30	28	128	82
కాంస్య పతకం	0	3	24	17	67	70
మొత్తం	8	4	126	70	401	266

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గురుకుల విద్యాలయాలు.. విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నాయి. సీఎం కేసీఆర్ సర్కార్.. ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాలకు సకల సౌకర్యాలు కల్పించడం, నగదు ప్రోత్సాహకాలు అందిస్తుండటంతో విద్యార్థులు చదువులో ప్రతిభను కనబరుస్తూనే క్రీడల్లోనూ రాణిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని పతకాలు సాధించి రాష్ట్రానికి వన్నె తెస్తున్నారు. ఆయా క్రీడాపోటీల్లో విద్యార్థినులు అధికసంఖ్యలో భాగస్వాములు కావడం విశేషం. వివిధ పోటీల్లో పతకాలు సాధించినవారిలో బాలురు 340 మంది, ఉండగా.. బాలికలు 535 మంది ఉన్నారు. ఈ నెల రెండున మలేషియాలో నిర్వహించిన ఎనిమిదవ అంతర్జాతీయ కరాటే ఫెడరేషన్ చాంపియన్ షిప్‌లో ఎస్సీ, ఎస్టీ గురుకులాల విద్యార్థులు పతకాలు సాధించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాకాలు

క్రీడల్లో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొనేవిధంగా గురుకుల విద్యాలయాల సొసైటీ ప్రోత్సహిస్తున్నది. 38 క్రీడల్లో పతకాలు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నది. ఇందులో ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, వెయిట్ లిఫ్టింగ్, వ్రెస్ట్‌లింగ్, బాక్సింగ్, సైక్లింగ్, రోయింగ్, షూటింగ్, ఫెన్సింగ్, రోలర్ స్కేటింగ్, సెయిలింగ్ యాచింగ్, ఆర్చెరీ, క్రికెట్, చెస్, ఖోఖో, జూడో, తైక్వాండో, సాఫ్ట్‌బాల్, బాడీబిల్డింగ్, బాల్ బ్యాడ్మింటన్, కరాటే, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, నెట్‌బాల్, త్రోబాల్, సెపక్‌తాక్రా, టెన్నికాయిట్, యోగా ఉన్నాయి.

గతేడాది రూ.53 లక్షల నగదు ప్రోత్సాహం అందజేత

2018-19 విద్యాసంవత్సరం క్రీడల్లో రాణించిన 587 మంది ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యార్థులకు రూ.53,01,000 పారితోషికం అందజేశారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించడంతోపాటు ప్రతిభ కనబర్చిన 17 మంది విద్యార్థులకు ప్రోత్సాహకం కింద రూ.2,45,000 అందజేశారు. జాతీయస్థాయిలో 219 మందికి రూ.17,18,000, రాష్ట్రస్థాయిలో 351 మంది విద్యార్థులకు రూ.33,38,000 నగదు ప్రోత్సాహకం అందించారు.

క్రీడల్లో వివిధ పతకాలు సాధించిన విద్యార్థులకు అందిస్తున్న నగదు ప్రోత్సాహకాలు

క్యాటగిరీ	బంగారు పతకం	రజత పతకం	కాంస్య పతకం	పాల్గొన్నవారికి
అంతర్జాతీయ స్థాయి	25,000	20,000	15,000	10,000
జాతీయ స్థాయి	15,000	10,000	5,000	2,000
రాష్ట్రస్థాయి	5,000	3,000	2,000	--

తప్పుడు లేఖలు ఇస్తే కఠిన చర్యలు

విద్యార్థులు, వైద్య కళాశాలలను అప్రమత్తం చేసిన మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సెంట్రల్‌పూల్ కోటా కింద మెడికల్ సీట్లు అనుమతిస్తున్నట్లు నకిలీ లేఖలు జారీ అవుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి చర్యలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు ఉంటాయని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ హెచ్చరించింది. దేశవ్యాప్తంగా కొన్ని సంవత్సరాలుగా సెంట్రల్ పూల్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ సీట్లలో ప్రవేశానికి నకిలీ కేటాయింపుపత్రాలు జారీచేస్తున్నారని, దీనితో కేంద్ర ప్రభుత్వ సంస్థకు ఏమాత్రం సంబంధంలేదని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్, మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటన జారీచేశాయి. కొందరు గుర్తుతెలియనివారు తప్పుడు లేఖలు జారీచేస్తున్నారని, దేశవ్యాప్తంగా విద్యార్థులు, అన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు అప్రమత్తం కావాలని సూచించారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ పద్ధతిన మెడికల్ సీట్లను భర్తీచేస్తామని అధికారిక వెబ్‌సైట్ www.mcc.nic.in మాత్రమే ఉందని, మరో వెబ్‌సైట్ లేదని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ స్పష్టం చేసింది.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సర్కారుకు టీపీటీయూ విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రొగ్రెసీవ్ టీచర్స్ యూనియన్ (టీపీటీయూ) రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, గోణుగోపాలస్వామి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం అగ్రిభవన్‌లో నిర్వహించిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేశారు. 65 శాతం ఫిట్‌మెంట్, యాజమాన్యాలవారీగా పదోన్నతులు, అంతర్ జిల్లా బదిలీలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో స్వాధీనం చేసుకున్న వన్యప్రాణి మాంసం, నిందితులు

వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్టు

కోనరావుపేట: వన్యప్రాణులను వేటాడి మాంసం విక్రయిస్తున్న 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రాజన్న సిరిసిల్ల జి

నమస్తే తెలంగాణ

ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

ఎకరా రూ.20 వేలే!

భలే మంచి చౌక బేరం

అమ్మకానికి ప్రభుత్వభూమి ■ నల్లగొండ జిల్లా చందంపేట రెవెన్యూ సిబ్బంది అక్రమదందా

ఒక్కొక్కరికి 20 నుంచి 50 ఎకరాలు పట్టా ■ 250 ఎకరాల ప్రభుత్వభూమి హాంఫట్

- స్థానిక ప్రజాప్రతినిధులకూ వాటాలు.. బంధువుల పేరిట పట్టాలు
- అక్రమాల పుట్టగా చందంపేట తాసిల్ కార్యాలయం
- కిందిస్థాయి సిబ్బంది బెదిరింపులతో సెలవుల్లో తాసిల్దార్లు
- ఏండ్లుగా డిప్యూటీ తాసిల్దార్‌కే ఇంచార్జి బాధ్యతలు
- వీఆర్వోలదే ఇష్టారాజ్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నల్లగొండ జిల్లా దేవరకొండ పాత తాలూకా పరిధిలోని చందంపేట మండలం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి 120 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కొండలు, గుట్టల మధ్య ఉండే ఈ ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా నివసిస్తుంటారు. మండల కేంద్రానికి సమీపంలోనే అచ్చంపేటపట్టి అనే గ్రామం ఉన్నది. ఈ గ్రామ రెవెన్యూలోని సర్వే నంబర్ 50లో దాదాపు 900 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నది. ఉమ్మడి రాష్ట్రంలో ఏడు విడుతలుగా జరిగిన భూపంపిణీలో భాగంగా భూమిలేని పేదలకు కొంత పంపిణీచేశారు. మిగిలిన భూమిపై స్థానిక రెవెన్యూ అధికారుల కన్ను పడింది. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకొని దాదాపు 250 ఎకరాల భూమిని అక్రమంగా విక్రయించారు. ఒక్కొక్కరికీ ఎకరాలకు ఎకరాలే రాసిచ్చారు. ప్రభుత్వ భూమికి అసైన్డ్ పట్టాలు కాకుండా.. ఏకంగా ప్రైవేట్ పట్టాలు జారీచేశారు. స్థానికులు, స్థానికేతరులు అనే తేడాలేకుండా.. ఎవరు డబ్బులు ఇస్తే వారిపేరిట పట్టాలు ఇచ్చేశారు. 1026 అనే ఖాతా నంబర్‌పై ఈ సర్వే నంబర్‌లో 60 ఎకరాల భూమి పట్టాచేసినట్టు స్థానికులు 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. అలాగే ఖాతా నంబర్ 175కు 11 ఎకరాలు, ఒకరికి 19 ఎకరాలు, మరొకరికి 13 ఎకరాలు ఈ ప్రభుత్వ భూమి పట్టా అయిందని స్వయంగా స్థానిక వీఆర్వోనే చెప్తున్నారు. అచ్చంపేటపట్టి గ్రామంలోని ప్రభుత్వ భూమిని చందంపేట, మూడుదండ్ల, పోలెనాయక్‌తండాలకు చెందిన వారికి పట్టాచేసినట్టు తెలిసింది.

ప్రజాప్రతినిధులకూ పాత్ర

అచ్చంపేటపట్టిలోని ప్రభుత్వ భూమి విక్రయంలో స్థానిక ప్రజాప్రతినిధుల హస్తం కూడా ఉన్నట్టు తెలుస్తున్నది. ఒక సర్పంచ్ తన భార్య పేరిట మూడెకరాలు, ఇద్దరు కొడుకుల పేరిట ఐదెకరాల చొప్పున పట్టా చేయించుకోవడం గమనార్హం. మరో గ్రామ సర్పంచ్ కూడా ఐదెకరాల భూమిని పట్టాచేసుకున్నారు.. ఇలా సర్పంచ్‌లు, వారి బంధువులు, కాస్త డబ్బు, పలుకుబడి ఉన్నవాళ్లు పలువురు ఎకరాకు రూ.20 వేల చొప్పున రెవెన్యూ సిబ్బందికి చెల్లించి ఈ ప్రభుత్వ భూమిని పట్టాలు చేయించుకొన్నారు.

సీఎం కేసీఆర్‌కు సర్పంచ్ ఫిర్యాదు

చందంపేట మండలంలో ప్రభుత్వ భూమిని వీఆర్వో రూ.20 వేలకు ఎకరం చొప్పున అమ్ముతున్నాడంటూ స్థానిక సర్పంచ్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా 'నమస్తే తెలంగాణ'కు వివరాలు ఇచ్చారు. ఈ సర్వే నంబర్‌లో 24 ఎకరాలు సాగుచేసుకొంటున్న ఆరుగురు పేద రైతులకు భూమిని పట్టాచేయమని అడిగితే.. రెవెన్యూ అధికారులు డబ్బులు ఇవ్వనిదే చేయడం లేదని ఫిర్యాదుచేశారు. ఇదిలా ఉండగా, ఈ సర్పంచ్ కూడా సర్వే నంబర్ 50లో తన కుటుంబసభ్యుల పేరిట 13 ఎకరాలు పట్టా చేయించుకొన్నట్టు తెలిసింది. వాస్తవంగా ప్రభుత్వ భూమి పేదలకు ఇస్తే అసైన్ పట్టా వస్తుంది. కానీ, ఇక్కడ నేరుగా పట్టాలు ఇవ్వడం గమనార్హం.

వివాదాల పుట్ట చందంపేట తాసిల్

చందంపేట తాసిల్ కార్యాలయంలో కిందిస్థాయి సిబ్బందిదే ఇష్టారాజ్యం. పదేండ్లకుపైగా తిష్టవేసిన సిబ్బంది.. ఇక్కడికి బదిలీపై వచ్చే తాసిల్దార్‌పై బెదిరింపులకు పాల్పడుతుంటారు. సదరు అధికారి సెలవుపెట్టిపోవడమో లేక తిరిగి బదిలీపై వెళ్లిపోయేవరకు ఈ బెదిరింపులు ఉంటాయని తెలుస్తున్నది. 'మీరు సెలవు పెట్టయినా వెళ్లండి.. లేకుంటే మేం చెప్పినట్టు చేసి, ఇచ్చింది తీసుకోండి.. కాదు అంటే ఓ అమ్మాయిని మీ చాంబర్‌లోకి పంపించి.. రేప్‌కేసు పెట్టిస్తాం' అని బెదిరించడంతో ఒక తాసిల్దార్ ఏకంగా సెలవుపెట్టి వెళ్లిపోయినట్టు సమాచారం. ఇక్కడ ఏ తాసిల్దార్ కూడా ఎక్కువకాలం పనిచేసిన దాఖలాలు లేవంటే పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఏండ్లకు ఏండ్లు డిప్యూటీ తాసిల్దారే ఇంచార్జి తాసిల్దార్‌గా పనిచేయడం గమనార్హం. కార్యాలయంలో కొన్నేండ్లుగా తిష్టవేసిన సిబ్బంది.. ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్నవారు అందరూ కలిసి ఒక రింగ్‌గా ఏర్పడి ఈ భూదందా చేస్తున్నట్టు తెలుస్తున్నది.

అక్రమంగా ఇచ్చిన పట్టాలన్నీ రద్దుచేయాలి

వీఆర్వో ఎకరానికి రూ.20 వేలు తీసుకొని ప్రభుత్వ భూములను పట్టాగా మారుస్తున్నాడు. ఇందుకు కావాల్సిన ప్రొసీడింగ్స్ అన్నీ అతడే ఇస్తున్నాడు. మా పంచాయతీ పరిధిలో ఆరుగురు గిరిజనులు కబ్జాలో ఉంటూ వ్యవసాయం చేసుకొంటుంటే వారికి పట్టాలు ఇవ్వడంలేదు. గతంలో ఇక్కడ పనిచేసిన వీఆర్వో 200 ఎకరాలను కబ్జాచేసి సస్పెండయ్యారు. ప్రభుత్వ భూమిని ఆన్‌లైన్ చేస్తున్నారు. కాస్తులో, కబ్జాలో లేనివారికి, గ్రామస్థులు కానివారికి పట్టాలు చేస్తున్నారు. వీఆర్వో యాదయ్యను సస్పెండ్ చేయడంతోపాటు అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దుచేసి, భూమిని స్వాధీనం చేసుకోవాలి. భూమి లేని గిరిజనులకు ఇవ్వాలి.

- జర్పుల లోక్యానాయక్, సర్పంచ్, అచ్చంపేట పట్టి

అక్రమంగా పట్టాలు వాస్తవమే

అచ్చంపేటపట్టిలో రెవెన్యూ సర్వే నంబర్ 50లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా పట్టాలు ఇచ్చిన మాట వాస్తవమే. ఆ పట్టాలన్నీ మండల కార్యాలయంలో ఇచ్చారు. వాటిని ఎవరిచ్చారో తెలియదు. దీనిపై దేవరకొండ ఆర్డీవోకు ఫిర్యాదుచేయగా.. విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఏడు విడుతల భూపంపిణీ వివరాలతోపాటు తర్వాత జరిగిన అక్రమ పట్టాలపై వేర్వేరు నివేదికలు ఇవ్వాలని సూచించారు. నివేదిక రూపొందించా.. ఆర్డీవోకు ఇస్తాను. సర్పంచ్ లోక్యానాయక్ ఆరుగురికి 25 ఎకరాలు పట్టాచేయాలని అడిగారు. నేను చేయలేనని చెప్పాను. ఈ విషయాన్ని కూడా ఆర్డీవోకు తెలియజేశాను.

- యాదయ్య, అచ్చంపేట పట్టి వీఆర్వో

చర్యలు తీసుకొంటాం

ప్రభుత్వ భూమిని అక్రమంగా అమ్మి పట్టా చేసిన వ్యవహారానికి సంబంధించి ఫిర్యాదు అందింది. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకొంటాం. భూమిని స్వాధీనం చేసుకొంటాం.

- లింగ్యానాయక్, దేవరకొండ ఆర్డీవో

ఒకరి భూమి మరొకరికి పట్టా

- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- ఏడాదిగా తిరుగుతున్నా పట్టని బోనకల్లు అధికారులు

నోటీసును చూపుతున్న రైతు రామారావు

బోనకల్లు: ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లికి చెందిన వంగాల వీరభద్రం రాపల్లె రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్ 469/ఇ/ఏలోని 1.01 ఎకరాల భూమిని 1969లో చెరుకూరి కృష్ణయ్య వద్ద సాదాబైనామా ద్వారా కొన్నారు. అప్పటి నుంచి 2014 వరకు అతనే అనుభవదారు కాలంలో ఉన్నారు. 2015 నుంచి అనుభవదారు కాలంలో వీరభద్రం కుమారుడు వంగాల రామారావు.. పట్టాదారుడిగా చెరుకూరి కృష్ణయ్య ఉన్నారు. భూరికార్డుల ప్రక్షాళనలో రైతు వంగాల రామారావు సాదాబైనామా ద్వారా పట్టా కోసం దరఖాస్తు చేసుకొని భూమిని సాగుచేసుకొంటున్నారు. కానీ రెవెన్యూ అధికారులు గుడిదే సత్యంకు ఆ భూమిని పట్టాచేసి పాస్‌పుస్తకం అందజేశారు. ఈ విషయంపై పలుమార్లు స్థానిక తాసిల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోయారు. భూమికి సంబంధించిన ఆధారాలు కావాలని తాసిల్దార్ చెప్పారని, దీంతో సర్వే చేయించి నివేదికను తాసిల్ కార్యాలయంలో ఏడాదిన్నర కింద ఇచ్చినా పాస్‌పుస్తకం ఇవ్వలేదని రైతు వాపోయారు. కొద్దిరోజుల కింద ఇరువురు రైతులను కోర్టుకు పిలిపిస్తామని తాసిల్దార్ నోటీసు ఇచ్చినట్టు బాధితుడు పేర్కొన్నారు. ఈ విషయమై తాసిల్దార్‌ను వివరణ కోరగా.. సర్వే నంబర్ 469/ఇ/ఏలో 1.01 ఎకరాల భూమి వంగాల రామారావు పేరిట నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ అది గుడిదె సత్యం పేరిట నమోదైందని.. రికార్డులను పరిశీలించి రైతుకు పాస్‌పుస్తకం అందిస్తామని తాసిల్దార్ చెప్పారు.

అసైన్డ్‌భూమి పట్టాకోసం అష్టకష్టాలు

- కబ్జాలో ఉన్నా కొత్త పాస్‌బుక్ ఇవ్వని అధికారులు
- రెండేండ్లుగా తాసిల్ చుట్టూ తిరుగుతున్న దామరచర్ల రైతు

దామరచర్ల: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం ఇర్కిగూడెం గ్రామానికి చెందిన తవిటి నాగేంద్రమ్మకు 2004 లో ప్రభుత్వం గ్రామశివారులోని 11 సర్వేనంబర్‌లో 2.21 ఎకరాల భూమిని పంపిణీ చేసింది. ఈ భూమికి సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకం కూడా అధికారులు అందించారు. నాటినుంచి ఆమె కుటుంబసభ్యులు సాగులో ఉన్నారు. పత్తి, జనుము, జొన్న తదితర పంటలు సాగు చేసుకుంటున్నారు. దీనిని బ్యాంకులో పెట్టి మహిళా రైతు పలుమార్లు పంటరుణాలు కూడా తీసుకున్నారు. కానీ, అధికారులు ఆన్‌లైన్‌లో నాగేంద్రమ్మ పేరు నమోదుచేయలేదు. దీనిపై ఆమె 2017లో కోర్టుకు వెళ్లారు. కేసును విచారించిన న్యాయస్థానం సదరు రైతుకు సంబంధించిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తీర్పునిచ్చింది. అయినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా అధికారులు సదరు భూమిని సైతం సర్వే చేశారు. ఆన్‌లైన్ చేయకపోవడంతో పట్టాదారు పాస్‌పుస్తకం రాలేదు. ఈ విషయమై మహిళా రైతు పలుమార్లు అధికారులను కలిసినా వారు కనికరించలేదు.

అసైన్డ్ భూమిపై కబ్జాదారుల కన్ను

నాగేంద్రమ్మకు చెందిన 2.21 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయకపోవడంతో అదేగ్రామానికి చెందిన కొందరు క్రమంగా భూమిని ఆక్రమించుకుంటున్నారు. ఇదే సర్వే నంబర్‌లో మైనింగ్ కోసం భూమిని లీజుకు తీసుకున్న వ్యక్తులు నాగేంద్రమ్మకు చెందిన భూమిలో మట్టిపోసి సాగుచేసిన జొన్న పంటను నాశనంచేశారు. ఈ విషయమై ఫిర్యాదుచేసినా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. న్యాయం చేయాలని కోరుతూ ఆమె 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

రైతు సాగులో లేనందునే పట్టా చేయలేదు

రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గ్రామంలో సర్వే చేసిన క్రమంలో భూమిలో ఎలాంటి సాగు లేనందున ఆన్‌లైన్ చేయలేదు. సర్వే సమయంలో సాగులోలేని రైతుల భూములకు సంబంధించిన అసైన్డ్ పట్టాలను రద్దుచేయాలని ఉన్నతాధికారులకు కూడా తెలిపాం. దీంతోపాటు ఈ భూమిపై పలు వివాదాలు ఉండటంతో పెండింగ్‌లో పెట్టాం.

- సైదులు, వీఆర్వో

మాజీ సర్పంచ్ భూమి మాయం

- 7.06 ఎకరాలు ఇతరుల పేరిట మార్పు
- కాస్తులో ఉన్నా కనికరించలేదు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితులు

యాదగిరిగుట్ట, నమస్తే తెలంగాణ: యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని తేర్యాల గ్రామంలో మంత్రి మల్లయ్య, లింగయ్య, ముత్తయ్యల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూమిని వారి కుమారులైన మాజీ సర్పంచ్ మంత్రి జోగయ్య (తండ్రి పేరు మల్లయ్య), మంత్రి శంకరయ్య (తండ్రి పేరు లింగయ్య) పంచుకొని వ్యవసాయం చేసుకొంటున్నారు. మంత్రి జోగయ్యకు పాలిభాగంలో సర్వే నంబర్ 3 ఆ/2లో 3.25 ఎకరాలు.. 443/ ఆలో 1.25 ఎకరాలు, 445/ఆలో 33 గుంటలు, 283/ఆలో 1.06 ఎకరాలు కలిపి మొత్తం 7.06 ఎకరాలను చిన్నాన్న కొడుకు శంకరయ్య పేరిట 2015లో రెవెన్యూ అధికారులు పట్టాచేశారు. తాజాగా రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకొన్నప్పుడు ఈ విషయం బయటపడింది. దీంతో ఆందోళన చెందిన జోగయ్య అధికారులను నిలదీశారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భూమిని ఎలా మార్చారో చెప్పాలని అడిగితే జవాబివ్వడంలేదు. రికార్డులను సవరించాలని వేడుకొన్నా కనికరించకపోవడంతో.. జోగయ్య తనకు న్యాయం చేయాలని 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

విచారణ చేపడుతాం

మంత్రి జోగయ్యకు సంబంధించిన భూమిని వేరేవారికి పట్టా మార్పు చేశారన్న విషయం నాకు తెలియదు. పట్టా మార్పు ఏలా జరిగిందో విచారణ చేపడ్తాం. రికార్డులు తెప్పించుకొని వాస్తవాలు గుర్తించి తగిన న్యాయంచేస్తాం.

- ఎస్ గీత, మోటకొండూర్ తాసిల్దార్

లంచం ఇస్తేనే పాస్‌బుక్!

- తాసిల్దార్ ఆదేశించినా పనిచేయని వీఆర్వో
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన నాగర్‌కర్నూల్ జిల్లా మర్రిపల్లి రైతులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం మర్రిపల్లి గ్రామంలో పలువురు రైతులకు చెందిన భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించకపోవడం, పాస్‌పుస్తకాలు జారీ చేయకపోవడంతో వారంతా రైతుబంధు, రైతుబీమా పథకాలకు దూరమవుతున్నారు. తాసిల్దార్ ఆదేశించినా వీఆర్వో ఆంజనేయులు పనిచేయడంలేదని, 'నీకు దిక్కున్నచోట చెప్పుకో' అని బెదిరిస్తూ.. లంచం అడుగుతున్నారని బాధితులు వాపోయారు. తాసిల్ కార్యాలయం చుట్టూ తిరిగి.. విసిగిపోయిన రైతులు చివరికి 'ధర్మగంట'ను ఆశ్రయించారు. మర్రిపల్లికి చెందిన మారడి మల్లయ్య వారసులు మారడి లక్ష్మయ్య, మారడి రాములు, మారడి శేఖర్, మారడి యాదయ్యకు సర్వే నంబర్ 687లో 5.5 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమికి సంబంధించి కొత్త పాస్‌బుక్ జారీకాకపోవడంతో 2018 జూన్ 5న తాసిల్దార్ శ్రీకాంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తిచేశారు. రెండేండ్లుగా తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు ముఖ్యంగా వీఆర్వో ఆంజనేయులు పట్టించుకోవడం లేదని, రేపు మాపు అంటూ తిప్పించుకొంటూ.. లంచం అడుగుతున్నారని మారడి మల్లయ్య వారసులు ఆరోపిస్తున్నారు.

తాసిల్దార్ చెప్పినా వినడంలేదు

నాకు మర్రిపల్లి శివారులోని సర్వే నంబర్ 677/3లో వారసత్వంగా వచ్చిన 3.35 ఎకరాల భూమి ఉన్నది. దీనికి సంబంధించి పాత పాస్‌పుస్తకం ఉన్నప్పటికీ.. కొత్తది ఇవ్వకపోవడంతో రైతుబంధు, రైతుబీమా పథకాలు వర్తించడంలేదు. వీఆర్వో ఆంజనేయులును ఎన్నిసార్లు కలిసినా ఫలితం దక్కలేదు. సమస్యను తాసిల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి విన్నవించగా.. ఆయన గత ఫిబ్రవరి 2న వీఆర్వోకు ఫోన్‌చేసి, పదిరోజుల్లో పాస్‌బుక్ సిద్ధంచేయాలని ఆదేశించారు. కానీ, నేటికీ ఇవ్వలేదు. 'నీకు దిక్కున్నచోట చెప్పుకో' అని వీఆర్వో బెదిరిస్తున్నడు. వయస్సు సహరించడం లేదన్నా ఆయన మనసు కరుగుతలేదు.

- నూనే లాలయ్య, మర్రిపల్లి రైతు

విచారణ చేపడుతున్నాం

సర్వే నంబర్లు 539/1, 687కు సంబంధించి కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వాలన్న అంశం మా పరిశీలనలో ఉన్నది. సర్వే నంబర్ 687 లో పొజిషన్‌లో మద్ది బచ్చిరెడ్డి ఉన్నారు. దీనిపై విచారణ చేపడుతున్నాం. నేను ఎవరినీ లంచం అడుగలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులకు కొత్త పాస్‌పుస్తకాలు అందిస్తాం.

- ఆంజనేయులు, వీఆర్వో

పట్టా కోసం పదిహేనేండ్లుగా!

- పట్టించుకోని నాగర్‌కర్నూల్ జిల్లా రెవెన్యూ అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన తూడుకుర్తివాసి వస్పరి శ్రీశైలం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'నాపేరు వస్పరి శ్రీశైలం. నాగర్‌కర్నూల్ జిల్లా, తూడుకుర్తి గ్రామం. మా నాన్న కుర్విచిన్న బుచ్చయ్యకు సర్వే నెంబర్ 781/4లో రెండెకరాల భూమి ఉన్నది. దీనికి సంబంధించిన 1 బి, ఆర్వోఆర్ సహా అన్ని రెవెన్యూ పత్రాలు సక్రమంగా ఉన్నాయి. 1970 లో మా తాతకు ప్రభుత్వం అసైన్ చేసిన ఈ భూమి మా నాన్నకు వారసత్వంగా సంక్రమించింది. కానీ ఈ భూమిని దాదాపు పదిహేనేండ్ల నుంచి చిన్న బాలపేరు, పెద్ద బాలపేరు అనే వ్యక్తులు అక్రమంగా సాగు చేస్తున్నారు. మా భూమిని ఆక్రమించుకొన్నారంటూ నాన్న రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా వారు న్యాయం చేయలేదు. 2015లో మానాన్న చనిపోయిన తర్వాత ఆ భూమిని నా పేరిట విరాసత్ చేయాలని దరఖాస్తు చేసుకున్నా. కానీ అధికారులు మాత్రం చేయలేదు. 2015లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి న్యాయం చేయాలని విన్నవించుకొన్నా. నాకు న్యాయం చేయాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు. కానీ అధికారులు పట్టించుకోలేదు. కలెక్టర్, మహబూబ్‌నగర్ ల్యాండ్ సర్వే అధికారి, నాగర్‌కర్నూల్ ఆర్వీడో, తాసిల్దార్‌కు అర్జీలు పెట్టుకొన్నా. అప్పటి రెవెన్యూ మంత్రికి కూడా నేరుగా కలిసి సమస్యను చెప్పుకొన్నా. మంత్రి కూడా నాకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యేలను కలిసి నా సమస్య చెప్పుకొన్నా. 2016లో మహబూబ్‌నగర్ ఎస్పీకి భూకబ్జాదారుల నుంచి ప్రమాదం పొంచి ఉన్నదని ఫిర్యాదు చేశాను. ఆయన ఆదేశాలతో స్థానిక పోలీసులు గ్రామానికి వచ్చి విచారించారు. కబ్జాలో ఉన్నవారి సమక్షంలో వీఆర్వో భూ సర్వే కూడా నిర్వహించారు. అయినా నా భూమిని నాకు స్వాధీనపరుచలేదు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా 1వీ ప్రతిలోనూ, ఖాతా నంబర్ 1744లోనూ కుర్వ చిన్న బుచ్చయ్యకు సర్వే నంబర్ 781/4 లో రెండెకరాల భూమి ఉన్నదని అధికారులే చెప్పారు. అప్పుడు, మా అమ్మ పేరుతో భూమి రికార్డుల్లోకి ఎక్కిస్తామన్నారు. అదీ చేయలేదు. మా నాన్న భూమిని ఇతరులకు అమ్మారని అధికారులు చెప్తున్నారు. ఒకవేళ అదే నిజమైతే అసైన్ భూమికి సంబంధించి అమ్మకాలు ఎలా చెల్లుబాటవుతాయి? నేను స్థానికంగా నివాసం ఉండటంలేదు కాబట్టి నా భూమిని కొందరు కబ్జాచేయాలని చూస్తున్నారు. నాకు నలుగురు పిల్లలు. హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నా. ఈ భూమి లేకుంటే మాకు బతుకు లేదు. మాకు న్యాయం చేయాలని వేడుకొంటున్నా.

కాస్తులో లేదు

బాధితుడు చాలాసార్లు రెవెన్యూ అధికారులను కలిసాడు. సీఎంను, కలెక్టర్లను కలిసి ఫిర్యాదు చేస్తుంటాడు. అది అసైన్ భూమి. వాళ్ల తండ్రి ఆ భూమిని వేరే వారికి అమ్ముకున్నాడు. వాళ్లు ఇప్పుడు కాస్తులో ఉన్నారు. అయితే 1 బీ, పహాణీలో పేర్లు శ్రీశైలం తండ్రి పేరిట ఉన్నాయి. ఇది సరికాదని అనుకుంటాను. పాత కాలపు రికార్డులు మారలేదు. కాస్తులో లేకుండా భూమి కావాలని వస్తున్నాడు.

-లక్ష్మీనారాయణ, నాగర్‌కర్నూల్ తాసిల్దార్

లావుణి పట్టా ప్రైవేట్‌గా మార్పు

- తప్పుడు పత్రాలతో సోదరులను మోసంచేసిన రిటైర్డ్ టీచర్
- అధికారుల అండతో రెండెకరాల భూమి తన పేరిట పట్టా
- ఇష్టారాజ్యంగా వ్యవహరించిన రెవెన్యూ సిబ్బంది
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ బాధితుడు

తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన లావుణి పట్టాను.. ఇద్దరు సోదరులను కాదని రెవెన్యూ అధికారులు అక్రమంగా ఒక్కరికే పట్టాచేశారు. అధికారుల అండదండలతో నకిలీ పత్రాలు సృష్టించిన సదరు రిటైర్డ్ టీచర్.. సోదరులను మోసంచేయడమే కాకుండా లావుణి పట్టాను ప్రైవేట్ భూమిగా చూపించాడు. ఫోర్జరీ సంతకాలతో తప్పుడు పత్రాలు సృష్టించి, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పదవీ విరమణచేసిన వ్యక్తిని రికార్డుల్లో వ్యవసాయ కూలీగా చూపించడం.. అలాగే సోదరుల వయసును సగానికి కుదించి చూపడం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ రెవెన్యూ అధికారులకే చెల్లింది. తమను మోసంచేసిన అన్నపై చర్యలు తీసుకొని, న్యాయం చేయాలంటూ బాధితుల్లో ఒకరైన వీసం రాములు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన వీసం నర్సయ్యకు దాదాపు 50 ఏండ్ల కింద సర్వే నంబర్లు 1041/123, 1041/126లలో ఒక్కో ఎకరం చొప్పున.. మొత్తం రెండెకరాల భూమిని ప్రభుత్వం లావుణి పట్టాగా ఇచ్చింది. ఆ భూమిలో సాగుచేసుకొంటూ నర్సయ్య తన కుటుంబాన్ని పోషించుకొన్నారు. నర్సయ్యకు భార్య మహాలక్ష్మమ్మ, కుమారులు సోములు, వెంకటి, రాములు, కుమార్తె లక్ష్మమ్మ ఉన్నారు. 1973లో నర్సయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఆ భూమిని అతని భార్య మహాలక్ష్మమ్మ పేరిట ఖాతా నంబర్ 1357తో రెవెన్యూ అధికారులు లావుణి పట్టా మార్పిడిచేశారు. మహాలక్ష్మమ్మ 2011లో మృతిచెందారు. నర్సయ్య పెద్ద కుమారుడు సోములు బాగా చదువుకొని టీచర్‌గా పనిచేశారు. ఆయన తెలివితేటలను సోదరులను మోసం చేయడంలో చూపించాడు. 2018 మే 9న సోములు.. తాను చనిపోవడానికి సరిగ్గా 18 రోజుల ముందు మిగతా సోదరుల సంతకాలు ఫోర్జరీచేసి అధికారులతో కుమ్మక్కై లావుణి పట్టాను తన ఒక్కడి పేరిటే ఫౌతీ చేయించుకొన్నాడు. అలాగే ఫౌతీ వాంగ్మూలంలో రిటైర్డ్ టీచర్ అని కాకుండా కూలీ అని, వయసు కూడా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మార్పించినట్టు బాధితుడు వీసం రాములు ఆరోపిస్తున్నారు.

ఫోర్జరీ సంతకాలతో మోసంచేశారు

తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన లావుణి పట్టా భూమి రెండెకరాలు.. ఆయన అనంతరం మా తల్లి పేరిట అధికారులు పట్టా మార్పిడిచేశారు. తల్లి చనిపోయిన తర్వాత ఆ రెండెకరాలను మా అన్న ఫోర్జరీ సంతకాలతో, తప్పుడు పత్రాలు సృష్టించి తన పేరిట మార్పించుకొన్నాడు. ఆయన పేరిట 2018 ఏప్రిల్ 21న వచ్చిన పాస్‌పుస్తకంలో సర్వే నంబర్ 1041/126/1లో లావుణి పట్టా భూములు పట్టాగా నమోదుచేశారు. ఆయన చనిపోయిన తర్వాత మా వదిన అన్నపూర్ణ పేరిట 2018 సెప్టెంబర్ 17న పట్టా మార్పిడి జరిగింది. ఈ మొత్తం వ్యవహారంలో కూటికి గతిలేని నాతోపాటు మరో సోదరుడు వెంకటిని నిలువునా ముంచారు. చాలా రోజులుగా అన్ని ఆధారాలతో అధికారులకు విన్నవించుకొంటున్నా ఫలితం లేకుండాపోయింది. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని వారసత్వంగా వచ్చిన లావుణి పట్టా భూమిలో మాకు కూడా వాటా ఇప్పించాలి.

- వీసం రాములు, బాధితుడు

క్లరికల్ తప్పిదమై ఉంటుంది

తప్పు జరిగినట్టు తేలలేదు. క్లరికల్ మిస్టేక్ వల్ల లావుణి పట్టాను ప్రైవేట్ భూమిగా చూపించి ఉంటారు. దానిని మార్చి వేస్తాం. ఫౌతీ గతంలో జరిగింది. నాడు తాసిల్దార్‌గా వేరే వాళ్లు ఉన్నారు. ఆ విషయం నాకు తెలియదు. ఒకవేళ ఏదైనా మోసం జరిగినట్టు అనుమానం ఉంటే ఆర్డీవోకు అప్పీలు చేసుకోవచ్చు.

- సైదులు, తాసిల్దార్, హుజూర్‌నగర్

చరిత్ర సృష్టించిన సహజశ్రీ

మహిళా ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సాధించిన తొలి తెలంగాణ తేజం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: తెలంగాణ యువ చెస్ క్రీడాకారిణి చొల్లేటి సహజశ్రీ అరుదైన ఘనత సాధించింది. రాష్ట్రం నుంచి తొలి మహిళా ఇంటర్నేషనల్ మాస్టర్ (డబ్ల్యూ ఐఎమ్)గా గుర్తింపు సాధించింది. చెక్ రిపబ్లిక్ వేదికగా జరిగిన చెక్ ఓపెన్ చెస్ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబర్చిన ఈ కరీంనగర్ అమ్మాయి మూడో డబ్ల్యూ ఐఎమ్ నార్మ్ సాధించడంతో పాటు మహిళా గ్రాండ్ మాస్టర్ (డబ్ల్యూజీఎమ్) నార్మ్ సంపాదించింది. మన రాష్ట్రం నుంచి ఈ ఘనత సాధించి తొలి క్రీడాకారిణి సహజశ్రీనే కావడం విశేషం. 9 రౌండ్ల పాటు సాగిన ఈ టోర్నీలో 3 గేమ్‌లు నెగ్గిన సహజశ్రీ.. రెండింట ఓడి మరో నాలుగు 'డ్రా'గా ముగించింది. దీంతో 5 పాయింట్లు సాధించిన ఆమె ఐఎమ్‌కు కావాల్సిన మూడో నార్మ్ సాధించింది. ఈ టోర్నీలో ఇద్దరు గ్రాండ్ మాస్టర్ల (జీఎమ్)తో పోటీపడిన సహజశ్రీ చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకుంది. తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకట్‌రామన్‌పై గెలుపొందిన సహజ శ్రీ చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో రష్యా గ్రాండ్‌మాస్టర్ సెర్గీ డొమోగెవ్‌తో 'డ్రా'చేసుకుంది.

పువ్వు పుట్టగానే పరిమళించినట్లు ఏడేళ్ల వయసులోనే పావులు కదపడం నేర్చుకున్న సహజశ్రీ కెరీర్ ఆరంభంలో కరీంనగర్‌లోనే శిక్షణ పొందింది. 2006లో ప్రపంచ అండర్-10 బాలికల చెస్ చాంపియన్‌గా నిలిచిన సహజశ్రీ అదే ఏడాది ఆసియా, కామన్వెల్త్‌లోనూ విజేతగా నిలిచింది. అక్కడి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చిన 23 ఏండ్ల సహజశ్రీ గతేడాది జాతీయ అమెచ్యూర్ చెస్ చాంపియన్‌గా నిలిచింది. ప్రస్తుతం యూరప్ టూర్‌లో నిలకడైన ప్రదర్శనతో డబ్ల్యూఐఎమ్‌గా అవతరించింది. ఈ జోరు ఇలాగే కొనసాగితే.. తెలంగాణ నుంచి తొలి మహిళా గ్రాండ్‌మాస్టర్‌ను చూసే రోజు చాలా దగ్గర్లో ఉన్నట్లే.

భారత రెజ్లింగ్ కోచ్‌గా అశోక్ కుమార్

కరీంనగర్ డీవైఎస్‌ఓకు అరుదైన అవకాశం

కరీంనగర్‌స్పోర్ట్స్: రెజ్లింగ్ క్రీడాకారుడిగా జాతీయ స్థాయిలో ఎన్నో ఘనతలు సాధించిన కరీంనగర్ జిల్లా యువజన క్రీడాశాఖాధికారి డి. అశోక్ కుమార్ భారత జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యాడు. సోఫియా (బల్గేరియా) వేదికగా వచ్చే నెల 4 వరకు జరిగే అంతర్జాతీయ రెజ్లింగ్ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు అశోక్‌కుమార్ శిక్షకుడిగా వ్యవహరించనున్నాడు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రతిరాం తండాకు చెందిన అశోక్ కుమార్ గతంలో కరీంనగర్ క్రీడా పాఠశాలలో రెజ్లింగ్ కోచ్‌గా పనిచేసి ప్రస్తుతం డీవైఎస్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు.

తలైవాస్‌పై పైరెట్స్ పైచేయి

- హోరాహోరీ పోరులో పట్నా విజయం
- ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-7

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో తమిళ్ తలైవాస్ వరుసగా రెండో ఓటమి రుచి చూసింది. తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌పై విజయం సాధించిన తలైవాస్ ఆ తర్వాత దబంగ్ ఢిల్లీ, తాజాగా పట్నా పైరెట్స్ చేతిలో ఓడింది. సోమవారం హోరాహోరీగా సాగిన పోరాటంలో తమిళ్ తలైవాస్ 23-24తో పట్నా పైరెట్స్ చేతిలో ఓడింది. స్టార్ రైడర్ రాహుల్ చౌదరి 14 సార్లు రైడ్ చేసి 5 పాయింట్లు మాత్రమే సాధించడం ఫలితంపై ప్రభావం చూపగా.. రైడింగ్‌లో సేఫ్‌గేమ్ ఆడుతూ.. చక్కటి డిఫెన్స్‌తో తెలివిగా పాయింట్లు సాధించిన పట్నా కీలక సమయాల్లో ఒత్తిడిని అధిగమించి విజయం సాధించింది. రాహుల్‌కు బెస్ట్ రైడర్ అవార్డు దక్కగా.. పట్నా ఆటగాడు జైదీప్ (7 పాయింట్లు)కు బెస్ట్ డిఫెండర్ పురస్కారం లభించింది. పటిష్టమైన జట్లతో బరిలో దిగిన తలైవాస్, పైరెట్స్ మ్యాచ్ ఆరంభం నుంచి హోరాహోరీగా పోరాడటంతో ఆధిక్యం చేతులు మారుతూ వచ్చింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఇరుజట్లు 11-11తో సమంగా నిలిచాయి. ఆరంభంలో ఆచితూచి ఆడిన రాహుల్ చౌదరి చివర్లో సత్తాచాటినా పట్నా పటిష్ట డిఫెన్స్ ముందు నిలువలేకపోయాడు. ముఖ్యంగా పైరెట్స్ తరపున జైదీప్ సూపర్ ట్యాకిల్స్‌తో అదరగొట్టాడు. చివరి వరకు పట్టు సడలించకుండా పోరాడినా.. తలైవాస్ ఆఖరికి ఒక్క పాయింట్ తేడాతో ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌తో రాహుల్ పీకేఎల్ చరిత్రలో 900 రైడ్ పాయింట్ల మైలురాయిని దాటాడు. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 43-23తో పుణేరీ పల్టన్స్‌పై గెలిచింది. లీగ్‌లో మంగళవారం సెలవు రోజు కాగా.. బుధవారం జైపూర్ పింక్ పాంథర్స్‌తో హర్యానా స్టీలర్స్.. యూపీ యోధాతో యు ముంబా తలపడనున్నాయి.

అంతా అబద్ధం..

విభేదాలన్నీ కొందరి సృష్టే.. హిట్‌మ్యాన్‌ను బహిరంగంగానే ఎన్నోసార్లు కీర్తించా

రవిశాస్త్రి కోచ్‌గా కొనసాగితే సంతోషం.. టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ

రోహిత్, నేను కలిసే ఉన్నాం..

రోహిత్ శర్మతో తనకు ఎలాంటి విభేదాలు లేవని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ స్పష్టం చేశాడు. వివాదమంతా కొందరి సృష్టేనంటూ అసహనం వ్యక్తం చేశాడు. రోహిత్‌తో మనస్పర్ధలు, కోచ్ ఎంపిక, ఆటగాళ్లకు అవకాశాలు సహా మరిన్ని విషయాలపై విండీస్ పర్యటనకు వెళ్లే ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో విరాట్ మాట్లాడాడు. కోచ్‌గా రవిశాస్త్రి కొనసాగితే సంతోషమని మనసులో మాట బయటపెట్టాడు. టెస్టులకు రోహిత్‌ను తీసుకోవడంపైనా సమాధానమిచ్చాడు. వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామన్నాడు.

ముంబై: వన్డే జట్టు వైస్ కెప్టెన్ రోహిత్‌శర్మతో తనకు విభేదాలు ఉన్నాయని, ఇద్దరి మధ్య దూరం అగాధంలా పెరిగిపోయిందని వస్తున్న వాదనలపై టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అవన్నీ పూర్తి అవాస్తవాలని, అలాంటి వాటిని చదవాల్సి, వినాల్సి రావడం బాధాకరమని అసహనం వ్యక్తం చేశాడు. వచ్చే నెల 3న ప్రారంభమయ్యే విండీస్ పర్యటన కోసం బయలుదేరే ముందు ప్రధాన కోచ్ రవిశాస్త్రితో కలిసి సోమవారమిక్కడ నిర్వహించిన మీడియా సమావేశంలో కోహ్లీ మాట్లాడాడు. రోహిత్ గొప్ప ఆటగాడని, ఇద్దరం ఎంతో సఖ్యతగా ఉన్నామని స్పష్టం చేశాడు. అలాగే కోచ్ ఎంపిక, జట్టు ప్రణాళిక, భవిష్యత్తులో అనుసరించే వ్యూహాలు తదితర అంశాలపై మాట్లాడాడు.

అన్నీ అబద్ధాలు, ఊహాగానాలు

రోహిత్ శర్మతో విభేదాల గురించి వస్తున్న వార్తలపై కెప్టెన్ కోహ్లీ ఘాటుగానే స్పందించాడు. ఎవరో అబద్ధాలను సృష్టిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు. అయినా, అలాంటి వార్తలను చదవాల్సి రావడం ఘోరం. నేను రోహిత్‌శర్మను బహిరంగంగానే ఎన్నోసార్లు కీర్తించాను. అయినా విభేదాలంటూ ఊహాగానాలు, అబద్ధాలు ఎవరు సృష్టిస్తున్నారో, దీనివల్ల ఎవరు లాభపడుతున్నారో అర్థం కావడం లేదు. జట్టులో వాతావరణం అంతా సవ్యంగా ఉంది'అని కోహ్లీ వెల్లడించాడు.

యువ ఆటగాళ్లకు మంచి అవకాశం

దీపక్ చహర్, రాహుల్ చహర్, నవ్‌దీప్ సైనీ సహా ఇతర యువ ఆటగాళ్లకు విండీస్ పర్యటన మంచి అవకాశమని కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. వన్డే, టెస్టు జట్లు ఎంతో సమతూకంతో ఉన్నాయని, కొత్త ఆటగాళ్లు వచ్చినందున టీ20 సిరీస్ కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నానని చెప్పాడు. వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌పై దృష్టి సారించామని, అలాగే టెస్టు చాంపియన్‌షిప్ కోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని వెల్లడించాడు.

విశ్రాంతిపై సమాచారమివ్వలేదు

విండీస్ పర్యటనలో పరిమిత ఓవర్ల క్రికెట్‌కు విశ్రాంతి తీసుకోవాలని కోహ్లీ ముందు భావించాడని, తదుపరి పరిణామాలతో విరమించుకున్నట్టు వచ్చిన వార్తలపైనా స్పందించాడు. 'నేను విశ్రాంతి తీసుకోవాలని ఫిజియో సహా ఎవరూ చెప్పలేదు, సలహా ఇవ్వలేదు. సెలక్టర్లకు ఏం సమాచారమిచ్చారో తెలీదు. అత్యుత్తమ టాపార్డర్ ఉన్నప్పుడు నిరూపించుకునేందుకు మిడిల్‌ఆర్డర్‌కు తక్కువగా అవకాశాలు వస్తాయి. ప్రస్తుతం అదే జరుగుతున్నది. చక్‌ప సెమీస్‌లో ఓటమి తమను నిరాశ పరిచిందని, దాన్ని మరిచిపోయి మరింత మంచి ప్రదర్శన చేస్తామని దీమా వ్యక్తం చేశాడు. రోహిత్ శర్మ అద్భుత ఫాంలో ఉన్నందున విండీస్‌తో టెస్టు సిరీస్ కోసం అతడిని తీసుకున్నట్టు విరాట్ చెప్పాడు. రహానే స్థిరమైన ఆట గాడని, భారీస్కోర్లు చేయడం సహా స్లిప్ ఫీల్డింగ్‌లో అతడు రాణించగలడని పేర్కొన్నాడు.

విమానమెక్కారు

విండీస్‌తో తొలి రెండు టీ20 మ్యాచ్‌లు జరిగే అమెరికాలోని ఫ్లోరిడాకు ముంబై విమానాశ్రయం నుంచి టీమ్‌ఇండియా ఆటగాళ్లు, తర్వాత విండీస్ వేదికగా మూడో మ్యాచ్ సహా మూడు వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌లను ఆతిథ్య దేశంతో భారత్ ఆడనుంది. వచ్చే నెల 3న ప్రారంభమయ్యే ఈ పర్యటన సెప్టెంబర్ 3తో ముగుస్తుంది.

ఆత్రుతగా ఎదురుచూస్తున్నా

టెస్ట్ క్రికెట్‌కు ఆదరణ తగ్గుతున్న తరుణంలో సుదీర్ఘ ఫార్మాట్‌ను ఆసక్తికరంగా మార్చేందుకు ఐసీసీ తీసుకొచ్చిన ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఆగస్టు 1నుంచి యాషెస్ సిరీస్‌తో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో టెస్టు చాంపియన్‌షిప్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్లు టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వెల్లడించాడు. 'మేమంతా ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాం. ఈ ప్రయోగం టెస్టు క్రికెట్‌కు నిజమైన అర్థాన్ని జోడిస్తుంది. సుదీర్ఘ ఫార్మాట్ ఆడడం సవాలుతో కూడుకున్నది. అలాంటిది చాంపియన్‌షిప్‌లో అగ్రస్థానాన నిలవడం ఎంతో సంతృప్తినిస్తుంది. టెస్టుల్లో భారత జట్టు బాగా రాణిస్తున్నది. చాంపియన్‌షిప్ గెలిచేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి'అని కోహ్లీ పేర్కొన్నాడు.

నా ముఖంలో కనబడదా..?

'నేను అభద్రతా భావంలో ఉంటే అది నా ముఖంలో కనబడిపోతుంది. దాన్ని గుర్తించడం చాలా సులువు. నేను, రోహిత్ కలిసి భారత క్రికెట్‌ను అత్యుత్తమ స్థాయిలో ఉంచేందుకు ఎంతో కష్టపడుతున్నాం. ప్రస్తుతం జట్టులో వాతావరణం చాలా బాగుంది. ఇలాంటి తరుణంలో ఏమీ తెలియని వారు బయట నుంచి ఊహాగానాలు సృష్టిస్తున్నారు. ఆట నుంచి మా దృష్టిని మరల్చేందుకు ప్రయత్నిస్తున్నారు. వివాదాలపై కాకుండా క్రికెట్‌పై దృష్టి పెట్టాల్సిన సమయమిది'అని కోహ్లీ అన్నాడు. ఇన్‌స్టాగ్రామ్ అన్‌ఫాలోల ఆధారంగా కొందరు చేసిన వాదనలపైనా విరాట్ అసహనం వ్యక్తం చేశాడు. వ్యక్తిగత విషయాలను బయటకు తెస్తున్నారని, ఇది తమను అగౌరవపరచడమేనని అన్నాడు. రోహిత్, తాను దశాబ్దం నుంచి కలిసి ఆడుతున్నామని, ఎప్పుడూ కలిసే ఉన్నామని పునరుద్ఘాటించాడు. తాము టెస్టు ర్యాంకింగ్స్‌లో ఏడు నుంచి అగ్రస్థానానికి వచ్చామని, జట్టులో మనస్పర్ధలు ఉంటే ఇది సాధ్యమవుతుందా అని ఎదురు ప్రశ్నించాడు.

అయితే నిలకడైన బ్యాట్స్‌మెన్‌ను గుర్తించాల్సిన అవసరం ఉంది. బాగా ఆడతారనుకున్న వారికి అవసరమైన అవకాశాలు ఇవ్వాలని అనుకుంటున్నాం'అని కోహ్లీ చెప్పాడు. ప్రపంచబ్బంది బయలుదేరారు. ఈ ఫొటోలను కోహ్లీ ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు. అమెరికాలోని మియామీకి చేరుకొని, అక్కడి నుంచి ఫ్లోరిడాకు వెళ్లనున్నారు. అక్కడ రెండు టీ20ల

రవిభాయ్ ఉంటే సంతోషమే..

ఓ వైపు బీసీసీఐ, క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ) టీమ్‌ఇండియా కోచ్ ఎంపిక ప్రక్రియను కొనసాగిస్తుండగా తన మనసులో మాటను విరాట్ కోహ్లీ బయటపెట్టాడు. 'జట్టు ప్రధాన కోచ్‌గా రవి భాయ్‌ను కొనసాగిస్తే కచ్చితంగా సంతోషిస్తాం. జట్టులోని అందరితో ఆయనకు మంచి అనుబంధం ఉంది. కోచ్ ఎంపిక విషయంపై సీఏసీ నన్ను సంప్రదించలేదు'అని కోహ్లీ చెప్పాడు. క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ నేతృత్వంలోని సీఏసీ కోచ్‌ను ఎంపిక చేయనుంది. ప్రధాన కోచ్ సహా బ్యాటింగ్, బౌలింగ్ కోచ్, సహాయ సిబ్బంది కోసం బీసీసీఐ దరఖాస్తులు ఆహ్వానించి, తుది గడువును ఈ నెల 30గా నిర్ణయించిన విషయం తెలిసిందే.

ధోనీకి కాట్రెల్ సెల్యూట్

న్యూఢిల్లీ: ఇటీవల ముగిసిన ఐసీసీ వన్డే ప్రపంచ కప్‌లో వికెట్ తీసిన ప్రతిసారీ సెల్యూట్ చేస్తూ సంబురాలు జరుపుకొని సందడి చేసిన వెస్టిండీస్ పేసర్ షెల్డన్ కాట్రెల్ భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీపై ప్రశంసలు కురిపించాడు. ధోనీ గొప్ప దేశభక్తుడని కొనియాడాడు. 'అతడు (ధోనీ) మైదానంలో ఎంతో స్ఫూర్తినిస్తాడు. అంతే కాదు గొప్ప దేశభక్తుడు కూడా. దేశానికి సేవ చేయాలనే అతడి అంకిత భావం అద్వితీయం. ఈ వీడియో ఎందుకు షేర్ చేస్తున్నానంటే.. అటువంటి క్షణాలను నేను ఎంతో గర్విస్తాను. జీవిత భాగస్వామి, దేశంపై ధోనీకి ఉన్న ప్రేమ చాలా గొప్పది'అని గతేడాది మహీ పద్మ భూషణ్ అందుకుంటున్న సమయంలోని వీడియోను కాట్రెల్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు. ప్రపంచకప్ అనంతరం రెండు నెలలు క్రికెట్ నుంచి విరామం తీసుకున్న మహీ ప్రస్తుతం టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్ట్‌నెంట్ కల్నల్‌గా కశ్మీర్ లోయలో సేవలందిస్తున్న విషయం తెలిసిందే. 106వ బెటాలియన్‌తో కలిసి నడుస్తున్న ధోనీ ఆగస్టు 15 వరకు అక్కడే ఉండే అవకాశాలున్నాయి. ఇకపోతే.. కాట్రెల్ కూడా గతంలో వెస్టిండీస్ సైన్యంలో పనిచేశాడు. ఆ తర్వాత ఆటపై దృష్టిపెట్టి సైన్యం నుంచి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు.

అండర్సన్ కీలకం

మెక్‌గ్రాత్

లండన్: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ సీనియర్ పేసర్ జేమ్స్ అండర్సన్ కీలక పాత్ర పోషిస్తాడని ఆస్ట్రేలియా పేస్ దిగ్గజం గ్లెన్ మెక్‌గ్రాత్ అభిప్రాయపడ్డాడు. 'సొంతగడ్డపై డ్యూక్ బాల్‌తో అండర్సన్ అత్యంత ప్రమాదకారి. అలాంటి పరిస్థితుల్లో బౌలింగ్ చేయడంలో అతడు ప్రపంచంలోనే మేటి. ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియా పైచేయి సాధించాలంటే మొదట అండర్సన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సి ఉంటుంది. అదే ఫలితంపై ప్రభావం చూపుతుంది' అని మెక్‌గ్రాత్ అన్నాడు.

బ్యాటింగ్ కోచ్ బరిలో ప్రవీణ్ ఆమ్రే

ముంబై: భారత మాజీ బ్యాట్స్‌మన్ ప్రవీణ్ ఆమ్రే టీమ్‌ఇండియా బ్యాటింగ్ కోచ్ పదవికి దరఖాస్తు చేసుకున్నాడు. 2014 నుంచి బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న సంజయ్ బంగార్‌తో పాటు శిక్షణ సిబ్బంది కాలపరిమితి వన్డే ప్రపంచకప్‌తోనే ముగిసినా.. వచ్చే నెల 3 నుంచి ప్రారంభమయ్యే వెస్టిండీస్ పర్యటన ముగిసే వరకు పాత బృందం గడువును పొడిగిస్తూ బీసీసీఐ ఉత్తర్వులు జారీచేసింది. 50 ఏండ్ల ప్రవీణ్ భారత్ తరపున 11 టెస్టులు, 37 వన్డేలు ఆడాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ చిన్ననాటి గురువైన రమాకాంత్ అచ్రేకర్ వద్దే ఆటలో ఓనమాలు నేర్చుకున్న ఆమ్రే ప్రస్తుతం ఐపీఎల్లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీతో కలిసి పనిచేస్తున్నాడు. ఈ పదవికి దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం చివరి రోజు కాగా.. ఇప్పటివరకు కేవలం ప్రవీణ్ మాత్రమే ఆసక్తి చూపడంతో అతడికే దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి

ఈసారైనా..

సైనా

- టైటిలే లక్ష్యంగా బరిలోకి భారత షట్లర్లు
- నేటి నుంచి థాయ్‌లాండ్ ఓపెన్
- ఏడో సీడ్‌గా బరిలోకి దిగనున్న సైనా నెహ్వాల్

సీజన్‌లో తొలి టైటిల్ కోసం పట్టువదలని విక్రమార్కుల్లా పోరాడుతున్న భారత షట్లర్లు మరోసారి వేటకు సన్నద్ధమయ్యారు. నేటి నుంచి ప్రారంభమయ్యే థాయ్‌లాండ్ ఓపెన్‌లో బరిలోకి దిగనున్నారు. గాయం కారణంగా ఇటీవలి టోర్నమెంట్లకు దూరమైన స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్.. ఏడో సీడ్‌గా బరిలో ఉండనుంది. పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్, కిడాంబి శ్రీకాంత్ టైటిల్‌పై కన్నేశారు. పురుషుల డబుల్స్ తొలిరౌండ్‌లో భారత జోడీలు పరస్పరం తలడనున్నాయి.

బ్యాంకాక్: ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఒక్క టైటిల్ కూడా సాధించని భారత షట్లర్లు మరోటోర్నీకి సిద్ధమయ్యారు. మంగళవారం ఇక్కడ ప్రారంభం కానున్న థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ సూపర్ -500టోర్నీలో టైటిల్ వేటను ప్రారంభించనున్నారు. గాయం కారణంగా ఇండోనేషియా, జపాన్ ఓపెన్ టోర్నీలకు దూరమైన భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ఏడో సీడ్‌గా బరిలోకి దిగుతున్నది. టైటిల్ గెలిచి.. వచ్చే నెల జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగాలని సైనా పట్టుదలగా ఉంది. అయితే మరో స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు చివరి నిమిషంలో టోర్నీ నుంచి వైదొలిగింది. వరల్డ్ చాంపియన్‌షిప్‌పై మరింత దృష్టి పెట్టేందుకు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

శ్రీకాంత్ పుంజుకునేనా..

భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఐదో సీడ్‌గా థాయ్‌లాండ్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో పోరాటాన్ని ప్రారంభించనున్నాడు. జపాన్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే పరాజయం పాలై తీవ్రంగా నిరాశ పరిచినా.. అతడిపై అంచనాలు భారీగానే ఉన్నాయి. కెనడా ఓపెన్‌లో ఫైనల్ వరకు చేరి టైటిల్‌ను చేజార్చుకున్న హైదరాబాదీ షట్లర్ పారుపల్లి కశ్యప్.. మొదటి రౌండ్‌లో మిషా జిల్‌బెర్‌మాన్(ఇజ్రాయెల్)తో తలపడనున్నాడు. జపాన్ ఓపెన్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి సెమీఫైనల్ వరకు చేరిన సాయి ప్రణీత్... వాగ్పోరోయిన్(థాయ్‌లాండ్)తో పోటీ పడనున్నాడు. జపాన్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లో శ్రీకాంత్‌ను ఓడించిన హెచ్‌ఎస్ ప్రణయ్ కీ విన్సెంట్(హాంకాంగ్)ను ఢీకొంటాడు. ఇక ఎనిమిదో సీడ్ సమీర్‌వర్మ... లీ జీ జియా (మలేషియా)తో, శుభంకర్ డే... టాప్ సీడ్ కెంటో మొమోటా(జపాన్)తో తొలి రౌండ్‌లో తలపడనున్నారు.

అంజుమ్ మౌద్గిల్ ప్రపంచ రికార్డు

న్యూఢిల్లీ: భారత యువ షూటర్ అంజుమ్ మౌద్గిల్ ప్రపంచ రికార్డు ప్రదర్శనతో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణ పతకం సాధించింది. సర్దార్ సింగ్ సేథి స్మారక షూటింగ్ పోటీల్లో పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అంజుమ్ 253.9 పాయింట్లు స్కోర్ చేసి పసిడి పతకం చేజిక్కించుకుంది. భారత్‌కే చెందిన ప్రపంచ నంబర్ వన్ అపూర్వి చండేలా (252.9 పాయింట్లు) పేరిట ఉన్న వరల్డ్ రికార్డును అంజుమ్ తన పేరిట లిఖించుకుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మెహూలీ ఘోష్ (252.2 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. ప్రస్తుతం ప్రపంచ ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్న అంజుమ్ గతంలోనే టోక్యో (2020) ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే.

యువ భారత జట్టులో తిలక్ వర్మ

న్యూఢిల్లీ: యూత్ ఆసియా కప్‌లో తెలంగాణ యువ బ్యాట్స్‌మన్ ఠాకూర్ తిలక్ వర్మ భారత అండర్-19 జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. సెప్టెంబర్ 3 నుంచి శ్రీలంక వేదికగా జరిగే ఈ టోర్నీ కోసం 15 మందితో కూడిన జట్టును ఆలిండియా జూనియర్ సెలెక్షన్ కమిటీ సోమవారం ప్రకటించింది.

ఆసీస్‌లో కసి తగ్గలేదు

కమిన్స్

లండన్: బాల్ ట్యాంపరింగ్ ఉదంతం అనంతరం టిమ్ పైన్ ఆస్ట్రేలియా కెప్టెన్‌గా ఎంపికైనప్పటి నుంచి జట్టులో చాలా మార్పులు వచ్చినా.. గెలుపులన్న కసి మాత్రం తగ్గలేదని ఆ జట్టు పేసర్ ప్యాట్ కమిన్స్ పేర్కొన్నాడు. టెస్టు ఆటగాడికి యాషెస్ కంటే పెద్ద సమరం మరొకటి ఉండదని.. అలాంటి ప్రతిష్ఠాత్మక సిరీస్‌లో సత్తాచాటాలని ప్రతీఒక్కరు కలలు కంటారు అని కమిన్స్ పేర్కొన్నాడు. 'ఇటీవల ఆస్ట్రేలియా జట్టులో మార్పులు వచ్చినా.. విజయం సాధించాలనే పట్టుదల ఏమాత్రం తగ్గలేదు. ఒక టెస్టు ప్లేయర్‌కు యాషెస్‌ను మించిన గొప్ప సిరీస్ మరొకటి ఉండదు. మా జట్టులో చాలా మందికి ఇదే తొలి యాషెస్. వారంతా సత్తాచాటేందుకు ఎదురు చూస్తున్నారు. ఇంగ్లండ్ పరిస్థితులను ఆకలింపు చేసుకోవడం ప్రధానం. డ్యూక్ బాల్స్ ఎక్కువ స్వింగ్ అయ్యే అవకాశాలు ఉంటాయి. అది దృష్టిలో పెట్టుకొని మన బలాలపైనే దృష్టి పెడితే ఫలితాలు మెరుగ్గా వస్తాయి'అని కమిన్స్ వివరించాడు. ఏడాది కాలంగా టెస్టుల్లో ఇంటా బయటా పరాజయాలు చవిచూస్తున్న ఆస్ట్రేలియా గురువారం నుంచి ఇంగ్లండ్ వేదికగా ప్రారంభం కానున్న యాషెస్ సిరీస్‌ను చేజిక్కించుకోవాలని తహతహలాడుతున్నది.

సెన్సెక్స్	నిఫ్టీ
37,686	11,189
↘ 196	↘ 95

ముడి చమురు (బ్రెంట్) ↗ 63.56 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ (రూ.లలో)

24 క్యారెట్లు	35,720
22 క్యారెట్లు	35,550
వెండి (కిలో)	41,900

విదేశీ మారకం (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	66.10	71.60
యూరో	73.30	79.80
బహ్రెయిన్ దినార్	173.50	187.50
కువైట్ దినార్	217.00	229.00
సౌదీ రియాల్	17.30	19.10
యూఏఈ దిర్హామ్	17.80	19.50

ఇకపై ఏడు రోజులే!

న్యూఢిల్లీ, జూలై 29: మొబైల్ వినియోగదారులకు ఎయిర్‌టెల్ షాకిచ్చింది. కనీస రిచార్జ్ గడువు తీరిన ఏడు రోజులకే ఇన్‌కమింగ్ కాల్స్ కట్ అయిపోతాయి మరి. ప్రస్తుతం ఇది 15 రోజులుండగా, ఇకపై వారం రోజులకు కుదించినట్లు టెలికం టాక్ సమాచారం. వినియోగదారుల నుంచి వచ్చే సగటు ఆదాయాన్ని (ఏఆర్‌పీయూ) పెంచుకునేందుకే ఎయిర్‌టెల్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది.

రెడ్డీస్ లాభం 663 కోట్లు

- క్యూ1లో 45 శాతం పెరిగిన ప్రాఫిట్
- దన్నుగా నిలిచిన ఇతర ఆదాయం

హైదరాబాద్, జూలై 29:

హైదరాబాద్ కేంద్రస్థానంగా ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ అంచనాల కుమించి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలల కాలానికి కంపెనీ రూ.662.80 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. 2018-19 ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.456.10 కోట్లతో పోలిస్తే 45.31 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ. 3,720.70 కోట్ల నుంచి రూ.3,843.50 కోట్లకు ఎగబాకింది. సెల్జిన్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా రూ.346 కోట్ల నిధులు అధికంగా సమకూరడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని రెడ్డీస్ ప్రెసిడెంట్, సీఎఫ్‌వో సౌమెన్ చక్రవర్తి తెలిపారు. ఆదాయంలో వృద్ధి 3 శాతమే అయినప్పటికీ ఇతర మార్గాల ద్వారా వచ్చిన ఆదాయం లాభాలకు దన్నుగా నిలిచాయని ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. కంపెనీకి చెందిన క్యాన్సర్ వ్యాధిని నయం చేసే రెవ్లిమిడ్ క్యాప్సుల్‌ను అమెరికాకు చెందిన బయోటెక్నాలజీ కంపెనీ సెల్జిన్ చట్ట వ్యతిరేకంగా కాఫీ కొట్టడంతో సంస్థ అక్కడి న్యాయస్థానాన్ని ఆర్జించింది. దీంతో అబ్రివేటెడ్ నూతన డ్రగ్గ్ సబ్‌మిషన్(ఏఎన్‌డీఎస్)కు సంబంధించి ఒప్పందం ప్రకారం ఆ సంస్థ రూ.346 కోట్ల నిధులను చెల్లించింది. పరిశోధన రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి గత త్రైమాసికంలో రూ.361 కోట్ల నిధులను ఖర్చు చేసిన సంస్థ..ఈ ఏడాది మొత్తానికి వెయ్యి కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేయాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఇతర అవసరాల నిమిత్తం రూ.100 కోట్ల నిధులను వెచ్చించింది.

ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ రెడ్డీస్ కో-చైర్మన్, సీఈవో జీవీ ప్రసాద్, సీఎఫ్‌వో సౌమెన్ చక్రవర్తి, సీవోవో ఎరాజ్ ఇజ్రాయెలీ

జనరిక్ ఔషధాల నుంచి రూ.3 వేల కోట్లు

గత త్రైమాసికంలో అంతర్జాతీయంగా జనరిక్ ఔషధాలను విక్రయించడం ద్వారా రూ. 3,300 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది సంస్థ. వీటిలో అత్యధికంగా ఉత్తర అమెరికా నుంచి రూ.1,632 కోట్లు సమకూరగా, భారత్ నుంచి రూ.696 కోట్లు, అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి రూ.729 కోట్లు, యూరప్ నుంచి రూ.240.40 కోట్లు లభించాయి. కానీ ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ అండ్ యాక్టివ్ ఇంగ్రియెంట్స్ నుంచి మాత్రం కంపెనీకి వచ్చే ఆదాయంలో 16 శాతం తగ్గి రూ.453 కోట్లకు పడిపోయింది. గత త్రైమాసికంలో సంస్థ భారత్‌లో 8 ఔషధాలను ప్రవేశపెట్టగా, అదే ఉత్తర అమెరికాలో 5, ఇతర దేశాల్లో మరో పదింటిని విడుదల చేసింది. అమెరికా మార్కెట్లోకి ప్రవేశించడానికి 107 జనరిక్ ఔషధాలను అక్కడి నియంత్రణ మండలి అనుమతించలేదు. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 1.92 శాతం క్షీణించి రూ. 2,652.55 వద్ద ముగిసింది.

ఇతర సంస్థలపై దృష్టి

అప్పులు లేని సంస్థగా అవతరించిన రెడ్డీస్..ఇతర కంపెనీలను కొనుగోలు చేయడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఔషధ మార్కెట్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి భవిష్యత్తులో ఇతర సంస్థలను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు రెడ్డీస్ సీఈవో, కో-చైర్మన్ జీవీ ప్రసాద్ తెలిపారు. భారత్‌తోపాటు ఉత్తర అమెరికా, యూరప్, రష్యాలతోపాటు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉన్న కంపెనీలను కొనుగోలు చేయడానికి ఎంతైన నిధులు వెచ్చించడానికి సిద్ధమని ఆయన ప్రకటించారు.

కంపెనీ సీఈవోగా ఎరాజ్ ఇజ్రాయెలీ

ప్రస్తుతం రెడ్డీస్ చీఫ్ ఆపరేటింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎరాజ్ ఇజ్రాయెలీకి సంస్థ పదోన్నతి కల్పించింది. వచ్చే నెల 1 నుంచి ఆయన కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ప్రమోట్ అయ్యారు. ప్రస్తుతం సీఈవోగా వ్యవహరిస్తున్న జీవీ ప్రసాద్..ఇకనుంచి కో-చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు. కంపెనీలో జరుగుతున్న అన్ని విషయాలు ఎరాజ్..ప్రసాద్‌కు సమర్పించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 2018లో సీవోవోగా చేరిన ఎరాజ్.. కంపెనీ మెరుగైన వృద్ధిలో కీలకపాత్ర పోషించారు. ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి, వ్యాపారాన్ని ఇతర దేశాలకు విస్తరించడంలో ఆయన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

అత్యుత్తమ సీఈవోల్లో అంబానీ

- సీఈవోవరల్డ్ మ్యాగజైన్ గ్లోబల్ ర్యాంకుల్లో 10 మంది భారతీయ సంస్థల సారథులు
- మూడో స్థానంలో లక్ష్మీ మిట్టల్

న్యూఢిల్లీ, జూలై 29: దేశీయ అపర కుబేరుడు ముకేశ్ అంబానీ.. ప్రపంచ అత్యుత్తమ సీఈవోల్లో ఒకరిగా ఉన్నారు. ఈ ఏడాదికిగాను సీఈవో వరల్డ్ మ్యాగజైన్.. ప్రపంచంలోని అత్యంత ప్రభావవంత సీఈవోల జాబితాను తాజాగా విడుదల చేసింది. ఇందులో భారతీయ సంస్థలకు చెందిన 10 మంది సారథులకు చోటు దక్కగా, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ ముకేశ్ అంబానీ 49వ స్థానంలో నిలిచారు. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) చైర్మన్ సంజీవ్ సింగ్ 69వ స్థానంలో, ఓఎన్జీసీ చైర్మన్, ఎండీ శశి శంకర్ 77వ స్థానంలో ఉన్నారు. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న మరికొందరు భారతీయ సంస్థల అధిపతుల్లో ఎస్బీఐ చైర్మన్ రజ్నీశ్ కుమార్ (83వ స్థానం), టాటా మోటార్స్ సీఈవో గ్యుంటర్ బుషెక్ (89), బీపీసీఎల్ చైర్మన్, ఎండీ డీ రాజ్‌కుమార్ (94), రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాజేశ్ మెహెతా (99), టీసీఎస్ సీఈవో రాజేశ్ గోపీనాథన్, విప్రో సీఈవో అబిదాలీ నీముచ్‌వాలా(118వ స్థానాల్లో)లు ఉన్నారు. ఇక గ్లోబల్ ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ చైర్మన్, సీఈవో లక్ష్మీ నివాస్ మిట్టల్ భారత సంతతి సీఈవోల్లో అగ్రస్థానంలో నిలిచారు. అయితే ఆయన సంస్థను లగ్జెంబర్గ్ ఆధారిత సంస్థగా మ్యాగజైన్ పేర్కొన్నది. ఇదిలావుంటే ఈ జాబితాలో వాల్‌మార్ట్ సీఈవో డౌగ్లస్ మెక్‌మిలన్ ప్రథమ స్థానంలో నిలిచారు. రాయల్ డచ్ షెల్ గ్లోబల్ చీఫ్ బెన్ వాన్ బర్డెన్ రెండో స్థానంలో, లక్ష్మీ మిట్టల్ మూడో స్థానంలో ఉన్నారు. సౌదీ ఆరోమ్కో సీఈవో అమిన్ హెచ్ నజీర్ నాల్గవ స్థానంలో, బ్రిటీష్ పెట్రోలియం చీఫ్ బాబ్ డూడ్లే అయిదో స్థానంలో నిలిచారు. తర్వాతి ఐదు స్థానాల్లో వరుసగా ఎక్సాన్ మొబిల్ సీఈవో డారెన్ వుడ్స్, ఫోక్స్‌వాగన్ సీఈవో హెర్బర్ట్ డైస్, టయోటా సీఈవో అకియో టయోడా, యాపిల్ సీఈవో టిమ్ కుక్, బెర్క్‌షైర్ హాథవే సీఈవో వారెన్ బఫెట్ ఉన్నారు. ప్రపంచ కుబేరుడు, అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్ 11వ స్థానంలో, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ సీఈవో కిమ్ కీ-నామ్ 13వ స్థానంలో ఉండటం గమనార్హం. మొత్తం 121 మందితో ఈ జాబితా విడుదలవగా, 96 దేశాలకు చెందిన 1,200లకు పైగా సంస్థల సీఈవోల పనితీరు, జీతభత్యాలను ప్రామాణికంగా తీసుకున్నది సీఈవోవరల్డ్ మ్యాగజైన్.

ఎస్బీఐ డిపాజిట్లపై వడ్డీరేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 29: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) తాజాగా ఎంపిక చేసిన టర్మ్ డిపాజిట్ల వడ్డీరేట్లలో కోత విధించింది. 179 రోజులలోపు కాలపరిమితి కలిగిన రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీ రేటును 50 బేసిస్ పాయింట్ల నుంచి 75 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించినట్లు సోమవారం బ్యాంక్ ప్రకటించింది. దీర్ఘకాలిక కాలపరిమితి కలిగిన రిటైల్ డిపాజిట్లపై 20 బేసిస్ పాయింట్లు తగ్గించిన బ్యాంక్..బల్క్ డిపాజిట్లపై వడ్డీని 35 బేసిస్ పాయింట్లు కోత విధించింది. ఈ నూతన రేట్లు ఆగస్టు 1 నుంచి అమలులోకి రానున్నాయి. వీటిలో 7 రోజుల నుంచి 45 రోజుల లోపు డిపాజిట్లపై 75 బేసిస్ పాయింట్లు తగ్గించిన బ్యాంక్ ..రెండేండ్ల నుంచి మూడేండ్ల లోపు డిపాజిట్లపై 5 బేసిస్ పాయింట్లు కోత విధించింది. దీంతో వడ్డీరేటు 6.25 శాతం నుంచి 5.75 శాతానికి తగ్గనున్నది.

5 వేల హోండా కార్ల రీకాల్

న్యూఢిల్లీ, జూలై 29: కార్ల తయారీ సంస్థ హోండా..5 వేల యూనిట్ల కార్లను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. జాజ్, సిటీ, సీఆర్-వీ, సివిక్, అకార్డ్‌లకు చెందిన 5,088 యూనిట్లలో ఎయిర్‌బ్యాగ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రీకాల్ చేయాలని నిర్ణయించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. పరిశీలనలో భాగంగా తకాటా డ్రైవర్, ముందుభాగంలో ప్యాసింజర్ వైపు ఉండే ఎయిర్‌బ్యాగ్‌లు సమస్యలు గుర్తించినట్లు, వీటిని దేశవ్యాప్తంగా ఉన్న డీలర్ల వద్ద ఉచితంగా రీప్లేస్ చేసి ఇవ్వనున్నట్లు తెలిపింది. వీటిలో 2007 నుంచి 2013 మధ్యకాలంలో తయారైన 2,099 యూనిట్ల సిటీ సెడాన్ కార్లు ఉండగా, 2003 నుంచి 2008 లోపు 2,577 యూనిట్ల సీఆర్-వీ కార్లు, 2003లో ఉత్పత్తైన 350 యూనిట్ల అకార్డ్, 52 యూనిట్ల సివిక్ సెడాన్, 10 జాజ్ కార్లు ఉన్నాయి.

జెట్‌లో నిధుల గోల్‌మాల్?

న్యూఢిల్లీ, జూలై 29: జెట్ ఎయిర్‌వేస్ రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్స్ (ఆర్‌పీటీలు)పై తీవ్ర నేరాల దర్యాప్తు కార్యాలయం (ఎస్ఎఫ్ఐవో) దృష్టి సారించింది. ఆర్‌పీటీల ద్వారా జెట్ యాజమాన్యం నిధుల మళ్లింపునకు పాల్పడిందన్న అనుమానాలను ఎస్ఎఫ్ఐవో వ్యక్తం చేస్తున్నది. ఈ క్రమంలోనే జెట్ ఎయిర్‌వేస్, దాని వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్ మధ్య జరిగిన ఆర్‌పీటీలనూ ఎస్ఎఫ్ఐవో దర్యాప్తు చేసే వీలున్నది. గోయల్ సంస్థ.. జెట్ ఎయిర్‌వేస్‌లోని వివిధ విభాగాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు థర్డ్ పార్టీ ట్రాన్సక్షన్స్ (టీపీటీలు)పైనా ఎస్ఎఫ్ఐవో విచారణ చేపట్టవచ్చు. మార్కెట్ విలువ కంటే ఇవి ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జెట్‌పై నిర్వహించిన తమ ప్రాథమిక దర్యాప్తులో నిధుల మళ్లింపును గుర్తించింది.

పెట్టుబడులకు తెలంగాణ భేష్

- హైదరాబాద్‌లో మానవ వనరులు పుష్కలం
- ప్రముఖ ఆర్థికవేత్త జగదీశ్ సేథ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సేవా రంగంలో హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా మారబోతున్నదని ప్రముఖ ఆర్థికవేత్త, అమెరికాలోని గొయిజుటా బిజినెస్ స్కూల్ విశిష్ట అధ్యాపకులు ప్రొఫెసర్ జగదీశ్ సేథ్ అన్నారు. ఇక్కడి భౌగోళిక, వాతావరణ పరిస్థితులు అన్ని రంగాలకు అనుకూలంగా ఉంటాయన్న ఆయన.. మానవ వనరులకూ కొదవే లేదని చెప్పారు. ఐటీ, ఫార్మా, డిఫెన్స్, లైఫ్ సైన్స్ రంగాలలో భాగ్యనగరం.. బెంగళూరును మించిపోనుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో తాజ్ కృష్ణలో సోమవారం 'నూతన ప్రపంచంలో భారత్-తెలంగాణకు ఉన్న అవకాశాలు' అనే అంశంపై ధారావాహిక ఉపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమంలో సేథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక రంగం లైఫ్ సైన్సెస్, ఐటీ, ఫార్మా వంటి రంగాలలో హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా, వ్యాపారవేత్తలలో చాలా మంది చదువుకున్న వారే లేరని, పాఠశాల చదువులను మధ్యలో మానేసిన వారు కూడా ఉన్నారని గుర్తుచేశారు. చదువును, వయసును, ముఖాన్ని బట్టి వారి వారి నైపుణ్యాలను అంచనా వేయలేమన్నారు. వారిలో ఉన్న నైపుణ్యాలను బట్టే ఆయా రంగాలలో వారు రాణిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు రాజీవ్ శర్మ మాట్లాడుతూ.. ఉపాధి విధానం, అవకాశాలు గ్రామాల నుంచి పట్టణాలకు మారుతున్నాయని, వలసలు కేవలం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి హైదరాబాద్ వంటి నగరాలకు పాకుతున్నాయన్నారు. తెలంగాణ వృద్ధి, అవకాశాల సూచీ బాగా ఉన్నట్లుగా చూస్తున్నామన్నారు. తెలంగాణలో అతిపెద్ద ల్యాండ్ బ్యాంకు అందుబాటులో ఉందన్న ఆయన.. ఉమ్మడి రాష్ట్రంలో నీటి సదుపాయాలు సరిగా లేకపోయినప్పటికీ, స్వరాష్ట్రాన్ని సాధించాక, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో మెరుగుపడ్డాయని వివరించారు. రాష్ట్రంలో ఆకర్షణీయ వృద్ధి రేటును కొనసాగిస్తున్నామని, అందుకు వ్యాపారం, పరిశ్రమలతోపాటు సేవా రంగాలు అందిస్తున్న సహకారాన్ని మరువలేమంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యా శాఖ కార్యదర్శి బి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉందన్నారు. అయితే నాణ్యమైన విద్య అందడం లేదని, అందుకు హాజరు లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఈ క్రమంలోనే ఆగస్టులో హాజరు మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

లాభాల్లోకి బీవోఎం

న్యూఢిల్లీ, జూలై 29: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం) రూ.81.10 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడం బ్యాంక్ లాభాల్లో రావడానికి దోహదపడింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో బ్యాంక్ రూ.1,119 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఏప్రిల్-జూన్ మధ్య కాలానికి బ్యాంక్ ఆదాయం రూ. 2,987.10 కోట్ల నుంచి రూ.31,91.88 కోట్లకు చేరుకున్నది. సమీక్షకాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 21.18 శాతం నుంచి 17.90 శాతానికి తగ్గగా, ఇదే సమయంలో నికర ఎన్‌పీఏ 12.20 శాతం నుంచి 5.98 శాతానికి పరిమితమైంది. విలువ పరంగా చూస్తే స్థూల నిరర్థక ఆస్తుల విలువ రూ.17,800 కోట్ల నుంచి రూ. 16,649.58 కోట్లకు తగ్గగా, నికర ఎన్‌పీఏ రూ.9,195.01 కోట్ల నుంచి రూ. 4,856.27 కోట్లకు తగ్గాయి. 2018-19లో మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ. 1,632.88 కోట్ల నిధులను వెచ్చించిన బ్యాంక్..గత త్రైమాసికానికిగాను రూ. 920.71 కోట్లను కేటాయించింది.

డీఎల్ఎఫ్ లాభం రెండింతలు

న్యూఢిల్లీ, జూలై 29: దేశంలో అతిపెద్ద రియల్టీ సేవల సంస్థ డీఎల్ఎఫ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలలకాలానికిగాను సంస్థ నికర లాభం రెండు రెట్లు పెరిగి రూ.414.72 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఏడాది ఇది రూ.172.77 కోట్లుగా ఉన్నది. గత త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ. 1,657.67 కోట్ల నుంచి రూ.1,540.95 కోట్లకు పడిపోయింది. అయాచితంగా రూ.296.51 కోట్ల ఆదాయం సమకూరడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైంది.

పక్షంరోజుల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్!

నిబంధనలు మరింత సరళతరం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం ఇక నుంచి మున్సిపల్ అధికారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడక్కర్లేదు. ఇల్లు కట్టిన తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే చాలు.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ చేతికొస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త మున్సిపల్ చట్టాన్ని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇక నుంచి రాష్ట్రంలోని 128 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లలో 200 నుంచి 500 చదరపు మీటర్ల విస్తీర్ణంలోపు ఇండ్లను కట్టుకునేవారు ఇక నుంచి స్వయం ధృవీకరణ పత్రాన్ని స్థానిక సంస్థకు సమర్పించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం నిర్మించకుండా, స్థానిక సంస్థకు తప్పుడు సమాచారాన్ని అందజేస్తే ఇంటి యజమానికి, ఎల్టీపీ (లైసెన్స్ టెక్నికల్ పర్సన్)లకు శిక్ష విధించనున్నారు. స్థానిక మున్సిపల్ సంస్థ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ చేతికి అందకపోతే, విద్యుత్తు, మంచినీరు, డ్రైనేజీ వంటి సదుపాయాల్ని ఆ గృహ యజమానికి సంబంధిత ప్రభుత్వ సంస్థలు మంజూరు చేయవు. ఇందుకోసం ప్రతి గృహయజమాని పలు అంశాలకు సంబంధించిన వివరాల్ని పొందుపర్చాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణం పూర్తయ్యాక.. ప్రతి స్థల యజమాని తను కట్టిన ఇంటికి సంబంధించి పలు కీలకమైన విషయాల గురించి తెలియజేయాల్సి ఉంటుంది.

- నిబంధనల ప్రకారమే ఇంటి చుట్టూ ఖాళీల (సెట్‌బ్యాక్)ను వదిలిపెట్టారా
- నిర్మాణం ఎత్తు, ఎన్ని అంతస్తులను నిర్మించారు వంటి అంశాలను వివరించాలి.
- కొత్త నిర్మాణాన్ని దేనికోసం వినియోగిస్తారో స్పష్టంగా పేర్కొనాలి. అంటే, ఆయా కట్టడాన్ని నివసించడానికి వాడతారా? లేదా వాణిజ్య అవసరాల నిమిత్తం వాడతారా? అనే విషయాన్ని ప్రముఖంగా పేర్కొనాలి.
- పార్కింగ్ కోసం ఎంత స్థలాన్ని వదిలిపెట్టారో స్పష్టంగా తెలియజేయాలి.

ఈ అంశాలకు సంబంధించి ప్రతి ఇంటి యజమాని వాస్తవాల్ని సమర్పించాలి. ఇవన్నీ పక్కాగా ఉన్నట్లు నిర్ధారణ అయితేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను అందజేస్తారు. అయితే, అట్టి నిర్మాణాన్ని నిబంధనలకు విరుద్ధంగా కట్టినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. ఆయా ఇంటి యజమానిపై స్థానిక సంస్థలు జరిమానా విధిస్తాయి. తనఖా పత్రాన్ని (మార్టిగేజ్) కూడా పదిహేను రోజుల్లోపు జారీ చేస్తారు.

మాల్యా 'షెల్' మాయాజాలం

- డమ్మీ సంస్థల్ని గుర్తించిన ఈడీ అధికారులు
- సహచరుడి సాయంతో సొమ్ము అందుకున్నట్లు అనుమానాలు

న్యూఢిల్లీ, జూలై 29: విజయ్ మాల్యా షెల్ బాగోతాలు బయటపడుతున్నాయి. బ్యాంకులకు రూ.9 వేల కోట్లకుపైగా రుణాలను ఎగవేసి లండన్‌కు పారిపోయిన ఈ లిక్కర్ వ్యాపారి డమ్మీ సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహించింది. షెల్ కంపెనీల సాయంతో తన సన్నిహితుడి ద్వారా మాల్యా అందుకున్న నిధులు, ఇతరత్రా అక్రమ లావాదేవీల గుట్టు రట్టు చేసే పనిలో ఇప్పుడు అధికారులు నిమగ్నమయ్యారు. షెల్ కంపెనీల నేపథ్యంలో బ్యాంక్ మోసం దర్యాప్తు మరింత విస్తరించగా, పరారీ ఆర్థిక నేరగాళ్ల చట్టం కింద గత వారం ఈడీ తొలిసారి తనిఖీలు నిర్వహించడం విశేషం. మోసపూరిత లావాదేవీల సమాచారం అందుకున్న ఈడీ.. బెంగళూరుకు చెందిన వీ శశికాంత్, ఆయన కుటుంబ సభ్యుల సంస్థలు, ఇతరత్రా వాటిపై దాడులు చేపట్టింది.

ఎవరీ శశికాంత్?

మాల్యాకు శశికాంత్ నమ్మిన బంటు. 2017 ఫిబ్రవరిదాకా శశికాంత్ మాల్యా గ్రూప్ ఉద్యోగే. అంతేగాక దాదాపు తొమ్మిదేండ్లు మాల్యాకు ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌గా పనిచేశారు. యునైటెడ్ బ్రూవరీస్ హోల్డింగ్ లిమిటెడ్ (యూబీహెచ్ఎల్) ఎండీగా కూడా పనిచేశారు. కాగా, యునైటెడ్ బ్రాండింగ్ వరల్డ్‌వైడ్ (యూబీడబ్ల్యూ) పేరుతో శశికాంత్ ఓ సంస్థను ప్రారంభించారు. బెంగళూరులోని లావెల్లి రోడ్డులో నమోదైన ఈ సంస్థలో శశికాంత్ భార్య జయంతి, కూతురు అర్చిత కూడా భాగస్వాములే కావడం గమనార్హం. ఈ యూబీడబ్ల్యూపై జరిగిన తనిఖీల్లో గోల్డ్ రీఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్, మెక్‌డోవెల్ హోల్డింగ్స్ లిమిటెడ్ తదితర షెల్ కంపెనీలకు చెందిన డాక్యుమెంట్లు, మాల్యాతో వాట్సాప్ చాటింగ్‌లు, ఈ-మెయిల్స్‌ను ఈడీ అధికారులు సీజ్ చేశారు. యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్)లో యూబీహెచ్ఎల్‌కు 10.72 శాతం వాటా ఉన్నది. అధికారికంగా కింగ్‌ఫిషర్ బీర్లు, షూస్‌ను యూబీహెచ్ఎల్ ఎగుమతి చేస్తున్నది.

యూబీడబ్ల్యూ ద్వారా నిధుల మళ్లింపు

యూబీహెచ్ఎల్ ఎగుమతులు యూబీడబ్ల్యూ ద్వారా జరుగుతుండగా, దీని వార్షిక టర్నోవర్ రూ.220 కోట్లుగా ఉన్నది. అయితే భారత్‌లోని సంపదను తన వద్దకు తెచ్చుకోవాలన్న లక్ష్యంతోనే యూబీడబ్ల్యూను సృష్టించారని, దీని ఆదాయం లండన్‌లోని మాల్యాకు తరలిపోతున్నదని ఈడీ అధికారులు అంటున్నారు. కాగా, యూబీడబ్ల్యూ ఎగుమతుల్లో 60 శాతం దుబాయ్‌కి చెందిన టమ్మి ఇంటర్నేషనల్‌కు జరుగుతున్నాయి. చాలా దేశాలకు ఈ సంస్థ ద్వారానే కింగ్‌ఫిషర్ బీర్లు చేరుతున్నాయి. అయితే శశికాంత్ కూతురు అర్చితకు టమ్మి ఇంటర్నేషనల్‌లో మెజారిటీ వాటా ఉండటం గమనార్హం. దీంతో మరింత లోతుగా దర్యాప్తు చేసి అసలు విషయాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఈడీ ప్రయత్నిస్తున్నది. యూబీ గ్రూప్‌లో ఇప్పటికీ 20-25 మంది ఉద్యోగులు మాల్యాకు అత్యంత విశ్వాసపాత్రులుగా ఉన్నారని అంటున్న ఈడీ.. వారి ద్వారా లిక్కర్ కింగ్ మరెన్ని అక్రమ లావాదేవీలకు తెగబడ్డారా? అని ఆరా తీస్తున్నది. మరోవైపు భారత్‌లో తన ఆస్తుల జప్తును వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టులో వేసిన మాల్యా పిటిషన్.. వచ్చే నెల 2న విచారణకు రానున్నది.

గుట్కా స్కాంలో రూ.246 కోట్లు జప్తు

తమిళనాడు గుట్కా కుంభకోణానికి సంబంధించి చేస్తున్న మనీ లాండరింగ్ విచారణలో రూ.246 కోట్లకుపైగా ఆస్తులను జప్తు చేసినట్లు ఈడీ సోమవారం తెలియజేసింది. తమిళనాడుతోపాటు పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్‌ల్లో గుట్కా వ్యాపారుల కున్న 174 స్థిరాస్తులతోపాటు షేర్లు, రూ.2.29 కోట్ల విలువైన వాహనాలనూ జప్తు చేశామని పేర్కొన్నది. మొత్తం ఈ ఆస్తుల మార్కెట్ విలువ రూ.246.0 9 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. ఏవీ మాధవ రావు, పీవీ శ్రీనివాస రావు, తల్లం ఉమా శంకర్ గుప్తా మరికొందరిపై తమిళనాడులో గుట్కా ఉత్పత్తుల అక్రమ తయారీ, అమ్మకం, రవాణా ఆరోపణలున్నాయి. 2013 జూన్ నుంచి 2016 జూన్ మధ్య ఈ వ్యవహారం టర్నోవర్ విలువ రూ.639.40 కోట్లుగా ఉన్నదని ఈడీ పేర్కొంటున్నది. జయం ఇండస్ట్రీస్ పేరుతో ఎండీఎం బ్రాండ్ గుట్కాను తయారు చేస్తున్న వీరంతా తమకు వచ్చిన ఆదాయంను ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి, తమిళనాడుల్లో స్థిర, చరాస్తులపై పెట్టుబడులుగా పెడుతున్నట్లు ఈడీ చెబుతున్నది.

గెయిల్ సీ

ఆషాఢ బోనాల పండుగ సందర్భంగా సోమవారం 3డీ లైటింగ్‌తో ధగధగలాడుతున్న రవీంద్రభారతి

రుషికేశ్‌లో ఘనంగా ఆరాధనా మహోత్సవం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉత్తరాఖండ్ రాష్ట్రం రుషికేశ్‌లోని శారదాపీఠంభవన్‌లో సోమవారం శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పరమగురువు సచ్చిదానందేంద్ర సరస్వతీ వారి ఆరాధనామహోత్సవరం నిర్వహించారు. అనంతరం సాధుసంతులకు బండారా (అన్నదానం) నిర్వహించి.. ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తరపీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతిస్వామి, ఆస్థాన పండితుడు కృష్ణశర్మ, వేదవిద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెద్దపులుల గాండ్రింపులు

- 30కి పెరిగిన జాతీయ జంతువుల సంఖ్య
- ఎన్టీసీఏ సమగ్రసర్వేలో వచ్చిన స్పష్టత
- కవ్వాల్, అమ్రాబాద్‌లో పులుల ఆవాసం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలోని రెండు టైగర్ రిజర్వ్‌లలో పెద్దపులులు గాండ్రిస్తున్నాయి.అనువైన వాతావరణం కారణంగా క్రమంగా వాటి సంఖ్య పెరుగుతున్నది. కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాల్లో సురక్షిత వాతావరణం ఉన్నదని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాష్ట్రంలో 26 నుంచి 30 వరకు పెద్దపులులు ఉన్నట్టు నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్టీసీఏ)గణనలో స్పష్టత వచ్చింది. తెలంగాణ ఆవిర్భవించిన మొదట్లో పెద్దపులుల సంఖ్య 20లోపు ఉన్నట్టు అప్పటి ఎన్టీసీఏ ప్రాథమిక సర్వేలో తేలింది. తర్వాత ఆలిండియా టైగర్ ఎస్టిమేషన్ పేరిట సమగ్ర గణనను 2018 జూన్ 23 నుంచి వారంపాటు నిర్వహించారు. పులుల పాదాల గుర్తులు, కెమెరా ట్రాప్‌లు, ప్రజలు ప్రత్యక్షంగా చూసిన ఘటనలను పరిగణనలోకి తీసుకొన్నారు. దాదాపు ఏడాదిపాటు శాస్త్రీయ సర్వే తర్వాత పులుల లెక్కతేల్చారు. కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో దాదాపు 26 పెద్దపులులున్నట్టు ఎన్టీసీఏ మానిటరింగ్ ఎఫెక్టివ్‌నెస్ ఎవాల్యూయేషన్ రిపోర్ట్- 2018ను అంతర్జాతీయ పులల దినోత్సవం సందర్భంగా సోమవారం వెల్లడించింది. ఈ సంఖ్య అటుఇటుగా 30కి పెరుగవచ్చని తేల్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 48 వరకు ఉండవచ్చని వెల్లడించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2006లో 95 పెద్దపులులుండగా, 2010లో 72కు, 2014లో 68కు తగ్గినట్టు ఎన్టీసీఏ సర్వేలో వెల్లడైంది. అప్పట్లో తెలంగాణ పరిధిలోని నల్లమల రాజీవ్‌గాంధీ(ఇప్పటి అమ్రాబాద్) టైగర్ రిజర్వ్‌లోనే పెద్దపులుల మనుగడ ఉండేది. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఉనికి కనిపించలేదు.

పులులకు తెలంగాణ అభయం

రాష్ట్రంలో గోదావరి ఒడ్డునఉన్న కవ్వాల్, కృష్ణా నది ఒడ్డున ఉన్న అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లు పెద్దపులులకు సురక్షిత స్థావరంగా ఉన్నట్టు ఎన్టీసీఏ టైగర్ సెన్సస్‌లో వెల్లడైంది. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు సగటు మార్కులతో సరిపెట్టుకున్న రెండు అభయారణ్యాలకు కేంద్రం మంచి రేటింగ్ ఇచ్చింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు 71 శాతం, కవ్వాల్‌కు 66 శాతం మార్కులు వచ్చాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కవ్వాల్ అభయారణ్యంలో పెద్దపులులు కనుమరుగయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కవ్వాల్‌లో పరిస్థితి మారింది. అడవులు, వన్యప్రాణుల రక్షణకు ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలు ఫలించాయి. దాదాపు ఎనిమిది పెద్దపులులు, నాలుగు కూనలు అభయారణ్యంలో స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. ఒక్క ఫాల్గుణ పులి ఏడు పిల్లలకు జన్మనివ్వడం విశేషం. కవ్వాల్ అభయారణ్యం ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల పరిధిలో దాదాపు 2,020 చదరపు కిలోమీటర్‌ల మేర విస్తరించి ఉన్నది. 1,123 చదరపు కిలోమీటర్లు బఫర్‌జోన్‌గా, 897 చదరపు కిలోమీటర్లు కోర్‌జోన్‌గా విభజించారు. కోర్‌జోన్‌ను పెద్దపులి సంచరించే ప్రాంతంగా, బఫర్‌ను వేటాడే ప్రాంతంగా పరిగణిస్తారు. నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అడవుల్లో 2,611.39 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో కూడా పెద్దపులుల సంతతి పెరిగినట్టు ఎన్టీసీఏ సర్వేలో వెల్లడైంది. ఇక్కడ 18 నుంచి 20 వరకు పులులున్నట్లు తేలింది. అచ్చంపేట డివిజన్ పరిధిలో కోర్ ఏరియా 1,750 చదరపు కిలోమీటర్లు, బఫర్ ఏరియా 445.02 చదరపు కిలోమీటర్లు, నాగార్జునసాగర్ డివిజన్ నల్లగొండలో కోర్ ఏరియా 416 చదరపు కిలోమీటర్లుగా నిర్ధారించారు, అత్యంత ప్రధానమైన 2,166 చదరపు కిలోమీటర్ల పరిధిలోని కోర్ ఏరియాకు 445 చదరపు కిలోమీటర్ల పరిధిలోని బఫర్‌జోన్‌ను కలిపి అతి పెద్ద అభయారణ్యంగా మార్చారు.

పులుల సంఖ్య పెరుగడం గర్వకారణం

దేశంలో పెద్దపులుల సంఖ్య 33 శాతం పెరుగడం సంతోషం. జాతీయజంతువుల సంఖ్య 2,967కు పెరగడం దేశానికే గర్వకారణం పర్యావరణాన్ని పరిరక్షించి, వన్యప్రాణులను రక్షిస్తున్న కార్యక్రమంలో భాగస్వాములైన వారికి అభినందనలు.

–ట్వీట్‌లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

సంతతి పెరుగడం శుభపరిణామం

తెలంగాణలో పెద్దపులుల సంఖ్య పెరగడం ఆహ్వానించదగ్గ పరిణామం. రాష్ట్రం ఏర్పడ్డాక అడవుల రక్షణకు తీసుకున్న చర్యలు ఫలించాయి. అడవులు, వన్యప్రాణుల రక్షణకు కృషిచేసిన అటవీ అధికారులు, సిబ్బంది కృషికి నిదర్శనం. పర్యావరణ పరిరక్షణపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాల్సిన అవసరమున్నది.

– అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ప్రముఖ రచయిత్రి కేబీ లక్ష్మి కన్నుమూత

- తమిళనాడు నుంచి హైదరాబాద్ వస్తుండగా కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో ఆకస్మిక మృతి
- రేణిగుంటలోని దవాఖానకు తరలింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

కేబీ లక్ష్మి

ప్రముఖ తెలుగు రచయిత్రి, పాత్రికేయురాలు కేబీ లక్ష్మి (కే భాగ్యలక్ష్మి) సోమవారం రాత్రి కన్నుమూశారు. తమిళనాడులోని కంచిలోని అత్తి వరదరాజస్వామిని దర్శించడానికి వెళ్లిన ఆమె ఎగ్మోర్–కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో రేణిగుంటకు చేరుకొనేసరికి అస్వస్థతకు గురయ్యారు. రేణిగుంటలో వైద్యులు ఆమెను పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆమె మృతికి కారణాలు తెలియరాలేదు. ఆమెకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఆమె పార్థివదేహాన్ని హైదరాబాద్ తీసుకువస్తున్నారు. బుధవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలియజేశారు. 1953 పంద్రాగస్టు నాడు జన్మించిన కేబీ లక్ష్మి వేటపాలెంలో చదువుకొన్నారు. అచ్యుతవల్లి కథలపైన కేబీ లక్ష్మి పీహెచ్‌డీ పూర్తిచేశారు. 1965లో యువభారతి సాహిత్య సంస్థ వనితా విభాగం అధ్యక్షురాలిగా పనిచేసిన ఆమె చాలాకాలం ఆకాశవాణిలో క్యాజువల్ అనౌన్సర్‌గా పనిచేశారు. అనంతర కాలంలో పాత్రికేయ వృత్తిలో ప్రవేశించి.. విపుల, చతుర మ్యాగజైన్లకు ఉప సంపాదకురాలిగా వ్యవహరించారు. వాటి సంపాదకుడిగా ఉన్న ప్రముఖ రచయిత చలసాని ప్రసాద్ అనంతరం ఆమె ఇంచార్జి సంపాదకురాలిగా పనిచేశారు. మనసున మనసై, జూకామల్లి అనే రెండు కథా సంపుటాలను, వీక్షణం, గమనం అనే రెండు కవితా సంపుటాలను వెలువరించారు.

గచ్చిబౌలి భూకబ్జా కేసులో 26మంది అరెస్ట్

- సొసైటీ పేరుతో అక్రమాలు
- 160 కోట్ల విలువైన 4 ఎకరాలు కబ్జా

శేరిలింగంపల్లి: ఫోర్జరీపత్రాలు సృష్టించి గచ్చిబౌలిలోని దాదాపు రూ. 160 కోట్ల విలువైన 4 ఎకరాల స్థలాన్ని కబ్జాచేసిన కేసులో 26 మంది నిందితులను సోమవారం రాయదుర్గం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాయదుర్గం సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూనల్లకుంట ప్రాంతానికి చెందిన ధర్మరాజు 1991లో మొబైల్ వెల్ఫేర్ సొసైటీ అనే సంస్థ ఏర్పాటుచేసి.. అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శేరిలింగంపల్లి రెవెన్యూపరిధిలోని గచ్చిబౌలిలో సర్వేనంబర్లు 32 నుంచి 40లోని 99 ఎకరాలు తన సొసైటీకి కేటాయించినట్టు ఫోర్జరీపత్రాలు (డీ/06371/డీఎ–ఎస్‌డబ్ల్యు/ఎల్‌ఎ1991) సృష్టించాడు. అనంతరం పలువురికి పాట్లను విక్రయించాడు. ఇందులోభాగంగా ప్రగతి సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌కు చెందిన సెక్రటరీగా చెప్పుకొనే కంచి నాగమణి, ఆమె అనుచరులు మొబైల్ వెల్ఫేర్ సొసైటీ తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకొన్న 99 ఎకరాల్లోని సర్వేనంబర్ 38, 39ల్లో 6.32 ఎకరాల స్థలాన్ని శామిర్‌పేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తమకు రిజిష్ట్రేషన్ చేసినట్టు డాక్యుమెంట్ సృష్టించారు. అనంతరం నాగమణి ఆమె వర్గీయులు సర్వేనంబర్ 32లోని 4 ఎకరాల స్థలాన్ని ఆక్రమించి 90 గజాల చొప్పున ప్లాట్లుగా విభజించి పలువురికి విక్రయించారు. వాస్తవానికి ప్రభుత్వం 32 సర్వేనంబర్‌లోని 4 ఎకరాల్లో..
3 ఎకరాలను ఐఐసీ సిస్టమ్స్ సంస్థకు, 20 గుంటలను బ్రిజేశ్ కోలే అనే వ్యక్తికి, 20 గుంటలు బాబురావు అనే మరోవ్యక్తికి కేటాయించింది. ఈ స్థలంపై వారు కోర్టును ఆశ్రయించగా.. పలుసార్లు విచారించిన సుప్రీం కోర్టు ధర్మరాజు వద్ద ఉన్న పట్టా నకిలీదని తేల్చింది. ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించింది. దీంతో ఐఐసీ సిస్టమ్స్, బ్రిజేశ్‌కోలే, బాబూరావు సదరు నాలుగు ఎకరాలు కబ్జాకు గురైనట్టు పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు ఫోర్జరీపత్రాలతో కబ్జాకు పాల్పడ్డ 26 మందిని అదుపులోకి తీసుకున్నారు.

ఏపీ శాసనసభలో 8 బిల్లులకు ఆమోదం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ శాసనసభ సోమవారం ఎనిమిది కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. వెనుకబడిన కులాలకు శాశ్వత కమిషన్ ఏర్పాటు; మహిళలకు నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టులు, సర్వీసుల్లో 50 శాతం రిజర్వేషన్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నామినేట్ పనులు, కాంట్రాక్టు, సర్వీసుల్లో 50 శాతం రిజర్వేషన్లు, మహిళలకు నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్ బిల్లు, పరిశ్రమలు, కర్మాగారాల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే కేటాయింపు, ఏపీ మార్కెట్ చట్ట సవరణ బిల్లు, స్వదేశంలో తయారైన విదేశీ మద్యం, విదేశీ మద్య వ్యాపార చట్ట సవరణ బిల్లులు ఆమోదం పొందాయి.

హైదరాబాద్‌లో పెరిగిన వాయు కాలుష్యం

కాలుష్యాన్ని తగ్గించేందుకు పక్కా చర్యలు: సీఎస్ ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గత ఏడాది డిసెంబర్ నుంచి 2019 మే వరకు హైదరాబాద్‌లో అత్యధిక వాయుకాలుష్యం నమోదయ్యిందని ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్లు వెల్లడించాయి. దీంతో చిన్నారులు, పెద్దలు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులబారిన పడుతారని, మహిళలకు రొమ్ముకాన్సర్ వచ్చే ప్రమాదమున్నదని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఈ వెబ్‌సైట్లు పేర్కొన్న వివరాల ప్రకారం.. 2019 వేసవిలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 150 నుంచి 230 మధ్య నమోదయ్యింది. 2018 అక్టోబర్‌లో కాలుష్యం 2.5 పీఎం (పార్టికులేట్ మ్యాటర్/పార్టికల్ పొల్యూషన్) స్థాయికి చేరుకోగా డిసెంబర్ నాటికి స్థిరంగా మారింది. ఆదివారం నగరంలో జరిగిన 'డాక్టర్స్ ఆఫ్ క్లీన్ ఎయిర్' కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి మాట్లాడుతూ.. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం పక్కా చర్యల్ని తీసుకుంటుందని వివరించారు. కొత్తూరు, సంగారెడ్డి, మెదక్ వంటి పట్టణాల్లో కాలుష్యం పెరుగుతుండటం ప్రధాన సమస్యగా అభివర్ణించారు. గడిచిన రెండునెలల్లో వర్షాలు పడుతుండటంతో కాలుష్యం తగ్గుముఖం పట్టిందన్నారు.

ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా

జక్కంపూడి రాజా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా వైఎస్సార్సీపీ రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. జక్కంపూడి రాజా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కొద్దిరోజులాగు చిట్టినాయుడూ!

మీరు నిప్పో తుప్పో ప్రజలే చెప్తారు..

లోకేశ్‌కు కౌంటరిచ్చిన ఎంపీ విజయసాయిరెడ్డి

అమరావతి, నమస్తే తెలంగాణ: 'మా బాలా మామయ్య మీలా కాదు.. ఆయనది స్వచ్ఛమైన మనసు, నీతి నిజాయితీతో ఎదిగారు' అంటూ నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలకు ఎంపీ విజయసాయి రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. 'కొద్ది రోజులాగు చిట్టినాయుడూ? అమరావతి కలల రాజధానో, కలపు రాజధానో తెలుస్తుంది. మీ బినామీలు లాగేసుకున్న వేల ఎకరాల స్టోరీలన్నీ సీరియల్‌గా బయటకొస్తాయి. దావోస్‌లో ఏపీ లాంజ్ కోసం చంద్రబాబు రూ.17 కోట్లను దుబారా చేయడంపై దర్యాప్తు జరుగాలి' అని విజయసాయిరెడ్డి సోమవారం ట్వీట్ చేశారు.

ఏపీ సంగం డెయిరీలో భారీ చోరీ

లాకర్ పగులగొట్టి రూ. 44 లక్షలు దోపిడి

అమరావతి, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా వడ్లమూడిలోని సంగం డెయిరీ ప్రధాన కార్యాలయంలో భారీచోరీ జరిగింది. ఆదివారం అర్ధరాత్రి కార్యాలయంలోకి ప్రవేశించిన దొంగలు.. రెండో అంతస్థులో లాకర్‌ను పగులగొట్టి రూ.44 లక్షల నగదు దోచుకెళ్లారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 30 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

ముఖం నిగారించేలా..

- గిన్నెలో కొద్దిగా బియ్యప్పిండిని తీసుకోవాలి. అందులో అర టీస్పూన్ పసుపు, అర టీస్పూన్ తేనె, కొద్దిగా నిమ్మ రసం వేసుకోవాలి. వీటన్నింటినీ బాగా మిక్స్ చేసుకోవాలి. ఆ తర్వాత ముఖంపై ఉన్న బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్ దగ్గర వేడి నీటిలో ముంచిన టవల్‌ను పెట్టి రెండు నిమిషాలు ఉంచాలి. ఆ తర్వాత పైవిధంగా తయారు చేసుకున్న మిశ్రమాన్ని రుద్దాలి. పదినిమిషాల తర్వాత కడిగేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- కాఫీ పౌడర్, రోజ్ వాటర్ ఒక గిన్నెలో తీసుకుని బాగా కలుపాలి. బ్లాక్ హెడ్స్, వైట్ హెడ్స్‌పై మర్దన చేయాలి. ఐదు నిమిషాల అనంతరం అలాగే వదిలేయాలి. పదిహేను నిమిషాల తర్వాత కడిగేస్తే మంచి ఫలితం ఉంటుంది. బ్లాక్ హెడ్స్, వైట్‌హెడ్స్ తొలగిపోయే వారకు ప్రతీ రోజూ వాడొచ్చు.
- కొన్ని బియ్యాన్ని తీసుకుని పాలలో వేసి ఐదు గంటలపాటు నానబెట్టాలి. ఆ తర్వాత మెత్తటి పేస్టులా రుబ్బాలి. గోరు వెచ్చటి నీటితో ముఖం కడుక్కున్న తరువాత ఈ పేస్ట్ రాసుకోవాలి. వారంలో మూడు రోజులు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- ఒక కప్పు ఓట్‌మీల్‌కు ఒక టీ స్పూను బేకింగ్ సోడా, మూడు టీ స్పూన్ల అలోవెరా(కలబంద) రసం కలిపి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని ఆరిన తరువాత గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కోవాలి.
- తాజా టమాటా ముక్కలను తీసుకుని ముఖంపై రుద్దుకోవాలి. ఆ తరువాత గోరువెచ్చటి నీటితో ముఖాన్ని శుభ్రం చేయాలి. ఇలా రోజూ చేస్తే ముఖం కాంతివంతమవుతుంది.

'నాన్నా.. కాలేజ్‌కు టైం అవుతుంది త్వరగా రావా..' అంటూ దీనంగా ఇంటి గుమ్మంవైపే చూస్తున్నది స్వాతి. ఎందుకంటే నాన్నొచ్చి ఆమెను కాలేజ్‌లో దించాలి మరి. 'ఏమండీ.. త్వరగా రండి. బజారుకెళ్లి సరుకులు తీసుకురావాలి' అంటూ భర్త కోసం ఎదురుచూస్తున్నది శాంతి. 'సంతోష్.. కొంచెం ఆస్పత్రికి వెళ్దాం రావా. అంకుల్ వచ్చేసరికి లేట్ అవుద్దంటా. బాబుకు ఒళ్లు కాలిపోతున్నది' అంటూ తన మేనల్లుడిని వేడుకుంటున్నది గృహిణి ఉష. ఇలాంటి ఎన్నో సందర్భాలు మహిళలకు నిత్యం ఎదురవుతుంటాయి. ఇంట్లో బైక్ ఉన్నా.. డ్రైవింగ్ రాకనో, భయంతోనో ఎవరో ఒకరిపై ఆధార పడాల్సిన పరిస్థితి చాలామందిది. అలాంటి మహిళలకు ఉచితంగా డ్రైవింగ్ నేర్పుతూ.. వారిలో భయాన్ని పోగొడుతున్నది ఈ 'మువింగ్ వుమెన్'.

మోవోతో దూసుకెళ్లండి!

కాలేజీకి వెళ్లాలన్నా, అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలన్నా.. కారణం మరేదైనా డ్రైవింగ్ రాక ఇతరులపై ఆధారపడుతున్నారు కొందరు మహిళలు. 'నాకే గనుక డ్రైవింగ్ వచ్చి ఉంటే బాగుండు! నా పని నేను సులువుగా చేసుకునేదాన్ని' అనుకున్న సందర్భాలు అనేకం. ఇంట్లో బండి ఉన్నా.. నేర్చుకునేందుకు సరైన అవకాశం దొరకదు. నేర్పేవారు దొరకరు. కుటుంబీకులను ఎవరినైనా నేర్పించమందామంటే వారు బిజీగా ఉంటారని అడగరు. మార్కెట్లో డ్రైవింగ్ నేర్పే ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నా.. లేడీ ట్రైనర్లు చాలా తక్కువ. ఈ కారణంతో చాలామంది మహిళలు డ్రైవింగ్ నేర్చుకోవడం లేదు. వీటన్నింటినీ గమనించి 'ఆసక్తి ఉంటే చాలు.. ఉచితంగా డ్రైవింగ్ నేర్పిస్తా' అని ముందుకొచ్చారు జైభారతి.

ఎవరీ జై భారతి?

తెలంగాణ పర్యాటకం, మహిళాశక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన మహిళ అద్దెపల్లి జై భారతి. తెలంగాణ టూరిజం నుంచి పలు దేశాల సందర్శనలకు బైక్ లపై వెళ్లిన నలుగురు మహిళల బృందంలో ఆమె ఒకరు. 56 రోజుల పర్యటనలో ఆరుదేశాల్లో 17 వేల కిలోమీటర్లు ప్రయాణించారు. తనకు నచ్చిన రైడింగ్‌లో ఆమె స్వేచ్ఛగా ప్రయాణించారు. వృత్తిరీత్యా ఆర్కిటెక్ట్ అయిన జైభారతికి బైక్‌రైడింగ్ అంటే ఇష్టం. తన అభిరుచికి తగినట్లుగా ఆయా దేశాల్లోని ప్రదేశాల్ని సందర్శించారు. ఈక్రమంలో తెలంగాణ ప్రభుత్వం నుంచి 2018లో 'విశిష్ట మహిళ అవార్డు' అందుకున్నారు జైభారతి. ఆమె అంతటితో ఆగకుండా సగటు మహిళల గురించి ఆలోచించారు. చిన్న అవసరానికైనా ఇతరులపై ఆధారపడుతున్న మహిళలను చూసి చలించిపోయారు. మహిళలు వంటింటికే పరిమితం కాకూడదని, వారిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నించారు. అనుకున్నదే తడవుగా 'మువింగ్ వుమెన్' (MOWO) ఫౌండేషన్‌ను ప్రారంభించారు భారతి.

ఆలోచన నుంచి ఆచరణ దాకా..

2017 నవంబర్ నుంచి 2018 నవంబర్ వరకు 260 మంది మహిళలకు ఉచితంగా బైక్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు జైభారతి. ఆ తర్వాత అనేక మంది తమకు శిక్షణ ఇవ్వాలని ఆమెను కలిశారు. అందుకు సరైన స్థలం లేకపోవడంతో ఆమె చాలా ఇబ్బందులు పడ్డారు. ఇటీవల నిర్వహించిన ఓ కార్యక్రమంలో జైభారతి తన ఆలోచనను బయటపెట్టారు. ఆ తర్వాత ఓల్డ్ ఎంఐజీ కాలనీలోని హనుమాన్ ఆలయ మైదానంలో శిక్షణ ఇచ్చేలా కొందరు ప్రోత్సహించారు. అలా.. ఈ ఏడాది జూన్‌లో 'మోవో' సంస్థను ఏర్పాటు చేశారు భారతి. మొదటి బ్యాచ్‌లో 19 మంది స్థానిక మహిళలకు ఉచితంగా బైక్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. నెలరోజుల్లో ట్రాఫిక్‌రూల్స్, బైక్‌డ్రైవింగ్, మహిళా చట్టాలపై శిక్షణ ఇచ్చారు. వారు ఇప్పుడు ఎవరిపై ఆధారపడకుండా తమ పని తాము చేసుకుంటున్నారు. ప్రస్తుతం రెండో బ్యాచ్ నడుస్తున్నది. శిక్షణ పొందుతున్న వారిలో 18 ఏండ్ల నుంచి 60 ఏండ్ల వయసు వారు, చిరు వ్యాపారులూ ఉన్నారు.

శిక్షణ ఇస్తారిలా..

వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు స్కూటీల ద్వారా ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ నడుస్తుంది. డ్రైవింగ్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్న వారిని ఒక బ్యాచ్‌గా చేస్తారు. వారు ఎందుకు డ్రైవింగ్ నేర్చుకోవాలనుకుంటున్నారో ముందుగా తెలుసుకుంటారు. మొదటి పది రోజులు జైభారతి వారికి మోటివేషనల్ క్లాసెస్ తీసుకుంటారు. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతారు. ట్రాఫిక్ రూల్స్, సిగ్నల్స్‌పై అవగాహన కల్పిస్తారు. ఆ తర్వాత వారికి లెర్నింగ్ లైసెన్స్ ఇప్పిస్తారు. బైక్ భాగాలు, హెల్మెట్ వాడకం, రోడ్డు భద్రత గురించి వివరిస్తారు. మొదటగా బైక్ బ్యాలెన్సింగ్ నేర్పిస్తారు. తర్వాత వెనకాల కూర్చుని స్కూటీ నడపడం నేర్పిస్తారు. 20 రోజులు రోజుకు మూడు గంటలు ఈ శిక్షణ నడుస్తుంది. మహిళా చట్టాలు, ఎవరైనా దాడి చేసినప్పుడు ఎలా తిప్పికొట్టాలి. తదితర విషయాల్ని షీటీమ్ శాంతి బోధిస్తారు. డ్రైవింగ్ వచ్చిన తర్వాత, డ్రైవింగ్ లైసెన్స్ చేతిలో పడ్డాకే బండి నడిపేలా మోవో టీం చూస్తుంది.

డబ్బులేం తీసుకోరు!

మోవో ఫౌండేషన్ ప్రారంభమయ్యిందే మహిళలు ముందుకు కదలాలని. ఆ కోణంలోనే సంస్థకు చెందిన 5 స్కూటీల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ప్రతీరోజు గ్రౌండ్‌లో 4 గంటలు శిక్షణ ఇస్తారు. ఈ సమయంలో పెట్రోల్ ఖర్చును సంస్థే భరిస్తుంది. బండి మెయింటెనెన్స్, పాడైన బండి విడిభాగాల ఖర్చు అంతా సంస్థే భరిస్తుంది. సంస్థ ప్రారంభమైనప్పటి నుంచి 40 మందికి శిక్షణ ఇచ్చారు. వారిలో ఉద్యోగం చేయాలనే ఆసక్తి ఉన్నవారికి మోవో సంస్థ తోడ్పాటునిస్తున్నది. అయితే ఉచితంగా నేర్పిస్తే కొందరు ప్రతిరోజు శిక్షణకు హాజరుకావట్లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. అందుకే ఇకనుంచి ప్రతి ఒక్కరి దగ్గరా రూ. 1500 తీసుకుంటామని, శిక్షణ పూర్తి చేసుకున్నాక తిరిగి రీఫండ్ చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

కొందరికి ఉపాధి.. మరెందరికో ఊతం

మోవో ఆధ్వర్యంలో ప్రస్తుతం 20 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. మొదటి బ్యాచ్‌లో ఐదుగురికి ఉబర్ ఈట్స్‌లో ఫుడ్ డెలివరీ ఉద్యోగం లభించింది. 'శిక్షణ సమయంలో మహిళలపై దాడులు, ట్రాఫిక్‌రూల్స్ తదితర విషయాలన్నీ నేర్చుకోవడంతో ఉద్యోగం చేయడం చాలా సులభమవుతున్నది' అని ఉబర్‌లో ఉద్యోగం చేస్తున్న మహిళలు పేర్కొంటున్నారు. ఒక్క ఫుడ్ డెలివరీ రంగమనే కాకుండా అనేక రంగాల్లో మహిళలు స్థిరపడేందుకు మోవో సంస్థ కృషి చేస్తున్నది. మహిళలకు మానసిక స్థైర్యాన్ని కల్పిస్తున్నది. బైక్ ట్యాక్సీ, లంచ్ బ్యాగ్ పికప్ ఇలా మరిన్ని రంగాల్లో మహిళలు ఎదిగేలా మోవో ప్రోత్సాహాన్నిస్తున్నది.

మహిళా చైతన్యమే లక్ష్యం

నగరంలోని అన్ని ప్రాంతాల్లో సేవలను విస్తరించాలనుకుంటున్నాం. ఏడాదికి 10 వేల మందికి శిక్షణ ఇవ్వాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నాం. మహిళా చైతన్యమే లక్ష్యంగా పని చేస్తున్నాం. జీహెచ్ ఎంసీ వెస్ట్‌జోన్ వారి సపోర్ట్‌తో, మోవో టీం సహకారంతో మా కార్యక్రమాల్ని సులభంగా నిర్వహించగలుగుతున్నాం. ఫుడ్ డెలివరీ రంగంలో మహిళలను ప్రోత్సహిస్తున్నాం. బైక్ ట్యాక్సీలో ప్రస్తుతం మహిళలు లేరు. త్వరలో మా నుంచి శిక్షణ పొందిన వారు ఇందులో పనిచేయనున్నారు. శిక్షణ తదితర వివరాలకు 89788 62299 నంబర్ లేదా www.mowo.in వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

- అద్దేపల్లి జైభారతి, మోవో వ్యవస్థాపకురాలు

బిజినెస్ చూసుకుంటున్నా..

జైభారతి గారు తన ఆలోచనను నాతో పంచుకున్నారు. నేను మా కాలనీలోని 20 మంది మహిళలను గ్రూపుగా తయారు చేశా. ఇప్పుడు మా అందరికీ డ్రైవింగ్ పర్‌ఫెక్ట్‌గా వచ్చింది. డ్రైవింగ్ లైసెన్స్ కూడా తీసుకున్నా. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ స్కూటీ నడుపుతున్నా. మాకున్న ఫిష్ బిజినెస్‌ను నేనే చూసుకుంటున్నా. మార్కెట్‌కు వెళ్లిరావాలన్నా స్కూటీమీదనే వెళ్తున్నా. ఏ కార్యక్రమమైనా స్కూటీమీదనే వెళ్లొస్తున్నా. కొన్ని రోజుల క్రితం 'నేనేంటి స్కూటీ నడపడమేంటి' అనుకునే దాన్ని. జైభారతి గారు నా భయాన్ని పోగొట్టారు.

- అనిత, గృహిణి, లింగంపల్లి

...✍ పడమటింటి రవికుమార్
📷 వీరగోని రజినీకాంత్‌గౌడ్

ఆరోగ్యనిధి అంజీర

ఆకర్షణీయమైన రంగూ, రూపం అంజీరకు లేవు. కానీ ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అద్భుతమైన రుచితో పాటు పోషక విలువలు కూడా ఇందులో పుష్కలంగా ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా డ్రైఫ్రూట్స్ రూపంలోనే అంజీర్ వాడకం ఎక్కువ.

- రోగ నిరోధక శక్తిని పెంచే గుణాలు అంజీరలో ఎన్నో ఉన్నాయి. ఏ వ్యాధితో బాధపడుతున్న వారైనా అంజీరను తీసుకుంటే త్వరగా కోలుకుంటారు. శరీరానికి అవసరమైన శక్తిని అంజీర అందిస్తుంది. శారీరక, మానసిక సమస్యలను తగ్గిస్తుంది. క్యాన్సర్ తరహా గడ్డల నివారణకు అంజీర్ బాగా పనిచేస్తాయి.
- అంజీరలో అధికంగా ఉండే పొటాషియం బీపీని తగ్గిస్తుంది. ఈ పండ్లు మధుమేహం(షుగర్), ఆస్తమా, దగ్గు వంటి వ్యాధుల్ని తగ్గిస్తాయి. ఊపిరితిత్తుల సమస్యలకు ఇవి మంచి మందుగా కూడా పనిచేస్తాయి.
- ధీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు బలహీనంగా మారిన వాళ్లు వీటిని ఎక్కువగా తీసుకుంటే త్వరగా బరువు పెరుగుతారు. మలబద్ధక సమస్యను తొలగించడానికి ఈ పండు పెట్టింది పేరు. అజీర్తిని అరికడుతుంది. వీటిలోని క్యాల్షియం ఎముకల వృద్ధికి, పుష్టికీ దోహదపడుతుంది.

ఎవరీ తమన్నా సింహాద్రి

ఉత్కంఠభరితంగా సాగుతున్న బిగ్‌బాస్-3లో నటి హేమా ఎలిమినేట్ అయింది. ఆ స్థానంలో వైల్డ్‌కార్డ్ ద్వారా ఎంట్రీ ఇచ్చింది ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి. ఓ రియాల్టీ షోకు.. అదీ బిగ్‌బాస్‌లాంటి కార్యక్రమానికి ట్రాన్స్‌జెండర్‌ను ఎంపిక చేయడంపై అందరిలోనూ ఆసక్తి పెరిగింది. ఇంతకీ.. ఎవరీ తమన్నా? ఎక్కడుంటారు? ఏం చేస్తారు? ఆమె నేపథ్యం ఏంటి?

బతకడానికి ఊరెళ్తే అక్కడ 'హిజ్రా' అని వెలేశారు. 'చదువుకున్నా ఏదైనా ఉద్యోగం ఇవ్వండి' అని ఆఫీస్ మెట్లెక్కితే.. అక్కడా 'తేడా' అంటూ అవమానించారు. ఇవీ.. ఎప్పటి నుంచో ట్రాన్స్‌జెండర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు. ఇలాంటి పరిస్థితులను వ్యతిరేకిస్తూ తమ ఉనికి కోసం పోరాటాలు చేస్తున్నారు ట్రాన్స్‌జెండర్స్. విద్యా, ఉపాధి, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తమనూ గుర్తించాలని గొంతెత్తి నినదిస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఆ పోరాటం మెరుగైన ఫలితాలను ఇస్తున్నది. వారు రంగాల్లోకి రాగలుతున్నారు. ఇలాంటి పోరాటాల వెనుక ట్రాన్స్ ఉమెన్ 'తమన్నా సింహాద్రి' గొంతు కూడా ఉన్నది. అందుకే బిగ్‌బాస్ నుంచి ఆమెకు ఆహ్వానం అందింది.

ఇదీ తమన్నా నేపథ్యం..

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా అవనిగడ్డ తమన్నా సింహాద్రి తాతగారి సొంతూరు. తను విజయవాడలో పుట్టి, అక్కడే పెరిగింది. విజయవాడలోని నవభారత్ స్కూల్‌లో పదో తరగతి, ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీలో బీసీఏ చదివింది. అబ్బాయిగానే పుట్టినా.. చిన్నప్పటి నుంచే అమ్మాయి లక్షణాలున్నాయి. అందుకే మహిళగా ఉండడానికి ఇష్టపడింది. 15 యేండ్ల వయసులో ట్రాన్స్‌జెండర్‌గా మారింది. చిన్నప్పటి నుంచి నటన, మోడలింగ్ అంటే ఇష్టం. ఎప్పటికైనా మోడల్, యాక్టర్ అవ్వాలని కలలు కనేది . ఆ కలలను నెరవేర్చుకోవడం కోసం మోడలింగ్‌లో శిక్షణ కోసం ముంబై వెళ్లింది. అక్కడ ఓ ట్రాన్స్‌ఉమెన్ ఫ్రెండ్‌తో మోడలింగ్‌లో చేరింది. ఆమె సహాయంతో మోడలింగ్‌పై పట్టుసాధించింది. అలా 2010లో జరిగిన 'ట్రాన్స్ ఉమెన్ మిస్ ముంబై' పోటీల్లో పాల్గొన్నది . ఆ పోటీల్లో విజేతగా నిలిచి 'మిస్ ముంబై-2010' టైటిల్‌ను దక్కించుకున్నది. ఇక తన తదుపరి లక్ష్యం సినిమాలు. సినిమాల్లో నటించే అవకాశం వస్తే.. తన ప్రతిభను నిరూపించుకుంటానని అంటున్నది తమన్నా.

నారా లోకేశ్‌పై పోటీ..!

సమాజంలో వారి కమ్యూనిటీకి తగిన గుర్తింపు, ఆదరణ కోసం తమన్నా నిరంతరం కృషి చేస్తున్నది. రాజకీయల్లోనూ తమను గుర్తించి, ప్రాధాన్యం ఇవ్వాలని పోరాడుతున్నది. అంతేకాదు అవినీతి, వారసత్వ రాజకీయలపై గొంతెత్తి నిరసిస్తున్నది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి నారా లోకేశ్‌పై పోటీ చేసింది తమన్నా. 'రాజకీయాలు వ్యాపారం అయిపోయాయి. అందుకే కోట్లు పెట్టి టికెట్లు కొనుక్కొని పోటీ చేస్తున్నారు. గెలిచాక మరింత సంపాదిస్తున్నారు. నాయకుడంటే ప్రజల మధ్య ఉండాలి' అంటూ తన గొంతును వినిపించింది తమన్నా. రాజకీయ అరంగ్రేటంలో ఓడిపోయినా.. ఓ చర్చను లేవనెత్తింది తమన్నా. ఇండిపెండెంట్‌గా పోటీ చేసి తమ కమ్యూనిటీ ఉనికిని తెలియజేసింది. సినీ ఇండస్ట్రీని ఓ కుదుపు కుదిపిన 'క్యాస్టింగ్ కౌచ్'పై కూడా పోరాటం చేసింది. నటి శ్రీరెడ్డికి అండగా నిలిచింది.

చీకటి నుంచి వెలుగులోకి..

చీకటి ప్రపంచం నుంచి ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్న ట్రాన్స్‌జెండర్లను సమాజం సాదరంగా ఆహ్వానించాలని అంటున్నది తమన్నా. 'మేమూ మనుషులమే. మాకూ హక్కులున్నాయి. వాటిని గౌరవించి, మాకు గుర్తింపునివ్వండి' అంటున్నది. ఈ క్రమంలో తమ కమ్యూనిటీని కించపరిచే విధంగా ఎవరు ప్రవర్తించినా వెంటనే స్పందిస్తున్నది తమన్నా. 'హిజ్రాలకు పింఛన్ ఇస్తే సరిపోదు. నెలంతా బతకడానికి రూ. 2వేలు సరిపోతాయా? ట్రాన్స్‌జెండర్లకు సమాజంలో ఇంకా తగిన గౌరవం, ఆదరణ లభించడం లేదు. అందుకే ఉద్యోగాలూ దొరకడం లేదు' అంటూ కొంతకాలంగా పోరాడుతున్నది తమన్నా సింహాద్రి. ప్రస్తుతం ఈ బిగ్‌బాస్ హౌస్‌లోకి ప్రవేశించింది. ఇంటి సభ్యుల మనసు, తెలుగు రాష్ట్రాల ప్రజల మనసు గెలుస్తానని తమన్నా ధీమాగా వెళ్లింది. ఇక బిగ్‌బాస్ హౌస్‌లో ఏం జరుగుతుందో చూడాలి.

15 యేండ్ల వయసులో ట్రాన్స్‌జెండర్‌గా మారింది తమన్నా. చిన్నప్పటి నుంచీ నటన, మోడలింగ్ అంటే ఇష్టం. ఓ ట్రాన్స్‌ఉమెన్ ఫ్రెండ్‌తో మోడలింగ్‌లో చేరింది. ఆమె సహాయంతో మోడలింగ్‌పై పట్టు సాధించింది. అలా 2010లో జరిగిన 'ట్రాన్స్ ఉమెన్ మిస్ ముంబై' పోటీలో పాల్గొన్నది. అందులో విజేతగా నిలిచి 'మిస్ ముంబై-2010' టైటిల్‌ను దక్కించుకున్నది.

నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[కరీంనగర్]
మంగళవారం 30 జూలై 2019

వాతావరణం మారుతున్నది.
చిటపట వాన చినుకులు రాలుతున్నాయి.
ముసురే కదా అని తడిచేస్తున్నాం.
తెల్లారితే.. గొంతులో మార్పు వస్తుంది.
ముక్కు నుంచి నీరు కారుతుంది.
కళ్లు ఎర్రబడిపోతాయి.
వేళ్ల మధ్యలో దురద పెడుతుంది.
ఏంటి ఈ సమస్య? ఎందుకు ఈ మార్పు?

అలర్జీ ఇక అంతం

ప్రతికూల బ్యాక్టీరియా, వైరస్ వంటివి శరీరంపై దాడిచేస్తే తెల్లరక్త కణాలు వాటితో పోరాడుతాయి. అయితే కొందరిలో ఇది ఎలాంటి హాని కలిగించని పదార్థాల వల్ల కూడా సున్నితంగా ప్రతిస్పందిస్తుంది. దీన్నే హైపర్‌సెన్సిటివిటీ లేదా అలర్జీ అంటారు. అలర్జీ కలిగించే పదార్థాలను అలర్జీస్ అంటారు.

అలర్జీ అంటే?

చెట్లు, పూలు, మొక్కల నుంచి ధూళి, పుప్పొడి రేణువులు విడుదల అవుతూ చిన్న రేణువులు ముక్కులోకి చేరి రియాక్షన్ అవుతుంది. దీనినే అలర్జీ అంటారు. చర్మం, కండ్లు ద్వారా కూడా ఇవి అలర్జీని కలిగిస్తాయి. దుమ్ము, పుప్పొడితో తుమ్ములు వస్తుంటాయి. అయితే అలర్జీతో బాధపడేవారికి తుమ్ములు ఆపకుండా వస్తుంటాయి. ముక్కు ఎరుపెక్కుతుంది. జలుబు చేసి ముక్కు వెంట నీరులా కారుతుంది. కళ్లు కూడా ఎరుపెక్కి.. నీరు కారుతుంది. ఇలాంటి సమస్యలు రావడాన్ని 'అలర్జిక్ రైనైటిస్' అంటారు. ముక్కు దిబ్బడ, గాలి సరిగ్గా ఆడకపోవడం, గొంతులోకి తెమడ రావడం, ముఖం లోపలి భాగంలో నొప్పి రావడం, తలనొప్పి వంటి సమస్యలు ఎదురవుతాయి. దీన్నే అలర్జిక్ సైనసైటిస్ అంటారు. ఈ వ్యాధి గాలి గొట్టాలలోకి, ఊపిరితిత్తులకు సోకి పొడి దగ్గు, తర్వాత తెమడతో కూడిన దగ్గుగా మొదలవుతుంది. దీనిని అలర్జిక్ బ్రాంకైటిస్ అంటారు. ఆయాసం, పిల్లికూతలు వంటి లక్షణాలు కనిపిస్తే అలర్జిక్ ఆస్తమా అంటారు.

ఎలా వస్తుంది?

శరీరం అలర్జిక్ రియాక్షన్స్ కలిగించే రేణువులు తాకినప్పుడు హిస్టామైన్ అనే రసాయనం ఉత్పత్తి అవుతుంది. కుక్కలు, పిల్లులు వంటి పెంపుడు జంతువుల అపరిశుభ్రత వల్ల కూడా ధూళి, రసాయనాల ద్వారా అలర్జీ వస్తుంది. సాధారణంగా ఇది అందరినీ ప్రభావితం చేసినా.. వ్యాధి నిరోధకశక్తి బలహీనంగా ఉన్నవారు, శరీర తత్వం సున్నితంగా ఉన్నవారు అలర్జీకి గురవుతున్నారు. అలర్జీ కొందరికి వంశపారంపర్యంగా కూడా వస్తుంది. పేరెంట్స్ వల్ల 20-47% అలర్జీ పెరిగే అవకాశం ఉంది.

చికిత్స

అలర్జీని కలిగించే పదార్థాలను గుర్తించడం ద్వారానే చికిత్స ఆధారపడి ఉంటుంది. ఒకవేళ అలర్జీలను కలిగించే పదార్థాల నుంచి తప్పించుకోలేకపోతే ఓరల్ యాంటీహిస్టామైన్స్, ఓరల్, ట్రాపికల్ స్టెరాయిడ్ స్ప్రే ద్వారా దీనిని నియంత్రించవచ్చు. అలర్జీని నియంత్రించే అత్యాధునిక చికిత్సా విధానం ఇమ్యునోథెరపీ.

లక్షణాలు

ఆగకుండా తుమ్ములు వస్తాయి. చెవులు మూసుకుపోయినట్లుగా అనిపిస్తుంది. వాసన చూసే శక్తి తగ్గిపోతుంది. గొంతులో మంట ఏర్పడుతుంది. కండ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడుతాయి. కిందిభాగం ఉబ్బినట్లు కనిపిస్తుంది. విపరీతమైన తలనొప్పి వస్తుంది. ముక్కు నుంచి నీరు కారుతుంది. ముక్కులోపల దురదగా ఉంటుంది. గొంతులో ఏదో కదిలినట్లు అనిపిస్తుంది. కళ్లు ఎరుపుగా మారి దురద పెడతాయి. చర్మంపై దద్దుర్లు వస్తాయి. చర్మమంతా దురద పెడుతుంది. దగ్గు వస్తుంది. ఆయాసం వస్తుంది.

నిర్ధారణ పరీక్షలు

అలర్జీ సమస్యలు వేధిస్తుంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలి. లక్షణాలను పరిశీలించిన తర్వాత డాక్టర్ కొన్ని పరీక్షలు చేస్తారు. ముఖ్యంగా సీబీపీ, ఐజీఈ యాంటీబాడీస్ రక్తపరీక్షలు, ఎక్స్‌రే, పీఎన్ఎస్, పీఎఫ్‌టీ పరీక్షల ద్వారా అలర్జీని నిర్ధారిస్తారు. కొందరు వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల అలర్జీకి గురైతే మరికొందరికి ఎందువల్ల అలర్జీ సమస్య వచ్చిందో కూడా తెలియదు. అలర్జిక్ స్కిన్ ప్రిక్‌టెస్ట్ ద్వారా దీనిని గుర్తిస్తాయి. అది ఒకవేళ చర్మ అలర్జీ అయితేనే ఈ పరీక్ష చేసే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పడని ఆహార పదార్థాలు తీసుకోవద్దు. మానసిక ఒత్తిడికి లోనుకాకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. నిద్ర, సమయానికి భోజనం, తగిన విశ్రాంతి తప్పనిసరిగా ఉండాలి. అలర్జీని కలిగించే పరిసరాలకు, పదార్థాలకు దూరంగా ఉండాలి. వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవాలి. శీతల పానీయాలు, చల్లటి పదార్థాలు తీసుకోవద్దు. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే మాత్రం మాస్క్ విధిగా ధరించాలి. కాస్మొటిక్స్, స్ప్రేలు, పౌడర్లు, హెయిర్ డైలు వాడేముందు డాక్టర్ సలహా తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రతిరోజు విధిగా శారీరక వ్యాయామం చేయాలి. సమయానికి నిద్రపోవాలి. భోజనం కూడా సమయానికి చేయాలి.

డాక్టర్ రవిశంకర్
ఈఎన్‌టీ స్పెషలిస్ట్
ప్రభుత్వ ఈఎన్‌టీ హాస్పిటల్
కోఠి, హైదరాబాద్

హిమోగ్లోబిన్ ఎంత ఉండాలి?

రక్తాన్ని ఎర్రగా మార్చే పదార్థం హిమోగ్లోబిన్. మాంసకృత్తులు, ఇనుము దీనిని తయారుచేస్తాయి. హిమోగ్లోబిన్ ఎవరిలో ఎంత ఉండాలి? దీని అవసరం ఏంటో తెలుసుకుంటే ఆరోగ్యంపై మంచి అవగాహన ఉన్నట్టు.

మానవ రక్తంలో ఎర్రరక్త కణాల సంఖ్య 38- 48% ఉంటాయి. ఒకవేళ రక్తహీనత ఏర్పడితే ఎర్రరక్త కణాలు తగ్గిపోతాయి. రక్తహీనతకు గురైన వ్యక్తిలో అవసరమైన స్థాయిలో ఎర్రరక్త కణాలు ఉండవు. ఫలితంగా శరీరానికి అవసరమైన ఆక్సిజన్ అందదు. హిమోగ్లోబిన్ రక్తాన్ని ఎరుపుగా మారుస్తుంది. దీని హిమోగ్లోబిన్ పరిమాణం మగవారిలో ప్రతి 100 గ్రాముల రక్తంలో 13 గ్రాములు ఉండాలి. ఆడవారిలో 12 గ్రాములు, 6 సంవత్సరాలలోపు పిల్లల్లో 11 గ్రాములు ఉండాలి. ఇక గర్భిణీల్లో 11 గ్రాములు ఉండాల్సిందే. అత్యంత కీలకదశ అయిన బాలింతలలో 12 గ్రాములు ఉండాలి. ఈ మోతాదు తగ్గితే రక్తహీనత ఏర్పడుతుంది.

ప్రాణాంతక మెనింజిటిస్

మెదడు, వెన్నెముక బాహ్య ఉపరితల ప్రాంతంలో తలెత్తే సంక్రమణే మెనింజిటిస్. అనేక రకాల వైరస్‌లు, శిలీంధ్రాలు, పరాన్నజీవులు, బాక్టీరియా వల్ల ఈ వ్యాధి వస్తుంది. ప్రాణాంతకమైన ఈ వ్యాధి గురించి కనీస అవగాహన ఉండాల్సిన అవసరం ఉంది.

బ్యాక్టీరియా ద్వారా వచ్చే మెనింజిటిస్ చాలా అపాయకరం. కొన్నిసార్లు ఇది ప్రాణాంతకంగా మారి అంగవైకల్యం లేదా మరణానికి కూడా దారితీస్తుంది. అధిక జ్వరం, వాంతులు, కండరాల నొప్పి, వికారం, దద్దుర్లు, చేతులు-పాదాలు చల్లబడడం వంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అశ్రద్ధ వహించకుండా డాక్టర్‌ను సంప్రదించాలి. చిన్నపిల్లల్లో ఎరుపు లేదా ఊదా రంగులో మచ్చలు ఏర్పడుతాయి. చర్మం సున్నితంగా మారుతుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. అస్తమానం ఏడుస్తారు. శిశువుల రోగనిరోధక వ్యవస్థ అంత బలంగా లేని కారణంగా ఈ లక్షణాలు కనిపిస్తే పరీక్షలు జరిపించాలి. యాంటీ బయాటిక్స్, పారాసెటమాల్ టాబ్లెట్స్, ఆక్సిజన్ థెరపీ ద్వారా ఈ సమస్యకు చికిత్స చేస్తారు.

స్పైసీడైట్‌తో మతిమరుపు

కొందరు ఏది తినాలనుకున్నా 'కొంచెం స్పైసీ ఉండేట్లు చూడు' అని కోరుకుంటారు. ఇంట్లో కూడా స్పైసీగా ఉంటేనే ఆస్వాదిస్తారు. కానీ ఇలాంటి డైట్ మెదడుపై చెడు ప్రభావం చూపిస్తుందని గుర్తుంచుకోండి.

'కారం తిన్న మనిషబ్బా ఇక్కడ.. ఎలాంటి రోగాలు రావు' అని కొందరు ఆరోగ్యంపై ధీమాతో ఉంటుంటారు. అలాంటి వాళ్లందర్నీ ఆలోచనలో పెట్టేసే అధ్యయనం చేశారు పరిశోధకులు. ఖతార్ యూనివర్సిటీకి చెందిన జుమిన్‌షి పరిశోధక బృందం తాజాగా 'స్పైసీ డైట్' అంశంపై అధ్యయనం చేశారు. దీంట్లో భాగంగా 4,582 మంది చైనీస్ వయోజనులను పరిశీలించారు. స్పైసీ డైట్ వల్ల డైమెన్షియా వంటి వ్యాధులు వస్తాయని వారు గుర్తించారు. దీనికి సంబంధించి 55 సాక్ష్యాధారాలను కూడా సేకరించారు. స్పైసీ.. మంచి రుచిని ఇస్తుండొచ్చు కానీ అది మెదడుపై చెడు ప్రభావం చూపి జ్ఞాపకశక్తి తగ్గేలా ప్రేరేపిస్తుందట. వాళ్లు పరిశీలన చేసిన చైనీయుల్లో చాలామంది రోజుకు 50 గ్రాముల కారం తింటున్నారట.

విటమిన్-కె రోజుకు ఎంత?

విటమిన్‌లలో తక్కువ మోతాదులో అవసరమయ్యేది విటమిన్ కె. రక్తం గడ్డకట్టడంలో ఇది ఉపయోగపడుతుంది. ఎముకలు, ఇతర కణజాల జీవక్రియలకు ఇది చాలా అవసరం. విటమిన్-కెలో రెండు రకాలు ఉన్నాయి. ఏ వయసువారు రోజుకు ఎంత మోతాదులో విటమిన్-కె తీసుకోవాలో చూడండి.

చిన్న పిల్లలు	: 10-20 మైక్రోగ్రాములు.
25 ఏండ్ల లోపు వాళ్లు	: 120 మైక్రోగ్రాములు.
60 ఏండ్ల లోపువాళ్లు	: సుమారు 90 మైక్రోగ్రాములు.

ప్రాణానికి రక్షణ ప్లేట్‌లెట్స్

వాతావరణంలో మార్పుల వల్ల డెంగ్యూ, మలేరియా, వైరల్ తీవ్రత పెరుగుతుంది. వీటివల్ల చాలామందికి ప్లేట్‌లెట్స్ సమస్యే ఎక్కువగా ఉంటుంది. ఇంతకూ ప్లేట్‌లెట్స్ అంటే ఏంటి? వాటి వల్ల కలిగే ఉపయోగం ఏంటి? వాటిని ఎలా ఎక్కిస్తారు? రక్తం గురించి విన్నా.. మరి ఈ ప్లేట్స్‌లెట్స్ కథాకమామీషు ఏంటో తెలుసుకుందాం.



తెల్ల రక్తకణాలు వ్యాధి నిరోధకాలుగా పనిచేస్తూ శరీరం రోగాలమయం కాకుండా కాపాడుతుంటాయి. ఎర్ర రక్తకణాల్లో ఉండే హిమోగ్లోబిన్ ద్వారా శరీరం మొత్తానికి అవసరమైన ఆక్సిజన్ అందిస్తుంది. ఇక మిగిలినవి ప్లేట్ లెట్స్. శరీరానికి గాయం అయినప్పుడు రక్తం గడ్డకట్టడానికి తోడ్పడుతాయి. ఇవి అందరిలోనూ ఒకే విధంగా ఉండవు. సాధారణంగా ఒక వ్యక్తిలో 1.5 లక్షల నుంచి 4.5 లక్షల ప్లేట్‌లెట్స్ ఉంటాయి. ప్లేట్‌లెట్స్ కణం 7-10 రోజుల వరకు బతికి ఉంటుంది. ఎముక మజ్జలో ఏర్పడిన కొత్త ప్లేట్‌లెట్స్ మళ్లీ రక్తంలో చేరుతాయి. రక్తాన్ని గడ్డ కట్టించి ప్రాణరక్షణ కలిగించే కీలకమైన కణాలు ప్లేట్‌లెట్స్.

ఎందుకు తగ్గుతాయి?

శరీరంలో ప్లేట్‌లెట్స్ తగ్గడానికి చాలా కారణాలు ఉన్నాయి. డెంగ్యూ, మలేరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ వల్ల శరీరంలో ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. కొందరికి పుట్టుకతో జన్యు సమస్యల వల్ల ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. మరికొందరికి కొన్ని రకాల మందులు పడకపోవడం వల్ల తగ్గుతాయి. ప్రస్తుత జనరేషన్‌లో గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు రక్తం పలుచబడటానికి ఉపయోగించే మందుల వల్ల ప్లేట్‌లెట్స్ సంఖ్య, నాణ్యత తగ్గిపోతున్నాయి. శరీరంలో ప్లేట్‌లెట్స్ మరీ తక్కువగా ఉన్నపుడు ఏ గాయం లేకపోయినా రక్తస్రావం అవుతుంది. ప్లేట్‌లెట్స్ సక్రమంగా తమ విధిని నిర్వహించలేకపోతే రక్తస్రావం ఆగదు. దానికి ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోవడం గానీ ప్లేట్‌లెట్ల నాణ్యత తగ్గిపోవడంగానీ కారణం కావచ్చు. ప్లేట్ లెట్లు సాధారణంగానే ఉన్నా అవి నాణ్యంగా లేకపోతే రక్తస్రావం ఆగదు.

ఎలా గుర్తించాలి?

సాధారణంగా ప్లేట్‌లెట్ల సంఖ్య పది వేలకు తగ్గే వరకు ఏ లక్షణాలు కనిపించవు. ఒకవేళ అంతకన్నా తక్కువగా పడిపోతే మాత్రం శరీరంలోని వివిధ అవయవాల్లోని లోపలి పొరల్లోంచి రక్తస్రావం మొదలవుతుంది. నోటి లోపలి పొర, చిగుళ్లు, ముక్కు లోపలి పొరల్లోంచి రక్తస్రావం ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిన ప్రతి ఒక్కరిలోనూ అనారోగ్య లక్షణాలు కనిపించాలని లేదు. కొందరిలో ఏ లక్షణాలూ కనిపించవు. ముఖ్యంగా డెంగ్యూ వస్తే తీవ్ర జ్వరం వస్తుంది. తీవ్రమైన జ్వరం, ఒళ్ళు నొప్పులు ఉంటే కూడా ప్లేట్‌లెట్స్ తగ్గినట్లు గుర్తించాలి.

ఎవరికి ఎక్కించాలి?

శరీరంలో ప్లేట్‌లెట్స్ ఏమాత్రం తగ్గినా వెంటనే ప్లేట్ లెట్స్ ఎక్కించాలనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. అది సరికాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం ప్లేట్‌లెట్లు పది వేలకు తగ్గితేగానీ ఎక్కించకూడదు. ఒకవేళ పది వేల కన్నా ఎక్కువగా ఉండి రక్తస్రావం అవుతుంటే మాత్రం ప్లేట్‌లెట్స్ ఎక్కించవలసి ఉంటుంది. శరీరానికి సహజంగానే తగ్గిపోయిన ప్లేట్ లెట్స్ కణాలను తిరిగి ఉత్పత్తి చేసుకునే శక్తి ఉంటుంది. అందుకే అత్యవసర సమయాల్లో మాత్రమే ప్లేట్‌లెట్స్ ఎక్కించాలి.

నిర్ధారణ తప్పనిసరి

శరీరంలో ప్లేట్‌లెట్స్ సంఖ్య ఎందుకు తగ్గుతుంది అనే అంశంపై సరైన వ్యాధి నిర్ధారణ జరిగితే చికిత్స సులువవుతుంది. డెంగ్యూ కారణంగా కొందరిలో ప్లేట్‌లెట్స్ సంఖ్య చాలా వేగంగా పడిపోతు ఉంటుంది.. వీరికి డెంగ్యు చికిత్సతో పాటు అవసరాన్ని బట్టి ప్లేట్ లెట్స్ ఎక్కించవలసి ఉంటుంది. వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా ప్లేట్ లేట్ల సంఖ్య పడిపోతే వారం పదిరోజుల్లో నియంత్రణలోకి వస్తాయి. మలేరియా కారణంగా ప్లేట్‌లెట్స్ పడిపోతే అదేచికిత్స అందించాలి. ఏవైనా మందుల కారణంగా ప్లేట్‌లెట్స్ పడిపోతూ ఉంటే డాక్టర్ పర్యవేక్షణలో వాటిని మానేయాలి.

చికిత్సా విధానాలు

గతంలో ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గితే ఎక్కువగా చనిపోయే ప్రమాదం ఉండేది. కానీ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ అత్యాధునిక విధానాలతో చికిత్స అందిస్తూ ప్రాణాపాయం నుంచి రక్షించగలుగుతున్నారు. రక్తంలో ప్లేట్ లెట్స్ తగ్గితే దాత నుంచి లేదా సేకరించిన రక్తం నుంచి కేవలం ప్లేట్‌లెట్స్‌ను మాత్రమే వేరుచేసి ఎక్కించే అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. సింగిల్ డోనార్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డిపి), రాండమ్ డోనార్ ప్లేట్‌లెట్స్ (ఆర్‌డిపి) పద్ధతులలో రక్తం నుంచి ప్లేట్‌లెట్స్ ను వేరుచేసి అవసరమైన వారికి ఎక్కిస్తున్నారు. ఎస్‌డిపి విధానంలో దాత నుంచి నేరుగా ప్లేట్‌లెట్స్‌ను సేకరిస్తారు. ఆర్‌డిపి విధానంలో సేకరించిన రక్తం నుంచి ప్లేట్‌లెట్స్‌ను వేరుచేస్తారు. అయితే ఎస్‌డిపి విధానంలో ఒకసారి 50-60 వేల వరకు ప్లేట్‌లెట్స్ ను సేకరించే అవకాశం ఉంటుంది.

డాక్టర్
అమిత్ కుమార్ సర్దా
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
మలక్ పేట్

సుడోకు

డైలీ సుడోకు 106 సమాధానం

9	8	3	4	5	2	6	7	1
4	6	2	7	9	1	8	5	3
1	7	5	6	3	8	2	4	9
6	5	7	1	4	3	9	8	2
3	4	9	8	2	7	1	6	5
2	1	8	5	6	9	7	3	4
8	3	1	2	7	4	5	9	6
5	2	4	9	8	6	3	1	7
7	9	6	3	1	5	4	2	8

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -107

		8			1		3	
		6				8		
4		5			7			
			8			1		5
	8		2		9		4	
1		7			6			
			7			4		6
		2				5		
	7		9			3		

ట్వీట్



తెలుగు సాహిత్యానికి వన్నెతెచ్చిన తెలంగాణ సాహితీ సౌరభం, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి గారి జయంతి సందర్భంగా వారికి నివాళులు.

కేటీఆర్
@KTRTRS

కేటీఆర్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

18,14,741

కామన్‌మ్యాన్ వాయిస్

నదీ గర్భాన్నే జలాశయంగా మార్చి 11 కిలోమీటర్లు కాళేశ్వరం నుంచి ధర్మపురి దాకా గోదావరిని జీవనదిగా చేసింది కాళేశ్వరం ప్రాజెక్టు. జై తెలంగాణ.
- Vijaykumar Chitneni

వారం.. పది రోజులు ఎస్సారెస్పీ, కడెం మీది ప్రాంతాల్లో భారీ వానలు పడాలె. అప్పుడు కింది నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు.. పైన పోచంపాడు, కడెం ఎల్లంపల్లి నిండితే మొత్తం గోదావరి నీళ్లతోటి కళకళలాడుతుంది.
- Burra Manohar Goud

అందరూ అంటారు.. మనవారెవరైనా దూరంగా ఉంటే బాధగా ఉంటుందని. కానీ మనుషులు దగ్గరగా ఉండి.. మనసులు దూరంగా ఉంటేనే ఇంకా అధికమైన బాధ.
- Gadmur David Elia

వైరల్ వీడియో

సంపూర్ణేష్ కొబ్బరిమట్టతో వస్తున్నాడు తెలుసు కదా? అయితే దీంట్లో అద్భుతాలు చాలానే చేశాడట. లాంగెస్ట్ సింగిల్‌షాట్ డైలాగ్‌తో ప్రపంచరికార్డు సృష్టించాడట. అదేంటో ఈ వీడియోలో చూడండి!

World Record | Longest Single Shot Dialogue | Sampoornesh Babu | Daily Culture
Total views : 585,417+
Published on Jul 28, 2019

పెద్దపులుల పట్ల పెద్దమనసు

శాస్త్రీయం

2010 నుంచి ప్రతీ సంవత్సరం జూలై 29న 'అంతర్జాతీయ టైగర్ డే'ని జరుపుకుంటున్నాం. పెద్ద పులులు ఎంత వన్యమృగాలైనా ప్రకృతి పట్ల మనుషులంత ప్రమాదం మాత్రం కావు. వీటి పరిస్థితి ఇప్పుడు ఎంత దయనీయంగా తయారైందంటే, ఒక అంచనా (2016లోని అధ్యయనం) ప్రకారం ప్రపంచవ్యాప్తంగా వీటి సంఖ్య కేవలం 3900 మాత్రమే. 20వ శతాబ్ది ఆరంభం నుంచీ నేటికి (ఈ వందేండ్లలో) దాదాపు 95 శాతం పులులు నశించిపోగా, ఇప్పుడు మిగిలినవి ఆ అయిదు శాతమే. పెద్దపులుల పట్ల మనం పెద్ద మనసు చేసుకోవడానికి ఇంతకంటే మంచి సమయం వస్తుందా? ఇంత పెద్ద జంతుజాతి కేవలం మానవ తప్పిదాల వల్ల వినాశనమై పోయిందన్న అపవాదు మానవజాతికి అవసరమా? క్షీణించిపోతున్న పులుల సంఖ్య నేపథ్యంలో రష్యాలోని ఓడరేవు పట్టణమైన సెయింట్ పెటర్స్‌బర్గ్‌లో 2010లో జరిగిన 'టైగర్ సమిట్'లో ఈ మేరకు ప్రతి ఏడాది జూలై 29ని 'పెద్దపులి దినోత్సవం'గా జరుపుకోవాలని నిర్ణయించారు. అప్పట్నుంచీ పెద్దపులుల సంరక్షణపట్ల ప్రజలలో అవగాహన పెరుగుతున్నా ఇది చాలదు. వీటి సంఖ్య రాబోయే మరో రెండేండ్లలో రెట్టింపు అయినా కావాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

నగరాలకు ఉష్ణోగ్రతల ముప్పు

పర్యావరణం

వాతావరణంలోని ఉష్ణోగ్రతలు ఇలాగే పెచ్చుమీరి పోతుంటే మరో మూడు దశాబ్దాలలో ప్రపంచవ్యాప్తంగా వున్న వందలాది నగరాల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారు కాగలదని శాస్త్రవేత్తలు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

'నగర జీవితం ఎంత సుఖమో కదా' అనుకొని మురిసిపోయే రోజులు పోయాయి. పల్లెల్లోని ప్రాకృతిక ప్రశాంతత పట్నాల్లో ఎక్కడిది? కాంక్రీటు పరిసరాలకు తోడు అనూహ్య శిలాజ ఇంధన వాడకాలు వాయుకాలుష్యాన్ని పెంచి పోషిస్తున్న దశలో 'గోరుచుట్టు మీద రోకలిపోటు'లా రానున్న కొద్ది దశాబ్దాలలో వాతావరణ ఉష్ణోగ్రతలు అనూహ్య స్థాయిలో పెరగనున్నట్లు శాస్త్రవేత్తలు ఘాటుగా హెచ్చరిస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే 2050 కల్లా ప్రపంచంలోని మొత్తం 520 ప్రధాన నగరాలలో 2 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదం ఉన్నదని వారు అంటున్నారు. అప్పుడు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొన్న నగరాల పరిస్థితే మిగిలిన అనేక సిటీలకు కలుగవచ్చునని వారు తెలిపారు. ఉదా॥కు బార్సెలోనా (స్పెయిన్) మాదిరిగా లండన్ (ఇంగ్లాండ్), ప్యారిస్ (ఫ్రాన్స్)ను మించిపోయి ఎడిన్‌బర్గ్ (స్కాట్లాండ్), మెల్బోర్న్ (ఆస్ట్రేలియా)లా లీడ్స్ (ఇంగ్లాండ్), మోంటెవీడియో (ఉరుగ్వే)వలె కార్డిఫ్ (యుకె) నగరాలు తీవ్రస్థాయిలో వేడెక్కి పోతాయని వారు అంటున్నారు.

తేనెటీగల తేజోశక్తి!

'భూమి గురుత్వాకర్షణ క్షేత్రానికి చెందిన సంకేతాలను తేనెటీగలు చాలా తేలిగ్గా (hypersensitive) పట్టేస్తాయని' శాస్త్రవేత్తలు అంటున్నారు. దీనితోపాటు విద్యుదయస్కాంత తరంగాల ద్వారా కూడా ఇవి వాతావరణంలో సంభవించబోయే 'ఉరుములతో కూడిన మెరుపుల' సమాచారాన్ని ముందే పసిగడతాయని కూడా వారు అంటున్నారు. ఇక, మనం తేలిగ్గా తీసిపారేసే సాలీళ్లదైతే అద్భుత స్పర్శజ్ఞానం (Sensitive to Touch). వీటి కాళ్లపైన అసంఖ్యాకమైన వెంట్రుకలు ఉంటాయని, వాటి ఆధారంగానే

అవి ఏదేని వస్తువు, జంతువు కదలికలను తక్షణం కనిపెడతాయని వారన్నారు.

జంతు ఇంద్రియ జాలం!

మనుషుల ఇంద్రియజ్ఞానాల్ని మించిన అద్భుతశక్తులు జంతువులకు ఉన్నాయంటే ఆశ్చర్యమే మరి

శరీర నిర్మాణ శాస్త్రం

సూక్ష్మజీవులు, చీమలు, ఈగలు, దోమల నుంచి మొదలుకొని చేప, సాలీడు, ఆక్టోపస్, పాములు, ఏనుగుల వరకు అనేక రకాల జంతువులు తమ మనుగడ కోసమైతేనేం, మరో కారణం వల్లనైతేనేం అసాధారణ ఇంద్రియజ్ఞానాల్ని, మానవాతీతమైన అద్భుతశక్తుల్ని కలిగి ఉంటున్నాయని ఇటీవల శాస్త్రవేత్తలు పరిశోధనాత్మకంగా రూఢీ పరిచారు. 'వాటి జీవన నైపుణ్యాల ముందు మన ఇంద్రియాల జ్ఞానం ఒక రకంగా పూర్తిగా దిగదుడుపేనని' కూడా వారు తేల్చారు. మనకంటే అనేక రెట్లు అధిక జీవన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న ఆ జంతుజాలం నుంచి తెలుసుకోవాల్సింది ఎంతో ఉంది.

మానవాభివృద్ధికి, వైజ్ఞానిక ప్రగతికి అడుగడుగునా ఆదర్శ నమూనాగా నిలుస్తున్న జీవజాతులు, వాటి శరీరధర్మాలు, నిర్మాణ తీరుతెన్నులపట్ల శాస్త్రవేత్తల పరిశోధనలు నిరంతరం సాగుతూనే ఉన్నాయి. మారుతున్న పర్యావరణ పరిస్థితులు ఒకవైపు కొన్ని జంతుజాతులకు ప్రాణాంతకమవుతుంటే, మరికొన్ని వాటిని అధిగమిస్తున్న తీరు అనూహ్యం. నిత్య జీవితంలో మనకు కనిపించే చాలావరకు జీవజాతులు తమ ఆహారాన్వేషణ, ప్రాణరక్షణకోసం అద్భుత ఇంద్రియశక్తులనే కనబరుస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. అనేక జీవావరణాలు కనుమరుగవుతున్న తరుణంలో కొత్త పర్యావరణ పరిస్థితులలోనూ అవి అనూహ్యంగా మనుగడ సాగిస్తుండడం వారిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నది.

మనిషికి గల ఇంద్రియజ్ఞానాలు అయిదు (దృష్టి, వాసన, వినికిడి, రుచి, స్పర్శ) మాత్రమే. కానీ, కొన్ని రకాల జంతువులు వీటిని మించిన స్థాయిలో మరిన్ని ప్రత్యేక శక్తులనూ కలిగి ఉన్నట్టు పరిశోధనల్లో తేలింది. మనకు అసాధ్యమైన ఇంద్రియ శక్తులనూ అవి ప్రదర్శిస్తున్నాయని వారంటున్నారు. దృష్టిజ్ఞానం (Vision) లో అతినీల లోహిత (Ultraviolet), పరారుణ (Infrared), నిశీథి వీక్షణాల (Night-vision) ను, వినికిడి (hearing) లో అతి-అత్యంత సున్నిత (Ultra-Infra sounds) శబ్ద తరంగాలను, వాసన, రుచి, స్పర్శలలోనూ మన కంటే ఎన్నో రెట్లు అధికశక్తిని అవి కనబరుస్తున్నట్లు వారు గుర్తించారు. ఇంకా, విద్యుత్ వాహకగుణంతోపాటు అయస్కాంత, గురుత్వాకర్షణ తరంగాలను పసిగట్టడంలోనూ అనూహ్య సామర్థ్యాన్ని కనబరిచే జంతువులూ ఉన్నట్లు వారు వెల్లడించారు.

మనకున్న ఈపాటి ఇంద్రియశక్తులే గొప్పనుకుంటే ఇక పొరపాటే. మన చుట్టూ వున్న వృక్ష, పక్షి, జంతుజాలాల ఇంద్రియ జ్ఞానాల ముందు ఇవి అత్యల్పమని శాస్త్రవేత్తలు అంటున్నారు. కొన్ని లక్షలు, కోట్ల సంవత్సరాలుగా శరీరపరంగా మనకంటే ఎంతో చిన్నవైన ఈ జీవజాతులు భూమిపై మనుగడ సాగిస్తుండడం వెనుక వాటి జీవన నైపుణ్యాలే ప్రధాన కారణంగానూ వారు చెబుతున్నారు. అంతటి అతీత స్థాయిలో మనల్ని మించిన శక్తులు వాటికి ప్రకృతి సిద్ధంగానే లభించినా మానవాళి చర్యలవల్ల కొన్ని జాతులు నాశనమవుతూనే ఉన్నాయి. చీమలనుంచి ఏనుగుల దాక కొన్ని జంతువులలోని శక్తియుక్తుల్ని తెలుసుకొన్నాకైనా వాటి సంరక్షణపట్ల సానుకూల దృక్పథాన్ని కనబరచవలసిన అవసరాన్ని అందరం గుర్తిద్దాం.

చీమ తన బరువుకన్నా సుమారు 20 రెట్లు అధిక బరువును మోసుకెళుతుంది. బెల్లం, చక్కెర, తేనె వంటి తీపి పదార్థాలు నేలపై ఎక్కడ పడినా కొద్ది నిమిషాలలోనే వాటిచుట్టూ ఎర్ర, నల్ల చీమలు గుంపులు గుంపులుగా చేరుతాయి. వాటి వాసన శక్తి అంతటిది మరి. అలాగే, ఈగ గాలిలో ఎగిరే వేగం గంటకు సుమారు 4.5 మైళ్ల (7.5 కి.మీ.) దూరం. బాహ్య- పరాన్న సూక్ష్మజీవుల్లోని శక్తియుక్తుల గురించైతే చెప్పక్కర్లేదు. 'పాలను పెరుగుగా మార్చడం' నుంచి ఎన్నో నైపుణ్యాలు. కాకపోతే, వాటిలో మంచితోపాటు చెడువీ లేకపోలేదు. మానవేతర జీవులు, జంతువులు ప్రదర్శించే ఇలాంటివన్నీ కొందరికి చాలా తేలిగ్గానే అనిపించవచ్చు. 'చిన్న శరీరానికి తగ్గట్టుగానే వాటి శరీర నిర్మాణ పోకడ ఉంటుందని, ఇది సహజమేనని' సరిపెట్టుకొనే వాళ్లుంటారు. కానీ, మరికొన్ని జంతువుల విశేషాలు వింటే ఎవరికైనా ఆశ్చర్యం కలగకమానదు.

క్షీరదాలలో గుడ్లు పెట్టే జంతువులు చాలా అరుదు. 'ప్లాటిపస్' (Platypus) అనే అర్ధజలచరం, 'ఎచిడ్నస్' (echidnas) గా పిలిచే 'చీమలను తినే జంతువు'.. ఈ రెండు మాత్రమే ఇలా గుడ్లు పెట్టే 'పాలిచ్చే జంతువుల' (mammals) జాబితాలో ఉన్నట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చిన్న వెన్నెముక లేని జీవుల్ని పట్టి తినడానికి 'ప్లాటిపస్' తన శరీరంలో అత్యున్నతంగా ఎదిగిన విద్యుత్ సంబంధమైన ఇంద్రియశక్తి (Electroreception) ని ఉపయోగించుకొంటున్నట్టు వారి పరిశోధనల్లో తేలింది. నీటి అడుగు నుండి విద్యుత్ సంకేతాల ద్వారా అది వాటిని పసిగడుతుందని అంటున్నారు. శబ్ద తరంగాల సంకేతాల (Echolocation)తో తాను వేటాడబోయే జీవి వున్న ప్రదేశాన్ని గబ్బిలాలు చీకట్లో సైతం గుర్తించేస్తాయి. వైపర్స్ (vipers), పైథాన్స్ (pythons), బోవస్ (boas) పేరున పిలిచే పాముల కైతే మన అయిదు ఇంద్రియాలతోపాటు ఆరో ఇంద్రియమూ ఉంటుంది. అదేమంటే, కటిక చీకట్లో సైతం వీటికి దారి తెలుస్తుంది. 'పరారుణ (ఉష్ణ) వికిరణ శక్తి' వల్లే వాటికి ఇది సాధ్యమవుతున్నట్టు పరిశోధకులు కనుగొన్నారు. ఆఖరుకు పై కుటుంబానికే చెందిన కొన్ని రకాల గుడ్డి పాములు కూడా తాము వేటాడాల్సిన జీవుల్ని ఎంతటి చీకట్లోనైనా వెళ్లి పట్టేసుకుంటాయని వారు అంటున్నారు.

దృష్టి జ్ఞానంలో ఆక్టోపస్ శక్తి అసాధారణం. అఖాతగర్భంలో, చిమ్మచీకట్లోనూ ఇవి తమలోని 'కాంతి నియంత్రిత దృష్టి' (Polarized Vision) జ్ఞానంతో తాము వేటాడబోయే జీవుల పైకి దాడిచేస్తాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. పొడవాటి మీసాలతో ఉండే 'క్యాట్‌ఫిష్'కైతే ఒంటినిండా రుచి గ్రాహకాలే ఉంటాయి. సగటున మనిషికి 10,000 రుచి మొగ్గలు (గ్రాహకాలు) ఉంటే, ఈ రకమైన చేప శరీరమంతా కలిసి 1,75,000 అతిసున్నిత రుచి గ్రాహక కణాలు ఉన్నట్లు వారు గుర్తించారు. ఆఖరకు వీటి మీసాలకూ రుచి చూసే శక్తి ఉంటుందని వారు అంటున్నారు. ఇక, జంతుసామ్రాజ్యంలోనే మరి దేనికీ లేనంత 'అధిక వాసన శక్తి' ఆఫ్రికాకు చెందిన బుష్ ఎలిఫెంట్ (ఏనుగు)కు ఉంటుంది. దీని తొండం లోపల 2,000 శక్తివంతమైన వాసనను పట్టేసే సెన్సర్లుంటాయని, మనిషికి అవి కేవలం 400 మాత్రమేనని వారు చెప్పారు.

పది మైళ్ల దూరంలోంచే పైన్ (pine) చెట్టు కాలుతున్న మంట వాసనను ఒక చిన్న కీటకం (Jewel Beetle) గుర్తిస్తుండడం విశేషమే. 'ఇవి తమ గుడ్లను ఈ చెట్లపైనే పెడతాయి, కాబట్టే వాటికి ఆ కాలుతున్న వాసన తెలిసిపోతుందని' శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎక్కువగా గుహలలోని జలాలలోనే నివసించే 'కేవ్ ఫిష్'కు ఆశ్చర్యంగా 'కంటిచూపు ఉండకున్నా, వినికిడి శక్తి మాత్రం' అద్భుతం. అతిచిన్న (1 కిలోహెర్ట్జ్ కంటే కూడా తక్కువ స్థాయిలోని) శబ్ద సంకేతాలనైనా సరే ఇవి తేలిగ్గా పట్టేస్తాయని, ఈ అద్భుత సామర్థ్యంతోనే అవి తమకు కావలసిన ఆహార జీవులను వేటాడుతాయని వారు అన్నారు. సముద్రాలలో నివసించే జలచరం 'మాంటిస్ ష్రింప్' (Mantis Shrimp) దృష్టిజ్ఞానం గురించి చెబితే మనకు మరింత ఆశ్చర్యమేస్తుంది. దీని చూపు అత్యంత సంక్లిష్టమని, అతినీల లోహిత, వృత్తాకార నియంత్రిత కాంతుల్ని సైతం పట్టేయగల 16 రకాల కాంతి డిటెక్టర్లను ఇది కలిగి ఉంటుందని పరిశోధకులు పేర్కొన్నారు. ఈ సముద్ర జలచరం (marine crustacean) రెండు కండ్ల చూపుల్ని విడివిడిగానూ ప్రసరింపజేయగలదని వారన్నారు.

దోర్బల బాలశేఖరశర్మ

బాక్స్‌ఫిష్‌ల రూప నైపుణ్యం

ప్రకృతి పాఠం

చేప మనిషికి ఈతను నేర్పినట్లే, కొన్ని రకాల మత్స్యాల రూప నైపుణ్యం శాస్త్రవేత్తలకు కొత్త యాంత్రిక శక్తిని, సాంకేతికతను అందిస్తున్నది. నీటిలో వేగంగా దూసుకుపోయే 'బాక్స్‌ఫిష్' జాతి చేపలను పోలిన కొన్ని కార్లు ఇవాళ వేగంలోను, ఇంధన పొదుపులోనూ అద్భుతాల్ని సృష్టిస్తున్నాయి.

చేపలన్నింటిలోకీ 'ఎల్లో బాక్స్‌ఫిష్'లది ప్రత్యేక జాతి. సుమారు అర మీటరు (45 సెంటీమీటర్లు లేదా 18 అంగుళాలు) పొడవు వరకూ పెరిగే ఈ జాతిచేపలు మహాసముద్ర (పసిఫిక్, హిందూ, అట్లాంటిక్ వంటి) జలాల్లోనే కనిపిస్తాయి. బాల్యదశలో ఉండగా పసుపురంగును, వయసు పెరుగుతున్న కొద్దీ నీలం బూడిదరంగునూ పుణికి పుచ్చుకొనే వీటి రూప సామర్థ్యం అసాధారణం. విలక్షణ ఆకృతే దీనికి అంతటి జలశక్తి (Hydrodynamic)ని ఇచ్చిన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ చేప సాంకేతికతను అందిపుచ్చుకొన్న ఇంజినీర్లు ఇప్పటికే కొన్ని ప్రత్యేక కార్లను తయారు చేశారు.

ఇతర చేపల వలె కాకుండా బాక్స్‌ఫిష్‌లు సాగరజలాల్లో ఎలాంటి ఒత్తిళ్లు, అవాంతరాలకు గురికావు. ఆహారవేటలో భాగంగా ఇవి చాలా వేగంగా ఈదేస్తుంటాయి. వీటి ఆకృతిని పోలిన శక్తిని ఆధారంగా చేసుకొనే ఆటోమొబైల్ ఇంజినీర్లు విలక్షణమైన కార్లను ఈమధ్య కాలంలో ప్రవేశపెట్టారు. ఇవి అతితక్కువ బరువుతో రెండే తలుపులను కలిగి ఉండడం విశేషం. 'ఎయిరో డైనమిక్స్' సాంకేతికతను ఇవి మించిపోయాయి. ఈ కార్లు అతి తక్కువ ఇంధన వ్యయంతో ఎంతో ఎక్కువ దూరాన్ని ప్రయాణించడంలో విజయం సాధించినట్లు నిపుణులు ప్రకటించారు. ఉదా॥కు ఒక గ్యాలెన్ (3.7 లీటర్లు) ఇంధనంతోనే 84 మైళ్ల దూరం వరకూ ప్రయాణించే శక్తిని వీటికి ఆపాదింపజేసినట్లు వారు చెబుతున్నారు. చిన్న ముఖం, వెడల్పయిన శరీరం, గుండ్రటి ఆకారంతో ఉండే బాక్స్‌ఫిష్‌ల ఈదే శక్తిని గుర్తుకు తెచ్చేలా ఒక ప్రముఖ కార్ల కంపెనీ (మెర్సెడెస్) తయారుచేసిన ఓ కారు వేగం గంటకు 118 మైళ్లుగా నమోదైనట్లు వారు వెల్లడించారు. ఇది కేవలం 8 సెకన్లలోనే 60 మైళ్ల (గంటకు) వేగాన్ని అందుకోగలదనీ అంటున్నారు. దీని 'డైరెక్ట్ ఇంజెక్షన్ డీజిల్ ఇంజిన్'తో యూరోపియన్ రోడ్లపై 4.3 లీటర్ల ఇంధనంతో 100 కి.మీ. మేర ప్రయాణించవచ్చునని వారు అంటున్నారు.

బాక్స్‌ఫిష్‌లనే కాకుండా గుర్రాలు, దుప్పిలు, మగ గొర్రెలు, పక్షులు వంటి జంతువుల ఆకృతులు, పరుగుల శక్తి సామర్థ్యాల్ని ఆధారంగా చేసుకొని కూడా మరికొన్ని కంపెనీలు తమవైన కార్లను గత కొన్నాళ్లుగా ప్రవేశపెడుతున్నాయి. వాటిలో ఫోర్డ్ మస్టాంగ్ (Ford Mustang అడవి గుర్రం), చెవెరొలెట్ ఇంపాలా (Chevrolet Impala కృష్ణజింక), డాడ్జ్‌రామ్ (Dodge Ram మగ గొర్రె), కోర్‌వెట్టే స్టింగ్రే (Corvette Stingray చదును చేప), పోర్‌స్కీ కేయెన్ (Porsche Cayenne మొసలి), వోక్స్‌వేగన్ బీటిల్ (Volkswagen Beetle పురుగు), నిస్సాన్ బ్లూబర్డ్ (Nissan Bluebird నీలం రంగుపక్షి) వంటివి వున్నాయి.

-డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి

అవి ఎక్కువైనా, తక్కువైనా కష్టమే!

ఆహారశాస్త్రం

పిండి పదార్థాలు (Carbohydrates) శరీరానికి ఎంత అవసరమో అంతే ఉండాలి. ఎక్కువైనా, తక్కువైనా కష్టమేనని నిపుణులు చెప్తారు. లోటు ఏర్పడినప్పుడు కానీ లేదా అవి ఎక్కువైనప్పుడు కానీ వీటి ప్రభావం దేహంపై చాలా స్పష్టంగా పడుతుంది. పిండి పదార్థాలు చాలినంతగా లేకపోతే ప్రధానంగా ఒంట్లో శక్తి లోపిస్తుంది. ఫలితంగా బరువు తగ్గి, భౌతికంగా త్వరగా అలసటకు గురవుతాం. ఇది పనిలో 'సామర్థ్య కొరత'కు దారి తీస్తుంది. ఒకవేళ మనం తీసుకొనే ఆహారంలో పిండి పదార్థాలు మరీ ఎక్కువైపోతే దేహంలో అవి కొవ్వుగా మారిపోవడమో లేదా శరీరంలోనే నిలువ వుండడమో జరుగుతుంది. దీన్నిబట్టి వీటితో కూడిన ఆహారాన్ని అధికంగా తీసుకోవడం మూలంగా శరీరపరంగా ఎక్కువ బరువు పెరిగిపోతాం. ఫలితంగా మధుమేహం (డయాబెటిస్), అధిక రక్తపోటు (హై బీపీ) వంటి వ్యాధులకూ ఇది మరొక రకంగా కారణమవుతుందని నిపుణులు అంటున్నారు.

ఎవరేమన్నారు?

విజ్ఞానశాస్త్రంలోనూ నమ్మకమంటూ ఒకటుంటుంది. మనం సిద్ధాంతాలను రూపొందిస్తాం. ఒక్కోసారి వాటిని నిరూపించలేం. కానీ, వాటిపట్ల అపారమైన నమ్మకమైతే ఉంటుంది కదా.

-చార్లెస్ హెచ్. (హార్డ్) టౌన్స్
అమెరికా భౌతిక శాస్త్రవేత్త,
జయంతి: జూలై 28,
జీవితకాలం: 1915-2015

అందానికి, ఆరోగ్యానికి దంతాలు

పనితనం

దేహంలోని అత్యంత పటిష్ఠమైన పదార్థంతో తయారైనవే నోటి దంతాలు. ఇవి ముఖసౌందర్యానికి, దేహారోగ్యానికి ఎంతో ముఖ్యం. పండ్లు లేనివారికే వాటి విలువ, లోటు, పనితనం తెలుస్తాయి. మనం తినే ఆహారాన్ని ముక్కలుగా చేసి, గుజ్జులా మార్చుకోవడానికి ఇవి తప్పనిసరి. మాట స్పష్టంగా పలుకడానికీ దంతాలు బాగా ఉపయోగపడుతై. ఇవి లేకపోతే దవడలు దగ్గర పడి, చెంపలు చూడడానికి వికారంగా, ముఖం వృద్ధాప్య ఛాయలను సంతరించుకొంటుంది. దంతాలు నాలుగు రకాలు (ముందరి లేదా కత్తెర పళ్లు, కోరపళ్లు, రెండు బుడిపెల పళ్లు, నమిలే దవడ పళ్లు). నోటిలోని వీటి మూలాలు పై దవడ, దిగువ దవడల్లో ఉంటాయి. బిడ్డ పుట్టిన కొద్ది నెలలకే తొలిదశలోని పాలపండ్లు వస్తాయని నిపుణులు అంటారు. కొందరికైతే పుట్టుకతోనే ఒకటో, రెండో పండ్లుంటాయనీ వారన్నారు. పంటిమీది తెల్లని ఎనామిల్ గట్టి ఖనిజమైన క్యాల్షియమ్ ఫాస్ఫేట్‌తో తయారవగా, దీని కింది పొర (డెంటిన్)లో అతిసూక్ష్మ వాహకాలు, దృఢమైన కణజాలం ఉంటాయి. లోపలి భాగంలోని మృదువైన పదార్థం (పల్ప్)లోనే రక్తనాళాలు, నాడులు ఉంటాయి. వయోజనుల్లో మొత్తం 32 పండ్లు (8 కత్తెరపండ్లు, 4 కోరపళ్లు, 8 రెండు బుడిపెల పండ్లు, మరో 8 నమలడానికి పనికి వచ్చే పండ్లు, 4 జ్ఞానదంతాలు) ఉంటాయి. చాలావరకు పండ్ల మనుగడ అంతా నోటి చిగుళ్ల ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుంది.

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

క్యాట్-2019

దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లలో 2019కిగాను మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే క్యాట్- 2019 నోటిఫికేషన్ విడుదలైంది.

- **క్యాంపస్‌లు:** అహ్మదాబాద్, అమృతసర్, బెంగళూరు, బుద్ధగయ, కోల్‌కతా, ఇండోర్, జమ్ము, కాశీపూర్, కోజికోడ్, లక్నో, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహతక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మూర్, తిరుచురాపల్లి, ఉదయ్‌పూర్, విశాఖపట్నం.
- **కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)- 2019**
- ఐఐఎంలో రెండు ప్రోగ్రామ్స్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. అవి.. పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ), మరొకటి ఫెలో ప్రోగ్రామ్స్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ)- డాక్టోరల్.
- **కోర్సులు:** పీజీపీ, పీజీపీ-ఎఫ్ఏబీఎం, ఈపీజీపీ, పీజీపీఈఎం, పీజీపీపీఎం, పీజీపీబీఏ, ఎంబీఏ, పీజీపీ-హెచ్ఆర్ఎం, ఈపీజీపీ, పీజీపీ-బీఎల్, పీజీపీ-ఎఫ్, పీజీపీ-ఏబీఎం, పీజీపీ-ఎస్ఎం, ఈపీజీపీఎక్స్, పీజీపీఈఎక్స్, పీజీపీఎం, పీజీపీబీఎం, పీజీపీఎం-హెచ్ఆర్, పీజీడీ, ఎఫ్‌పీఎం, పీహెచ్‌డీ (ఎఫ్‌పీఎం), డాక్టోరల్, ఈఎఫ్‌పీఎం, ఈపీహెచ్‌డీ.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం (ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీలకు 45 శాతం) మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1900/- (ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ. 950/-)
- **పరీక్ష కేంద్రాలు:** దేశవ్యాప్తంగా 156
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్టు 7
- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 18 (సాయంత్రం 5 గంటల వరకు)
- **హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్:** అక్టోబర్ 23 నుంచి నవంబర్ 24 వరకు
- **రాతపరీక్ష:** నవంబర్ 24
- **వెబ్‌సైట్:** www.iimcat.ac.in

బటిండాఎయిమ్స్‌లో

పంజాబ్ (బటిండా)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో ఖాళీగా ఉన్న గ్రూప్ బి/సీ పోస్టుల భర్తీకి పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్-చండీగఢ్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం పోస్టులు-** 199 (జనరల్-87, ఈడబ్ల్యూఎస్-18, ఓబీసీ-52, ఎస్సీ-28, ఎస్టీ-14)
- **పోస్టు పేరు:** గ్రూప్ బీ/సీ పోస్టులు
- **విభాగాలవారీగా:** గ్రేడ్-II నర్సింగ్ ఆఫీసర్ -150, గ్రేడ్-II లైబ్రేరీ అటెండెంట్ -1, గ్రేడ్-II ల్యాబ్ అటెండెంట్ -8, హాస్పిటల్ అటెండెంట్ (నర్సింగ్ ఆర్డర్లీ)-40 తదితర ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/బోర్డు నుంచి పదోతరగతి, జీఎన్ఎం సర్టిఫికెట్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. లైబ్రేరీ సర్టిఫికెట్‌తోపాటు అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 18 -30 ఏండ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 4
- **వెబ్‌సైట్:** www.pgimer.edu.in

దక్షిణ మధ్య రైల్వేలో

సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం స్పోర్ట్స్ కోటాలో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 21
- **విభాగాలవారీగా ఖాళీలు:** ఆర్చరీ-2, అథ్లెటిక్స్-4, బాల్‌బ్యాడ్మింటన్ -1, బాస్కెట్‌బాల్-2, బాక్సింగ్-1, చెస్-1, హ్యాండ్‌బాల్-2, హాకీ-1, కబడ్డీ-2, టెన్నిస్-1, వాలీబాల్-2, వెయిట్‌లిఫ్టింగ్-2.
- **అర్హత:** పదోతరగతి/ఇంటర్ లేదా ఐటీఐలో ఉత్తీర్ణత. వరల్డ్‌కప్(జూనియర్/సీనియర్), వరల్డ్ చాంపియన్స్ (జూనియర్/సీనియర్), ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్, సౌత్ ఏషియన్ గేమ్స్, వరల్డ్ రైల్వేలు, నేషనల్ గేమ్స్‌లో పాల్గొని ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 5,200-20,200+గ్రేడ్ పే రూ. 2000/1900/-
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-, ఎస్సీ/ఎస్టీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, ఈబీసీలు, మహిళా అభ్యర్థులకు రూ. 250/-
- **ఎంపిక:** స్పోర్ట్స్ ట్రయల్స్, పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను రిక్రూట్‌మెంట్ పర్సనల్ అధికారికి పంపాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 26
- **వెబ్‌సైట్:** www..scr.indianrailways.gov.in

ఐఐఎఫ్‌పీటీలో

తమిళనాడులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ (ఐఐఎఫ్‌పీటీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 4(అడ్జంక్ట్ ఫ్యాకల్టీ-1, ఎస్ఆర్ఎఫ్-2, జేఆర్ఎఫ్-1)
- **అర్హతలు:** సంస్థ నిబంధనల ప్రకారం
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/- (ఎస్సీ/ఎస్టీ/పీహెచ

'రణరంగం' చిత్రంలో కాజల్ అగర్వాల్

పిల్ల పిక్చర్ పర్‌ఫెక్ట్..

శర్వానంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రణరంగం'. సుధీర్‌వర్మ దర్శకుడు. కాజల్ అగర్వాల్, కల్యాణి ప్రియదర్శిని కథానాయికలు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 15న విడుదల కానుంది. ఈ సినిమాకు సంబంధించిన మూడో గీతాన్ని సోమవారం విడుదల చేశారు. 'పిల్ల పిక్చర్ పర్ఫెక్ట్..' అనే పల్లవితో సాగే ఈ గీతాన్ని కృష్ణచైతన్య రచించగా, సన్నీ ఎం ఆర్ స్వరాల్ని సమకూర్చారు. నిఖితగాంధీ ఆలపించారు. శర్వానంద్, కాజల్ అగర్వాల్‌పై ఈ పాటను చిత్రీకరించారు. మాస్‌క్లాస్ ప్రేక్షకుల్ని ఆకట్టుకునే విధంగా ఈ గీతాన్ని తెరకెక్కించామని, యువతరాన్ని హుషారెత్తించే పాట ఇదని చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాలో శర్వానంద్ గ్యాంగ్‌లీడర్ పాత్రలో కనిపించ బోతున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: దివాకర్ మణి, సంగీతం: ప్రశాంత్‌పిళ్లై, మాటలు: అర్జున్-కార్తీక్, దర్శకత్వం: సుధీర్‌వర్మ.

'డియర్ కామ్రేడ్' వందశాతం సంతృప్తినిచ్చింది!

చెర్రి, నవీన్ ఎర్నేని, రవిశంకర్, యష్ రంగినేని

''డియర్ కామ్రేడ్' సినిమాకు అన్ని ప్రాంతాల నుంచి చక్కటి స్పందన లభిస్తున్నది. మూడు రోజుల్లో 21 కోట్ల షేర్‌ను సాధించింది. తొలిరోజు కథాగమనం నిదానంగా ఉందనే ఫీడ్‌బ్యాక్ వచ్చింది. దాంతో పదమూడు నిమిషాల నిడివిని తగ్గించాం' అని అన్నారు నిర్మాత నవీన్. మైత్రీ మూవీ మేకర్స్, బిగ్‌బెన్ సినిమాస్ పతాకాలపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్‌చెరుకూరి, యష్ రంగినేని నిర్మించిన చిత్రం 'డియర్ కామ్రేడ్'. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించారు. భరత్‌కమ్మ దర్శకత్వం వహించారు. ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. సోమవారం హైదరాబాద్‌లో చిత్ర నిర్మాతలు పాత్రికేయులతో ముచ్చటించారు. నవీన్ మాట్లాడుతూ 'సినిమా నిలకడైన వసూళ్లను సాధిస్తున్నది. మరో రెండు, మూడు రోజుల్లో డిస్ట్రిబ్యూటర్స్ అందరూ సేఫ్ అవుతారు. క్యాంటిన్ సాంగ్ చాలా పాపులర్ అయ్యింది. ఈ పాట సినిమాలో ఉంటే బాగుండేదని రెండు రాష్ట్రాల ప్రేక్షకులు కోరడంతో ఆదివారం నుంచి ఈ గీతాన్ని సినిమాకు జతచేశాం. తెలుగుతో పాటు తమిళం,మలయాళ భాషల్లో ఆదరణ బాగుంది. నిర్మాతలుగా మాకు వందశాతం సంతృప్తిని మిగిల్చింది. మంచి సినిమా తీశామని మెచ్చుకుంటున్నారు. 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్‌తో 'హీరో' సినిమా నిర్మిస్తున్నాం. క్రాంతిమాధవ్‌తో విజయ్ చేస్తున్న సినిమా పూర్తయిన తర్వాత 'హీరో' షూటింగ్ తిరిగి మొదలుపెడతాం' అని తెలిపారు. యష్ రంగినేని మాట్లాడుతూ 'సామాజిక ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ చూడాల్సిన అవసరం ఉంది. సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా తెరకెక్కించాం. మీటూ సమస్య హాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు ప్రతి రంగంలో చర్చనీయాంశంగా మారింది. నిజజీవితంలో ఇలాంటి సంఘటనలు రోజు చూస్తూనే ఉన్నాం. తమకు ఎదురైన ఇబ్బందుల్ని ధైర్యంగా వెల్లడించడానికి భయపడుతున్న చాలా మందిలో ఈ సినిమా స్ఫూర్తిని నింపుతుందనే నమ్మకం ఉంది. విజయ్ ఇమేజ్‌కు తగినట్లుగా కథలో ఎలాంటి మార్పులు చేయలేదు. విజయ్‌కి బాగా నచ్చిన కథ ఇది. భరత్‌కమ్మ ఇష్టపడి రాసుకున్నారు. ముందుగా ఏదైతే అనుకున్నామో దానినే తెరపైకి తీసుకొచ్చాం. మైత్రీ మూవీస్ నిర్మాణంలో భాగస్వామిగా చేరడంతో మంచి సాంకేతిక నిపుణులు, లొకేషన్స్‌తో పెద్ద సినిమాలా తీర్చిదిద్దాం'అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్, చెర్రి పాల్గొన్నారు.

ఢిల్లీకి 'డిస్కోరాజా'

రవితేజ

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డిస్కోరాజా'. వి.ఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతున్నది. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ ఆగస్ట్ 4న ఢిల్లీలో ప్రారంభం కానుంది. రవితేజతో పాటు కథానాయికలు పాయల్ రాజ్‌పుత్, నభానటేష్‌లపై కీలక సన్నివేశాల్ని దర్శకుడు వి.ఐ ఆనంద్ చిత్రీకరించబోతున్నట్లు తెలిసింది. ఢిలీ షెడ్యూల్ తర్వాత చిత్రబృందం స్విట్జర్లాండ్‌కు పయనం కానుంది. ఎస్.ఆర్.టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తూళ్లూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సునీల్, రాంకీ, బాబీసింహా కీలక పాత్రలను పోషిస్తున్నారు. తమన్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూర్చుతున్నారు.

మాతృకలో మార్పులు చేయలేదు!


కోనేరు సత్యనారాయణ

'రాక్షస మనస్తత్వమున్న మనిషిని ఓ పోలీస్ ఎలా ఎదుర్కొన్నాడనే కథాంశంతో రూపొందించిన చిత్రమిది. ఆడపిల్లల పెంపకంలో తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే సందేశానికి వాణిజ్య హంగులు జోడించి తెరకెక్కించాం' అని అన్నారు కోనేరు సత్యనారాయణ. ఆయన నిర్మించిన తాజా చిత్రం 'రాక్షసుడు'. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించారు. రమేష్ వర్మ దర్శకత్వం వహించారు. ఆగస్ట్ 2న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో కోనేరు సత్యనారాయణ పాత్రికేయులతో ముచ్చటించారు.

నలభై ఏళ్లుగా విద్యారంగంలో ఉన్నాను. గతంలో నా తనయుడు హవీష్ నటించిన 'జీనియస్' సినిమాకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించాను. తొలిసారి పూర్తిస్థాయి నిర్మాణ బాధ్యతల్ని చేపట్టి నేను రూపొందించిన సినిమా ఇది. ఇకపై వరుసగా చిత్రాల్ని నిర్మించాలనే ఆలోచనలో ఉన్నాను. ఆ ప్రయత్నంలోనే భాగంగా తమిళంలో రూపొందిన 'రాక్షసన్' సినిమా చూశాను. భాష రాకపోయినా కథ, కథనాలు నాలో ఉత్కంఠను పంచాయి. మా అబ్బాయి హవీష్‌తో ఈ సినిమా చేయాలని అనుకొని పోటీ మధ్య హక్కులు తీసుకున్నాను. ఆ సమయంలో ఇదే తరహా కథతో హవీష్ ఓ సినిమా చేస్తుండటంతో బెల్లంకొండ శ్రీనివాస్‌ను హీరోగా తీసుకున్నాం. తన బాడీలాంగ్వేజ్‌కు పూర్తిగా సరిపోయిన కథ ఇది. పోలీస్ పాత్రలో ఒదిగిపోయాడు. నటనకు ఆస్కారం ఉన్న గ్లామర్ పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కనిపిస్తుంది. మాతృకను దర్శకుడు రెండేళ్ల పాటు కష్టపడి అద్భుతంగా రూపొందించాడు. అందుకే ఇంప్రూవైజేషన్ పేరుతో కథలో మార్పులు చేయకుండా మాతృకలోని ఆత్మను యథాతథంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాను. అదే మాటను దర్శకుడు రమేష్‌వర్మకు స్పష్టంగా చెప్పాను.

రైడ్ నచ్చడంతో..

సైకో కిల్లర్‌ను పట్టుకోవడం కోసం పోలీస్ సాగించే అన్వేషణ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. ఈ కథలో చూపించిన అంశం మాదిరిగానే సమాజంలో పలు సంఘటనలు జరిగాయి. అందుకే తెలుగు ప్రేక్షకులకు ఈ కథ కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది. రమేష్‌వర్మ రూపొందించిన 'రైడ్' సినిమా నన్ను బాగా ఆకట్టుకుంది. ఈ కథకు అతడు మాత్రమే న్యాయం చేయగలడనించి దర్శకత్వ బాధ్యతల్ని అప్పగించాను. క్లిష్టమైన కథను తెరపై అద్భుతంగా తెరకెక్కించాడు. అభిషేక్ నామా ప్రపంచవ్యాప్తంగా విడుదలచేస్తున్నారు. హవీష్‌కు సినిమాలపై ఆసక్తి ఎలా మొదలైందో తెలియదు. సరదాగానే తీసుకుంటాడని అనుకున్నాను. సినిమాల పట్ల అతడికి ఉన్న ప్రేమను గమనించి ప్రోత్సహించాలనే నిర్మాణ సంస్థను స్థాపించాను. సినిమాకు ప్రీప్రొడక్షన్ వర్క్ కీలకం. పూర్వ నిర్మాణ పనులు, పబ్లిసిటీ బాగుంటేనే సినిమా విజయవంతమవుతుందని ఈ చిత్రం ద్వారా నేర్చుకున్నాను. ఎంటర్‌టైన్‌మెంట్ యూనివర్సిటీ స్థాపించాలనే ఆలోచనలో ఉన్నాను. అలాగే మా నిర్మాణ సంస్థ ద్వారా హవీష్‌తో పాటు ఇతర హీరోలతో కొన్ని సినిమాలు చేయబోతున్నాను.

అపరబలశాలి 'అధీర'

'కేజీఎఫ్ చాప్టర్-2'లో సంజయ్‌దత్

యష్ కథానాయకుడిగా నటించిన కన్నడ చిత్రం 'కేజీఎఫ్' దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. కన్నడ, తెలుగు, తమిళ, హిందీ భాషల్లో దాదాపు 250కోట్ల కలెక్షన్స్ సాధించింది. కోలార్ బంగారు గని మాఫియా నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం పవర్‌ఫుల్ యాక్షన్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. ప్రస్తుతం ఈ సినిమాకు కొనసాగింపుగా 'కేజీఎఫ్ చాప్టర్-2'ను తెరకెక్కిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. సోమవారం ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అధీరగా సంజయ్‌దత్ అత్యంత శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. తలపాగా చుట్టుకొని రౌద్రంగా చూస్తున్న సంజయ్‌దత్ లుక్ సోషల్‌మీడియాలో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నది. ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధిశెట్టి కథానాయికగా నటిస్తున్నది. హోంబళే ఫిలింస్ సంస్థ నిర్మిస్తున్నది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. 'ఇప్పటికే మైసూర్ షెడ్యూల్ పూర్తయింది. ప్రస్తుతం బెంగళూరులో వేసిన కోలార్ మైన్స్ సెట్‌లో మూడో షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతున్నది. ఆగస్ట్ 23 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుతాం. అనంతరం కర్నాటక, బళ్లారి మైన్స్‌లో సంజయ్‌దత్ అధీరా పాత్రపై చిత్రీకరణ జరుపుతాం. వచ్చే ఏడాది వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని చిత్రబృందం తెలిపింది.

పదో తరగతి జ్ఞాపకాలతో..

కల్పలత, వేణుగోపాల్, విశ్వరాజ్, సాహితీ, రవిశేఖర్, మాధవి, స్వామి

'పదో తరగతి జ్ఞాపకాల్ని ప్రతి ఒక్కరికి గుర్తుచేసే సినిమా ఇది. టీనేజ్‌లోని ఎమోషన్స్‌ను వాస్తవికతకు దగ్గరగా ఈ సినిమాలో చూపించారు' అని అన్నారు నిర్మాత బెక్కెం వేణుగోపాల్. లక్ష్య, సాహితి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బాయ్'. అమర్ విశ్వరాజ్ దర్శకత్వం వహిస్తూ ఆర్.రవిశేఖర్‌రాజుతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆగస్ట్ 9న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను నిర్మాత బెక్కెం వేణుగోపాల్ విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ బాగుంది. పైసావసూల్ సినిమాగా నిలుస్తుందనే నమ్మకం ఉంది. కథపై నమ్మకంతో పీవీఆర్ సంస్థ ఈ చిత్రాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. దర్శకనిర్మాత అమర్ విశ్వరాజ్ మాట్లాడుతూ 'పాఠశాల రోజుల్ని పూర్తి చేసుకొని కాలేజీ ప్రాయంలోకి అడుగుపెట్టనున్న ఓ విద్యార్థి కథ ఇది. పదో తరగతిలో అతడు ఎదుర్కొన్న సమస్యలతో భావోద్వేగభరితంగా సాగుతుంది. లక్ష్య, సాహితి పాత్రలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటాయి. స్కూల్‌డేస్‌లోని మధుర జ్ఞాపకాలకు అందమైన దృశ్యరూపంగా ఉంటుంది. సెన్సార్ పూర్తయింది. క్లీన్ 'యు' సర్టిఫికెట్ లభించింది' అని తెలిపారు. తొలి ప్రేమను స్వచ్ఛంగా సినిమాలో ఆవిష్కరించారని రచయిత డార్లింగ్‌స్వామి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాహితి, మిర్చి మాధవి, కల్పలత, రవిశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వాలి సినిమా స్ఫూర్తితో..

నాగప్రభాకర్, పద్మనాభరెడ్డి

'ప్రేమ, హారర్, సస్పెన్స్ అంశాలతో సాగుతూ ఆద్యంతం థ్రిల్లింగ్‌ను పంచుతుంది. ఒకే అమ్మాయిని ప్రేమించిన ముగ్గురు అబ్బాయిల కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం ' అని అన్నారు ఏ.పద్మనాభరెడ్డి. యూ అండ్ ఐ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఆయన నిర్మించిన చిత్రం 'శివరంజని'. రష్మి, నందు, అఖిల్‌కార్తిక్, ఇంద్ర, నందినీరాయ్ ప్రధాన పాత్రల్లో నటించారు. నాగప్రభాకర్ దర్శకత్వం వహించారు. ఆగస్ట్ 2న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ 'రొమాంటిక్ ప్రేమకథా చిత్రమిది. శివరంజని ఎవరు? ఆమె ప్రేమించింది ఎవరిని అన్నది ఆసక్తిని పంచుతుంది. పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాం. ఇటీవల విడదలైన టీజర్, పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. రష్మి నటన, పాత్ర చిత్రణ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. 'రంగు' తర్వాత మా సంస్థ నుంచి వస్తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ ''వాలి' సినిమా స్ఫూర్తితో ఈ చిత్ర కథను రాసుకున్నాను. క్లైమాక్స్ ముందు రాసుకొని ఆ తర్వాత కథను డెవలప్ చేసుకున్నాను. కొత్తదనాన్ని కోరుకునే ప్రతి ఒక్కరిని ఈ సినిమా అలరిస్తుంది'అని చెప్పారు.

అంజలి

అమెరికన్ పోలీస్!

అంజలి అమెరికన్ పోలీస్‌గా మారిపోయింది. నేరపరిశోధన మొదలుపెట్టింది. ఆమె చేస్తున్న ఇన్వెస్టిగేషన్ మతలబు ఏమిటో తెలుసుకోవాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. వివరాల్లోకి వెళితే..అనుష్క, మాధవన్, అంజలి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'నిశ్శబ్దం'. హేమంత్ మధుకర్ దర్శకుడు. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్ర తొలి షెడ్యూల్‌ను ఇటీవలే అమెరికాలో చిత్రీకరించారు. ఈ సినిమాలో అంజలి పోలీస్ పాత్రలో కనిపించబోతున్నది. తలపై అమెరికన్ పోలీస్ టోపీ, కళ్లద్దాలను ధరించి చిరునవ్వులు చిందిస్తు తన లుక్‌కు సంబంధించిన వర్కింగ్ స్టిల్‌ను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకుంది అంజలి. కెరీర్‌లో తొలిసారి పోలీస్ పాత్రలో అంజలి నటిస్తున్న చిత్రమిదే కావడం విశేషం. అమెరికన్ పోలీస్ క్యారెక్టర్ కావడంతో వారి భావవ్యక్తీకరణ, గన్స్‌ను ఉపయోగించే తీరు, నేరస్తులతో వ్యవహరించే విధానం ఈ అంశాలన్నింటిలో ప్రత్యేక శిక్షణ తీసుకొని సినిమాలో నటిస్తున్నట్లు అంజలి తెలిపింది. క్రాస్ ఓవర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హాలీవుడ్ నటుడు మైఖేల్ మ్యాడ్‌సన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. కోన వెంకట్, టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళ్, హిందీ, ఇంగ్లీష్, మలయాళ భాషల్లో ఈ ఏడాది చివరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

శ్రీ మోనికా స్రవంతి ఆర్ట్స్ చిత్రం

హరికృష్ణ, ఫిదాగిల్

హరికృష్ణ, ఫిదాగిల్, అనూ నాయకానాయికలుగా శ్రీ మోనికా స్రవంతి ఆర్ట్ ప్రొడక్షన్స్ సంస్థ రూపొందిస్తున్న తాజా చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రఘు పతకమూరి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. మురళి శ్రీనివాస్ నిర్మాత. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డి క్లాప్‌ని వ్వగా, డైమండ్ రత్నబాబు కెమెరా స్విచాన్ చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'క్రైమ్ కామెడీ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఇటీవలకాలంలో వచ్చిన థ్రిల్లర్ సినిమాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ప్రతి సన్నివేశం ఉత్కంఠను పంచుతూ ప్రేక్షకుల్ని థ్రిల్‌కు చేస్తుంది' అన్నారు. 'ఈ చిత్రం ద్వారా మా అబ్బాయి హరిని కథానాయకుడిగా పరిచయం చేస్తున్నాం. ఆగస్ట్ 19 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుతాం. 15రోజుల పాటు హైదరాబాద్‌లో, 20రోజులు గోవాలో షెడ్యూల్స్ ప్లాన్ చేశాం' అని నిర్మాత తెలిపారు. మంచి కాన్సెప్ట్‌తో కూడుకున్న చిత్రమిదని, సస్పెన్స్ అంశాలతో పాటు వినోదానికి ప్రాధాన్యత ఉంటుందని హీరో హరికృష్ణ చెప్పారు. అనూ, విక్రమ్‌చారి, విజయ్, హరి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అఖిల్ వల్లూరి, సంగీతం: జగదీష్, కథ: శివప్రసాద్, సంభాషణలు: ముప్పూరి శివప్రసాద్, శివాని, పాటలు: భాస్కరభట్ల, దర్శకత్వం: రఘు పతకమూరి.